జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం, 22 జనవరి 2025 | సంపుటి: 17 | సంచిక: 349 | పేజీలు: 12 | వెల: రూ.5

RNI No : TELTEL/2008/24799

శ్రీ క్రోధి నామ సంవత్సరం ,మాఘ మాసము , ఉత్తరాయణము , శిశిర రుతువు,సూర్యోదయం : 06:37 AM , సూర్యాస్తమయం : 06:28 PM.దిన ఆనందాది యోగము : ముసల యోగము, ఫలితము: దుఃఖదాయకమైనది.

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


## జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం

### పోటీ నుంచి తప్పకున్న బీఆర్ఎస్

హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి): జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు నామినేషన్ను ఉపసంహరించుకోవడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక

మిగతా1 2లో..

## పదేళ్లుగా కృష్ణా వాటాల బీఆర్ఎస్ మౌనం

### ఇప్పుడేమో విమర్శలు చేస్తున్న నేతలు

### మండిపడ్డ ఎమ్మెల్సీ కోదండరామ్

హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి): తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన నీటి వాటాను ఇవ్వకుండా కేంద్రప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మెల్సీ, టీజేఎస్ చీఫ్ కోదండరాం ఫైర్ అయ్యారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్

మిగతా 2లో..

## ప్రపంచ శక్తి కేంద్రంగా భారత్

### భారత్ నుంచి ప్రపంచస్థాయి నాయకులు తయారుకావాలి

### ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్ష




న్యూఢిల్లీ,ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి): భారతదేశం నుంచి ప్రపంచస్థాయి నాయకులు తయారుకావాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. రాజకీయాలు, క్రీడలు, కళలు, మీడియా, ఆధ్యాత్మికం, బ్యూరోక్రసీ, వ్యాపారం సహా అన్ని రంగాల నుంచి ప్రపంచ స్థాయి లీడర్లు రావాలని ఆయన పిలుపునిచ్చారు. దిల్లీలోని భారత మండపంలో స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్షిప్ (సోల్) సదస్సును ప్రారంభించిన ప్రధాని మోదీ ప్రపంచ సమస్యలు, అవసరాలను తీర్చే మేధస్సు కలిగిన నాయకులు తయారు కావాలని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్ ప్రపంచ శక్తి కేంద్రంగా అవతరిస్తోందని మోదీ చెప్పారు. ఈ ఒరవడిని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లే శక్తిసామర్థ్యాలను నాయకులు అలవర్చుకోవాలని సూచించారు. ఈ మేరకు నాయకులను తయారుచేసే విషయంలో 'సోల్' గేమ్ఛేంజర్గా నిలుస్తుందని ఆయన ఆకాంక్షించారు. ఒకప్పుడు మహారాష్ట్ర నుంచి విడిపోయిన గుజరాత్ ఎలాంటి వనరులు లేకుండా ఎలా అభివృద్ధి చెందుతుందని అనే ఆందోళన వ్యక్తమైందని మోదీ గుర్తుచేశారు. అయితే ఆ రాష్ట్రంలో ఉన్న నాయకుల కారణంగానే గుజరాత్ మంచి

మిగతా 2లో..

## ట్రంప్ ఆరోపణలపై కూపీ లాగుతున్న ప్రభుత్వం

### ఎన్నికల ఖర్చు వ్యవహారంపై దృష్టి సారించిన అధికారులు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి): భారత్లో ఎవరినో గెలిపించడానికి గత అధ్యక్షుడు జో బైడెన్ రూ.182 కోట్ల నిధులను కేటాయించారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారయి. దీనిపై ప్రభుత్వం కూపీ లాగే పనిలో పడింది. ఈ వ్యవహారంపై తాజాగా భారత ప్రభుత్వం స్పందించింది. ఓటింగ్ను పెంచడం ద్వారా భారత ఎన్నికల్లో జోక్యం చేసుకునేందుకు యూఎస్ఎయిడ్ ప్రయత్నించిందనే వార్తలు తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్నాయని పేర్కొంది. దీనిపై సంబంధిత విభాగాలు దృష్టి సారించాయని వెల్లడించింది.

మిగతా 2లో..

కృష్ణా జలాలు ఏపీ తరలించుకుపోతున్నా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడటం లేదంటూ బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణపై రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఆనాడు వైఎస్ కు ఊడిగం చేసి కృష్ణా జలాలు సీమకు తరలించుకుపోయేందుకు సహకరించింది నువ్వు కాదా కెసిఆర్ అని ప్రశ్నించారు. నారాయణపేట "ప్రజా పాలన- ప్రగతి బాట"బహిరంగ సభలో ఆయన ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. వైఎస్ కుమారుడు జగన్ మోహన్ రెడ్డిని ఇంటికి పిలిపించి పంచభక్ష్య పరమాన్నాలు పెట్టి ఆరు గంటల పాటు చర్చించి రాయలసీమ ఎత్తిపోతల ద్వారా నీళ్లు తరలించుకు పోతుంటే చూస్తూ ఊరుకుంది నువ్వు కాదా .. ఇది ద్రోహం కాదా అని రేవంత్ ప్రశ్నించారు. నువ్వు చేసిన పాపం ఇవాళ రాష్ట్రాన్ని వెంటాడుతుంది నిజం కాదా పదేళ్లలో సాగునీటి మంత్రులుగా ఉన్నది హరీష్, కెసిఆర్ కాదా అని ప్రశ్నించారు. ఈ పాపం మీది కాకపోతే ఇంకెవరిదని ప్రశ్నించారు. నీళ్లు రాయలసీమ తరలించుకుపోతే.. నిధులు కెసిఆర్ కుటుంబం తరలించుకుపోయిందని మండిపడ్డారు.

# ఎవరి పాలన ఏందో తేలుద్దాం

## కేసీఆర్, మోడీ, నా పాలనపై చర్చచేద్దాం

- కేసీఆర్, కిషన్ రెడ్డిలకు సీఎం రేవంత్ బహిరంగ సవాల్
- పాలమూరు ప్రాజెక్టులను ఎండబెట్టిన ఘనత కేసీఆర్దే
- ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తా
- మెడికల్ కాలేజీకి చిట్టెం నర్సిరెడ్డి పేరు ఖరారు
- నారాయణపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన



నారాయణపేట,ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలన ..11 ఏళ్లు మోదీ పాలన.. ఏడాది కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సిఎం రేంవత్ అన్నారు. కేసీఆర్, కిషన్ రెడ్డి చర్చకు రావాలని అన్నారు.చర్చలో తాను ఓడితే ముక్కు నేలకు రాస్తానని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలకు ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.ప్రజాపాలన బాగలేదని ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 55 వేల ఉద్యగాలు ఇచ్చాం. .21 వేల కోట్ల రైతు రుణాలు మాఫీ చేశామని చెప్పారు. పరిశ్రమలు ,ప్రాజెక్టులు రాకుండా బీఆర్ఎస్,బీజేపీ అడ్డుకుంటుందని మండిపడ్డారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత మక్తల్, నారాయణపేట్ ,కొడంగల్ ప్రాజెక్టులను మొదలు పెట్టానన్నారు. కేసీఆర్ గట్టిగా కొడతానంటున్నావ్.. గట్టిగా కొట్టడానికి అది ఫుల్లా.. ఆఫా.. కొట్టాలనుకుంటే ముందుగా మీ బిడ్డను ,కొడుకును, అల్లుడిని కొట్టు..మమ్మల్ని కొడితే మా

మిగతా 2లో..



## ఇప్పటికే వాటాకు మించి నీటిని వినియోగించిన ఏపీ

- ఇకముందు వాడకుండా నిలువరించండి
- కృష్ణా బోర్డుకు తెలంగాణ ప్రభుత్వం లేఖ

### కృష్ణా యాజమాన్య బోర్డు భేటీ వాయిదా

### ఏపీ హాజరుకాక పోవడంతో నిర్ణయం



హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి): ఇప్పటికే వాటాకు మించి నీటిని ఉపయోగించుకున్న ఆంధ్రప్రదేశ్.. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీరు తీసుకోకుండా నిలువరించాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డును తెలంగాణ ప్రభుత్వం మరోమారు కోరింది. శుక్రవారం తలపెట్టిన బోర్డు ప్రత్యేక సమావేశం వాయిదా పడిన తరుణంలో తెలంగాణ నీటిపారుదలశాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ఈఎన్సీ అనిల్ కుమార్, నాగార్జున సాగర్ చీఫ్ ఇంజినీర్ అజయ్ కుమార్.. జలసౌధలో కేఆర్ఎంబీ ఛైర్మన్ అతుల్ జైన్ను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రాహుల్ బొజ్జా.. బోర్డుకు లిఖితపూర్వకంగా లేఖ అందించారు. ఏపీ ఇప్పటికే వాటాకు మించి నీటిని వాడుకొందన్న తెలంగాణ అధికారులు..

మిగతా 2లో..

## రైతులకు అందుబాటులో ఎరువులు

### యూరియా సరఫరాకు కేంద్రానికి తుమ్మల లేఖ

### అధికారులతో పరిస్థితులపై సమీక్ష

హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి): రైతులకు ఎరువుల కొరత రాకుండా అందుబాటులో ఉంచాలని వ్యవసాయశాఖ మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఏయే ఎరువుల ఎంతెత అవసరమో స్టాక్ పెట్టుకోవాలన్నారు. అరాష్ట్రంలో ఎరువుల సరఫరా లభ్యతపై రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖ సంచాలకులు మాట్లాడుతు, గత 5 సంవత్సరాల్లో అత్యధికంగా 2022-23 యాసంగిలో

మిగతా 12లో..

## ఫిర్యాదుదారు చనిపోతే విచారణ ఎలా చేస్తాం?

### మేడిగడ్డ బ్యారేజీ ఘటనపై హైకోర్టు వ్యాఖ్యలు


### భూపాలపల్లి కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలి

### హైకోర్టును ఆశ్రయించిన కేసీఆర్, హరీశ్రావు

మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనపై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ కేసీఆర్, హరీశ్ రావులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. గతంలో మేడిగడ్డ బ్యారేజీ లోపాల విషయంలో ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి మృతి చెందినట్లు మీడియా ద్వారా తెలిసిందని, ఫిర్యాదుదారు చనిపోయిన తర్వాత విచారణ ఎలా నిర్వహిస్తామని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఫిర్యాదుదారు మృతి చెందినా విచారణ నిర్వహించొచ్చని ఈ మేరకు కర్ణాటక హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులున్నాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. వాదనలు వినిపించడానికి గడువు కావాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావు కోరడంతో తదుపరి విచారణను హైకోర్టు సోమవారాని(ఫిబ్రవరి 24)కి వాయిదా వేసింది.

హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి): మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోవడానికి నాసిరకం నిర్మాణాలు, సరైన డిజైన్ లేకపోవడమే కారణమని భూపాలపల్లికి చెందిన రాజలింగమూర్తి అనే వ్యక్తి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టులో క్రిమినల్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ను విచారణను స్వీకరిస్తున్నట్లు జిల్లా కోర్టు గతేడాది జూలై 10న ఉత్తర్వులు జారీ చేసింది. కేసీఆర్, హరీశ్ రావుతో పాటు మరికొంత మందికి నోటీసులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేసీఆర్, హరీశ్ రావులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఫిర్యాదుదారు రాజలింగమూర్తి మొదట భూపాలపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రైవేటు పిటిషన్ దాఖలు చేయగా దానిని కొట్టేశారని, ఆ తర్వాత జిల్లా కోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారని కేసీఆర్ తరపు న్యాయవాది గత విచారణ సందర్భంగా కోర్టుకు తెలిపారు. జిల్లా కోర్టుకు విచారణ పరిధి లేకున్నా ఉత్తర్వులు జారీ చేశారని

మిగతా 2లో..



## కాంగ్రెస్కు భారీ షాక్

### పార్టీకి కోనేరు కోనప్ప రాజీనామా

హైదరాబాద్,ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో చేరిన వారు ఇమడలేకపోతున్నారు. బీఆర్ఎస్కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన కోనేరు కోనప్ప.. కొన్ని నెలలకే ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. ఇక నుంచి స్వతంత్రంగా ఉంటానని ప్రకటించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఆయన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి మద్దతకు ప్రకటించలేదు. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్నకు మద్దతుగా ఉంటానని ప్రకటించారు. గతేడాది మార్చి 6న సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్లో చేరిన కోనప్ప

మిగతా 12లో..

## తాజ్ బంజారాకు జీహెచ్ఎంసీ షాక్

### పన్ను కట్టనందకు హోటల్ సీజ్

హైదరాబాద్,ఫిబ్రవరి 21(ప్రజాజ్యోతి): హైదరాబాద్ సిటీలో ఫేమస్ అయిన తాజ్ బంజారా హోటల్కు జీహెచ్ఎంసీ అధికారుల షాక్ ఇచ్చారు. హైదరాబాద్ బంజారాహిల్స్ తాజ్ బంజారా హోటల్ను జీహెచ్ఎంసీ అధికారులు సీజ్ చేశారు. గత రెండేళ్లుగా పన్ను చెల్లించకపోవడంతో ఈ మేరకు అధికారులు సీజ్ చేశారు. పన్ను

మిగతా 12లో..

## పదేళ్లపాటు తెలంగాణను దోచకున్న కేసీఆర్

### తన కుటుంబాన్ని బంగారు మయం చేసుకున్నారు

### మార్పు తెస్తానని హామీలిచ్చిన రేవంత్.. అమలులో విఫలం

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీదే విజయమన్న కిషన్ రెడ్డి



మెదక్,ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి అభ్యర్థుల విజయం తథ్యమని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్రెడ్డి అన్నారు. బిజెపి మాత్రమే తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని అన్నారు. పదేళ్లపాటు తెలంగాణను కేసీఆర్ కుటుంబమంతా దోచుకుందని కిషన్రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ తన కుటుంబాన్ని బంగారు కుటుంబంగా చేసుకున్నారని విమర్శించారు. రాష్ట్రంలో మార్పు తెస్తామని చెప్పి రేవంత్రెడ్డి అధికారం లోకి వచ్చినా,ఆచరణలో అమలు చేయడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయి.. ప్రకటనలు ఫస్ట్ పేజీల్లో ఉన్నాయి.. పనులు మాత్రం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మంత్రుల్లో సఖ్యత లేదని చెప్పారు. కాంగ్రెస్కు వ్యతిరేకంగా ఎమ్మెల్సీ ఎన్నికల తీర్పు రానుందని జోస్యం చెప్పారు. శుక్రవారం మెదక్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల

మిగతా 2లో..

# సంపాదకీయం

## నేతల విద్యుత్ పాపాలు !

మసిపూసి మారేడుకాయ చందంగా ఇప్పుడు విద్యుత్ వ్యవస్థ తయారయ్యింది. పట్టణం, గ్రామాల్లో విద్యుత్ కోతలతో రైతులు, సామాన్య ప్రజానీకం నిత్యం కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. అప్పుడే సమస్యలు తీరుతాయి. గత కెసిఆర్ ప్రభుత్వం నిరంతర విద్యుత్ పేరుతో ఊదరగొట్టింది. అప్పులు చేసి విద్యుత రంగాన్ని కుప్పచేసిన వారు ఇప్పుడు మొసలు కన్నీరు కారుస్తు న్నారు నిజానికి విద్యుత్ బిల్లులు,విద్యుత్ కోతలు ముందునుంచీ తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్నాయి. ఇరు తెలుగు రాష్ట్రాల్లో వివిధ విద్యుత్ సమస్యలు వేధిస్తున్నాయి. గతంలో ప్రభుత్వాలు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోలేదు.లోపాలు బయటకు రాకుండా... లోపాల వార్తలను ప్రచురించ కుండా కట్టడి చేయించింది. ఇప్పుడేమో గతంలో అధికారంలో ఉన్న పార్టీ గగ్గోలు పెడుతున్నది. విద్యుత్ అందక ఆందోళనలు చేసిన రైతులు అప్పుడూ ఉన్నారు.. ఇప్పుడు కూడా ఉన్నారు. ఇప్పుడు అవే వార్తలను బలంగా ప్రచారం చేస్తున్న తీరు గత పాలకుల దుర్నీతిని తెలియ చేస్తోంది. తెలంగాణలో బెటర్‌మెంట్ ఛార్జీలతో షాక్‌లు ఇచ్చారు. విద్యుత్ ఛార్జీలను విపరీతంగా పెంచేశారు. ఇక ఎపిలో వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించడంతో పాటు..విద్యుత్ కోతలు ఆందోళనకు గురి చేస్తున్నాయి.. ఛార్జీల పెంపు ఇప్పటికే తడిసి మోపెడు చేశారు. తెలంగాణలో 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పినా నష్టాలను తట్టుకోలేని విధంగా తయారు చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు ఆందోళన కలిగించేలా ఉన్నాయి. వినియోగదారులకు దిమ్మతిరిగేల బిల్లులు వస్తున్నాయి. ఒక్కసారిగా వేల రూపాయల విద్యుత్ బిల్లులు చూసి వినియోగదారులు షాక్‌కు గురవుతున్నారు. కోలుకోలేని విధంగా విద్యుత్ చార్జీలు అప్పుడే పెంచేసారు.. విద్యుత్ వినియోగంలో పెరిగిన లోడ్‌కు సంబంధించి డెవలప్‌మెంట్ చార్జీల రూపంలో సెక్యూరిటీ డిపాజిట్‌లు వసూలు చేయడం వంటివన్నీ చేసేశారు. దీనిని కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సవరించాల్సి ఉంది. కిలోవాట్ లోడ్ జీఎస్‌టీతో కలుపుకుని సుమారు రూ.1500 డెవలప్‌మెంట్ చార్జీలు వడ్డించినట్లు నాటి విద్యుత్‌శాఖ అధికారులు చెప్పారు. బాయిలకాడ మీటర్లు పెట్టమని చెబుతూ వచ్చిన కెసిఆర్..ఇలా గృహ వినియోగ దారులపై ఎడాపెడా ఛార్జీలు వేసి ముక్కు పిండి వసూలు చేయించారు. ఘనత వహించిన పాలకుల కాలంలో వందల్లో వచ్చే బిల్లులు వేల రూపాయల్లో వచ్చాయి. వివిధ ఛార్జీల పేరుతో అదనపు బాదుడు సామాన్య, మధ్య తరగతి ప్రజలను షాక్‌కు గురిచేసాయి. వీటిని సవరించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎపిలో కూడా జగన్ హయాంలో విద్యుత్ చార్జీల భారం మోపారు. వాటిని కూడా అధికారంలోకి వచ్చిన టిడిపి సవరించడం లేదు. ఇళ్లలో ప్రతినెల రూ.200 నుంచి రూ.500లోపు విద్యుత్ బిల్లులు వస్తుండేవి. డెవలప్‌మెంట్ చార్జీలు ఒక్కసారి మాత్రమే వస్తాయని అవి తప్పనిసరిగా కట్టాల్సి ఉంటుందని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. ఈ భారం ఇప్పటికీ పడుతూనే ఉంది. ఇక ఎపిలో పరిస్థితి మరోలా ఉంది. పల్లెల్లో ఎప్పుడంటే అప్పుడు విద్యుత్ కట్ అవుతోంది. 9గంటల వ్యవసాయ విద్యుత్ అమలు కావడం లేదని రైతులు వాపోతున్నారు. విద్యుత్ కోసం రాత్రిళ్లు రైతులు పొలాల వద్ద పడిగాపులు పడుతున్నారు. లోడ్ పెరగడమే కారణం అంటున్న అధికారులు జిల్లాల్లో అనధికార విద్యుత్ కోతలు అమలు చేస్తున్నారు. కరెంటు ఎప్పుడు వస్తుందో ... ఎప్పుడు పోతుందో తెలియక ప్రజలు అల్లాడుతున్నారు. ముఖ్యంగా సమాచారం ఇచ్చేవారు లేకపోవడం తో విద్యుత్ మోటార్ల వద్ద రైతులకు కాలం గడుపుతున్నారు. వేసవి ప్రారంభం కాకుండానే ఇలా ఉంటే మున్ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల కాలం కావడంతో పట్టించుకునే వారు కరువయ్యారు. చిన్న పరిశ్రమలకూ విద్యుత్ కష్టాలు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో వరిసాగుకు నీరు అందటం లేదు. రాత్రిపూట ఫీడర్లు, సబ్‌స్టేషన్ల వారీగా కరెంటు ఇవ్వడంతో రైతులు వంతుల వారీగా రాత్రిపూటే పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇకపోతే గ్రామీణ ప్రాంతాల్లో అనధికార విద్యుత్ కోతలను అమలు చేశారు. ముఖ్యంగా విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిన సందర్భాల్లో గృహ విద్యుత్ వినియోగదారులకు సాయంత్రం, రాత్రి సమయాల్లో గంటనుంచి రెండుగంటల పాటు అనధికార కోతలు విధిస్తున్నారు. విద్యుత్ లోడ్ పెరిగిన సమయంలో అందుకు అనుగుణంగా డివిజన్ల వారీగా కోతలు విధిస్తున్నారు. రాబోయే రోజుల్లో ఈ కోతలు మరింత పెరిగే అవకాశముందని అధికార వర్గాల సమాచారం. వ్యవసాయ సర్వీసులకూ గంటనుంచి రెండు గంటలపాటు అనధికార కోతలు అమలు చేస్తున్నారు. వ్యవసాయ అవసరాలకు పగటిపూట 9 గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్న ప్రభుత్వ ప్రకటనలు క్షేత్రస్థాయిలో అమలు కావటం లేదు. పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండటం లేదని చెబుతున్నప్పటికీ చిన్నతరహా పరిశ్రమలకు కోతల బెడద తప్పటం లేదు. దీనితో రైతులకు తీవ్ర ఇక్కట్లు తప్పడం లేదు. రబీలో మొక్కజొన్న, జొన్న పంటలూ అధికంగా సాగు చేస్తున్నారు. ఈ పరిస్థితిలో 5గంటలకే కుదిస్తే ఎలాగని రైతులు మండిపడుతున్నారు. గ్రామీణ ప్రాంతంలో 5 గంటల నుంచి 8 గంటలపాటు విద్యుత్ కోత విధిస్తున్నారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో లోవోల్టేజ్ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. వ్యవసాయపంపు సెట్లకు ఉదయం 9గంటల విద్యుత్ సరఫరా చేయాల్సివుంది. అది సక్రమంగా అమలు కాకపోవడంతో మొక్కజొన్న, తెల్లజొన్న, అపరాల సాగుకు వ్యయ ప్రయాసలకోర్చి నీరు పెట్టుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. పట్టణ ప్రాతాల్లో రోజుమార్చి రోజు ఏదో ఒక ప్రాంతంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నారు. దీనితో ఐదు గంటలపాటు సరఫరా నిలిపివేస్తున్నారు. వేసవి ప్రారంభం ముందే కోతలు మొదలయ్యాయని ముందు ముందు పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఫిర్యాదుదారు చనిపోతే విచారణ ఎలా చేస్తాం?




మొదటిపేజీ తరువాయి..

వాదించారు. కేసీఆర్ తరపు న్యాయవాది వాదనతో ఏకీభవించిన హైకోర్టు, జిల్లా కోర్టు ఉత్తర్వులను సస్పెండ్ చేసింది. కేసీఆర్ పిటిషన్‌పై ఈరోజు హైకోర్టులో జరిగిన వాదనల సందర్భంగా జిల్లా కోర్టులో ఫిర్యాదుచేసిన రాజలింగమూర్తి మృతి చెందినట్లు కేసీఆర్ తరపు న్యాయవాది కోర్టుకు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై ఇక విచారణ అవసరం లేదని న్యాయమూర్తి అన్నారు.ఒకవేళ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసినా తిరిగి భూపాలపల్లి జిల్లా కోర్టులో విచారణ నిర్వహించాల్సి ఉంటుందని ప్రస్తావించగా, అక్కడ ఫిర్యాదు చేసిన వ్యక్తే మృతి చెందినప్పుడు ఇక విచారణ ఎలా? నిర్వహిస్తారని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఫిర్యాదుదారు మృతి చెందినా విచారణ కొనసాగించిన తీర్పులున్నాయని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించడంతో హైకోర్టు తదుపరి విచారణను 24వ తేదీకి వాయిదా వేసింది.మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తుపై స్టే ఎత్తివేయాలని పంజాగుట్ట పోలీసులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్థిరాస్తి వ్యాపారి చక్రధర్ గౌడ్ ఫిర్యాదుతో హరీశ్‌రావు, రాధాకిషన్‌రావులపై గతంలో కేసు నమోదైంది. ఫోన్ ట్యాపింగ్ చేశారన్న చక్రధర్ ఫిర్యాదుతో పంజాగుట్ట పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ ఎఫ్ఐఆర్ కొట్టేయాలని హరీశ్‌రావు, రాధాకిషన్ రావు వేర్వేరు పిటిషన్లు వేశారు.హరీశ్‌రావు, రాధాకిషన్ రావులను అరెస్ట్ చేయొద్దని ఇప్పటికే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. ఈ కేసులో గతంలో పంజాగుట్ట పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. హైకోర్టులో విచారణ ఉండగానే అరెస్టు చేస్తున్నారని హరీశ్ రావు లాయర్ కోర్టులో వాదనలు వినిపించారు. దర్యాప్తుపై స్టే ఎత్తేయాలన్న పోలీసుల పిటిషన్‌పై విచారణను హైకోర్టు 27వ తేదీకి వాయిదా వేసింది. బంజారాహిల్స్, ముషీరాబాద్ పీఎస్‌లలో నమోదైన కేసులపై విచారణను కొట్టివేయాలని కోరుతూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి సీఎం రేవంత్ రెడ్డి రూ. 25 వందల కోట్లు వసూలు చేసి దిల్లీకి పంపారని కేటీఆర్ ఆరోపించారు. కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ కార్యకర్త శ్రీనివాస్ రావు ఫిర్యాదుతో బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో విచారణను కొట్టివేయాలని కేటీఆర్, ముఠాగోపాల్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ రెండు పిటిషన్లపై విచారణను హైకోర్టు మార్చి 18వ తేదీకి వాయిదా వేసింది.

మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో భారాస అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది.

రాజలింగ మూర్తి ఫిర్యాదు మేరకు భూపాలపల్లి కోర్టు విచారణకు స్వీకరించి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. భూపాలపల్లి జిల్లా కోర్టు ఉత్తర్వులను కొట్టివేయాలని కోరుతూ కేసీఆర్, హరీశ్‌రావు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ సందర్భంగా కేసీఆర్, హరీశ్‌రావు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ జిల్లా కోర్టుకు విచారణార్హత లేకున్నా ఉత్తర్వులు జారీచేసినట్లు చెప్పారు. భూపాలపల్లి జిల్లా కోర్టులో ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి మృతి చెందినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

మీడియా ద్వారా తనకు ఈ విషయం తెలిసిందని న్యాయమూర్తి చెప్పారు. ఫిర్యాదు చేసిన వ్యక్తి మృతిచెందితే ఈ పిటిషన్‌పై ఎలా విచారణ చేపడతామని ప్రశ్నించారు. ఫిర్యాదుదారు మృతి చెందినా విచారణ కొనసాగించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోరారు. ఈ మేరకు సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులు ఉన్నాయన్నారు. వాదనలు వినిపించేందుకు గడువు ఇవ్వాలని కోరారు. అనంతరం తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేశారు.

## ఇప్పటికే వాటాకు మించి నీటిని వినియోగించిన ఏపీ

మొదటిపేజీ తరువాయి..

ఇక నుంచి ఉమ్మడి జలాశయాల నుంచి ఏపీ నీటిని తీసుకోరాదని తెలిపారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి ఏపీ నీటిని తీసుకోకుండా నిలువరించాలని డిమాండ్ చేశారు. మే నెల వరకు తెలంగాణకు 107 టీఎంసీల నీరు ఇవ్వాలని బోర్డుకు ఇండెంట్ ఇచ్చారు. ఇవాళ జరగాల్సిన ప్రత్యేక సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేయాలని ఆంధ్రప్రదేశ్ కోరినందున, ఆ రోజు సమావేశంలో చర్చించే వరకు శ్రీశైలం, సాగర్ నుంచి ఏపీ నీటిని తీసుకోకుండా చూడాలని తెలంగాణ అధికారులు కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పదేపదే విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ బోర్డు తగిన విధంగా స్పందించడం లేదని తెలంగాణ అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. కేంద్ర మంత్రి నుంచి ఆదేశాలు వచ్చినప్పటికీ అమలు చేయడం లేదని వ్యాఖ్యానించినట్లు సమాచారం. కృష్ణా నది యాజమాన్య బోర్డు ప్రత్యేక, అత్యవసర సమావేశం వాయిదా పడింది. సమావేశానికి తాము హాజరుకాలేమని, వాయిదా వేయాలని ఏపీ అధికారులు కోరారు. దీంతో సమావేశాన్ని సోమవారానికి బోర్డు వాయిదా వేసింది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సమావేశం జరుగనుంది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు సమాచారం అందించామని అధికారులు వెల్లడించారు. కాగా, శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి కృష్ణా నీటిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలిస్తున్నదని, వెంటనే అడ్డుకోవాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేఆర్ఎంబీకి ఫిర్యాదు చేశారు. రెండు ప్రాజెక్టుల పరిధిలో 35 చోట్ల టెలిమెట్రీ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో బోర్డు చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన శుక్రవారం మధ్యాహ్నం సమావేశం ఏర్పాటు చేసింది. అయితే ఏపీ విజ్ఞప్తితో సమావేశం వాయిదాపడింది. అయితే కృష్ణా, గోదావరి జలాలను ఏపీ తరలించుకుపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించిన విషయం తెలసిందే. 666 టీఎంసీలకు గాను ఏపీ ఇప్పటికే 657 టీఎంసీలను వినియోగించుకున్నదని, తెలంగాణకు 343 టీఎంసీలకు గాను 220 టీఎంసీలు మాత్రమే వినియోగించుకోవడం ప్రభుత్వ అసమర్థతేనని మండిపడ్డారు. ఇప్పటికైనా సర్కారు కండ్లు తెరిచి రైతుల పంటలు కాపాడలంటే తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటి విడుదలను వెంటనే బంద్ చేయించాలని డిమాండ్ చేశారు.



## ఎవరి పాలన ఏందో తేలుద్దాం

మొదటిపేజీ తరువాయి..

కార్యకర్తలు ఊరుకుంటారా? ఇచ్చిన హామీలను ఐదేళ్లలో పూర్తి చేసే బాధ్యత నాదే అని రేవంత్ అన్నారు. గత పాలకులు పాలమూరు జిల్లాను పట్టించుకోలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణపేటలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. 'పదేళ్ల పాటు ఏగ్రామంలో పేదలకు ప్రభుత్వ ఇళ్లు దక్కలేదు. ఇప్పుడు ప్రజా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించింది. పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదు. అంతకు ముందు ఎంపీగా గెలిపిస్తే.. ఏ నాడూ పాలమూరు గురించి పార్లమెంట్‌లో ప్రస్తావించలేదు. తెలంగాణ సాధించుకున్న తర్వాత కూడా ఈ జిల్లాకు న్యాయం జరగలేదు. గతంలో కొందరు సీఎంలు పాలమూరు పేరు చెప్పి రాజకీయం చేశారు కానీ, జిల్లాకు చేసిందేమీ లేదు. భీమ, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, సంగంబండం, కల్వకుర్తి ప్రాజెక్టుల పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదు. పదేళ్లలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేసి ఉంటే ఇవాళ చంద్రబాబుతో పంచాయితీ ఉండేది కాదు. వైఎస్ఆర్, జగన్ పోతిరెడ్డిపాడు ద్వారా కృష్ణా నీళ్లు రాయలసీమకు తరలించుకుపోతుంటే కేసీఆర్ నోరెత్తలేదు. నా మీద పగతో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ప్రాజెక్టును పక్కన పడేశారు. ప్రజా పాలన సరిగా లేదని విమర్శలు చేస్తున్నారు. పదేళ్లు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారు, 12 ఏళ్ల నుంచి మోదీ ప్రధానిగా ఉన్నారు, 12 నెలలుగా కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంది. ప్రతిపక్ష నేతగా కేసీఆర్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చర్చకు వస్తే ముఖ్యమంత్రిగా నేను సిద్ధం. గత పదేళ్ల పాలనపై చర్చిద్దాం.. చర్చలో ఓడితే ముక్కు నేలకు రాస్తా. పదేళ్లలో ఏమీ చేయని వాళ్లు ఏడాదిలోనే కాంగ్రెస్ ఏమీ చేయలేదని అంటున్నారు. పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు, పరిశ్రమలను అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్నారు. మోసగాళ్ల మాటలు విని భూసేకరణను అడ్డుకోవద్దు. భూమి కోల్పోయిన వారికి మంచి పరిహారం ఇచ్చి న్యాయం చేసే బాధ్యత నాదని సీఎం అన్నారు. ఇకపోతే ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం ఎన్ని వేల కోట్లయినా ఖర్చుచేస్తానన్నారు. నారాయణపేట జిల్లా అప్పకపల్లిలో మెడికల్ కాలేజీ,హాస్టల్ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్..70 ఏండ్ల తర్వాత మహబూబ్ నగర్ జిల్లా వ్యక్తికి సీఎం అయ్యే అవకాశం వచ్చింది. జిల్లా అభివృద్ధి కోసం చేయాల్సినవన్నీ చేస్తా. నా జిల్లా అభివృద్ధి కోసం ఎన్నివేల కోట్ల రూపాయలైనా రాష్ట్ర బడ్జెట్లో కేటాయిస్తా. జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటా. ఇక్కడి మెడికల్ కాలేజీకి చిట్టెం నర్సిరెడ్డి పేరు పెట్టాలని అదేశిస్తున్నా అని రేవంత్ అన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే పర్ణికా ఓ డాక్టర్ కావడం ఇక్కడి మెడికోల అదృష్టమన్నారు. మీ అవసరాలు ఎంఎల్ఏ కు చెప్పాల్సిన పనిలేదు. ఈ వృత్తి ఓ మానవీయ దృక్పథంతో చేయాల్సిన పని. ఇక్కడి పారా మెడికల్ సిబ్బందికి మిడిల్ ఈస్ట్ లో చాలా డిమాండ్ ఉంది.. ఆ కోవలో కూడా మీ ఉపాధి కోసం ప్రభుత్వం ఆలోచిస్తుంది. జీవితంలో ఇది చాలా కీలక సమయం.. మీరు వినియోగించుకుని చదువులో రాణించాలి. పేదలకు నాణ్యమైన వైద్యంఅందాలి. మారుమూల గ్రామాల పేదలకు వైద్య సేవలందిస్తాం. టీచింగ్,నాన్ టీచింగ్ స్టాఫ్ లేకుండా గొప్ప డాక్టర్లు కాలేరు. అద్దాల మేడలు అభివృద్ధి కాదని అంబేద్కర్ చెప్పారు. మెడికల్ కాలేజీలకు నిధుల లోటు రానివ్వం అని రేవంత్ అన్నారు.



## ప్రపంచ శక్తి కేంద్రంగా భారత్

మొదటిపేజీ తరువాయి..

అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లోనూ భారత్‌తోపాటు యావత్ ప్రపంచంలో తనదైన ముద్ర వేయగలిగిన లీడర్లు స్కూల్ ఆఫ్ అల్టిమేట్ లీడర్‌షిప్ నుంచి వస్తారని నాకు విశ్వాసం ఉంది. ఇక్కడ శిక్షణ తీసుకొని బయటకొచ్చిన యువకులు రాజకీయాల్లోనూ కీలక పాత్ర పోషించవచ్చు. ఏ దేశమైనా అభివృద్ధి సాధించింది అంటే సహజంగా అందులోని సహజవనరుల పాత్ర కీలకంగా ఉంటుంది. అంతకంటే ఎక్కువగా మానవవనరుల పాత్ర చాలా ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఈ సదస్సులో భూటాన్ ప్రధాని దషో షేరింగ్ తోబ్గే కూడా పాల్గొన్నారు. 'సోల్' అనేది నరేంద్ర మోదీకి వచ్చిన 'కళాత్మక ఆలోచన' అని తోబ్గే అభివర్ణించారు. భారతదేశానికి సేవ చేయడానికి అనుగుణంగా యువతను శక్తివంతం చేయడంలో మోదీకున్న అచంచలమైన నిబద్ధతకు ఇది నిదర్శమని పేర్కొన్నారు. మోదీని తన 'గురువు, అన్నయ్య'గా తోబ్గే పేర్కొన్నారు. ఆయనను కలిసినప్పుడు ప్రజా సేవకుడిగా మరింత కష్టపడి పనిచేయడానికి తనకు ప్రేరణ లభిస్తుందని అన్నారు.

## జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఏకగ్రీవం

మొదటిపేజీ తరువాయి..

ఏకగ్రీవం అయ్యింది. బలం లేకపోవడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు దూరంగా ఉన్నాయి. జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో 15 మంది సభ్యులకు గాను 17 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎంఐఎం నుంచి 8 మంది, కాంగ్రెస్ నుంచి ఏడుగురు, బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు తమ నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. దీంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. 15 మంది స్టాండింగ్ కమిటీలో ఎంఐఎం నుంచి 8, కాంగ్రెస్ నుంచి 7 సభ్యులు ఉండనున్నారు.గతంలో బీఆర్ఎస్ నుంచి ఇద్దరు కార్పొరేటర్లు నామినేషన్ వేయగా....అధిష్టానం ఆదేశంతో నామినేషన్లు విత్ డ్రా చేసుకున్నారు. గత పదేళ్లుగా స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అవుతూ వస్తున్నాయి. అలాగే గత పదేళ్లలో తొలిసారి కాంగ్రెస్ కార్పొరేటర్లు స్టాండింగ్ కమిటీలో చోటు దక్కించు కున్నారు. ఃగా.. జీహెచ్ఎంసీలో మొత్తం 150 మంది కార్పొరేటర్లు ఉంటే అందులో 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులను ప్రతీ ఏడాది ఎన్నుకోవడం జరుగుతుంది. జీహెచ్ఎంసీలో పాలనాపరంగా, కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలని అనుకున్నా మేయర్, డిప్యూటీ మేయర్ అనంతరం ఈ 15 మంది స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎంతో కీలకం. గడిచిన పదేళ్ల వ్యవధిలో ఇప్పటి వరకు జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరగలేదు. ప్రతీసారి కూడా ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగుతూనే ఉంది. ఈ సారి కూడా సంఖ్యాబలం లేకపోవడంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు తప్పుకోవడంతో స్టాండింగ్ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది.

## పదేళ్లుగా కృష్ణా వాటాల బీఆర్ఎస్ మౌనం

మొదటిపేజీ తరువాయి..

పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, టీజేఎస్ తరపున గట్టిగానే నిలదీస్తామని స్పష్టం చేశారు. నాంపల్లిలోని ఆఫీసులో ఆయన మీడిఆయతో మాట్లాడిన ఆయన.. 'తెలంగాణ ఉద్యమానికి మూల కారణాలైన వాటిలో నీళ్ల పంపకం ఒకటి. కృష్ణాజలాల నీటి వివాదంపై గత పదేండ్లు అధికారంలో ఉండి కూడా మాట మాట్లాడకుండా ఉన్న బీఆర్ఎస్ నేతలు.. ఇపుడు ప్రతిపక్షంలోకి వచ్చేసరికి తాము పోరాటం చేస్తామని ముందుకు రావడం హాస్యాస్పదంగా ఉంది.. . గత పదేండ్లలో మీరు మౌనం వహించడం వల్లే.. ఈరోజు ఈ పరిస్థితి ఏర్పడింది' అని మండిపడ్డారు.తెలంగాణలో ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నామని ఎమ్మెల్సీ, టీజేఎస్ చీఫ్ కోదండరాం తెలిపారు. కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీగా అశోక్ కు, నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ స్థానంలో గోపాల్ రెడ్డికి మద్దతిస్తామన్నారు.

## పదేళ్లపాటు తెలంగాణను దోచకున్న కేసీఆర్

మొదటిపేజీ తరువాయి..

ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మాత్రమే అన్ని స్థానాలకు పోటీచేస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ భవిష్యత్‌కు ఎమ్మెల్సీ ఎన్నికలు దిశానిర్దేశం చేసేవని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల అన్నివర్గాల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని ఆరోపించారు. రేవంత్ ఇచ్చిన ఏ ఒక్క హామీని ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ




చేస్తామని.. మిగిలిన యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి రేవంత్ ప్రభుత్వం చేతులు ఎత్తేసిందని మండిపడ్డారు. ప్రతి దళిత కుటుంబానికి రూ 12లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచారని మండిపడ్డారు.తెలంగాణ రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దివాళా తీసిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన ఐదు డీఏలపై రేవంత్ ఎందుకు నోరుమెదపడం లేదని ప్రశ్నించారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వడం లేదని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ పోయి రేవంత్ వచ్చిన కూడా ప్రజల బతుకులు మారడం లేదని చెప్పారు. రానున్న రోజుల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వాలు ఉన్నచోట అభివృద్ధి వేగంగా జరుగుతోందని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో అవినీతికి పెద్దపీట వేశారని ఆరోపించారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉన్న రాష్ట్రాల్లో మంచి పాలన జరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణలో మంచి పాలన రావాలంటే డబుల్ ఇంజన్ సర్కార్ రావాలని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత అన్ని వర్గాల సమస్యలపై ఉద్యమిస్తామని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## ట్రంప్ ఆరోపణలపై కూపీ లాగుతున్న ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి..

యూఎస్ కార్యకలాపాలు, నిధులకు సంబంధించి అమెరికా ప్రభుత్వ యంత్రాంగం వెల్లడించిన సమాచారాన్ని చూశాం. అవి తీవ్ర కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా భారత అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యం ఆందోళనలకు దారితీశాయి. ఈ దశలో దీనిపై బహిరంగంగా మాట్లాడటం తొందరపాటే అవుతుంది. సంబంధిత అధికారులు ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తున్నారు. పూర్తి సమాచారం వచ్చిన తర్వాతే దీనిపై మరిన్ని వివరాలు వెల్లడిస్తాం' అని భారత విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ వెల్లడించారు.ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టిన తర్వాత వివిధ దేశాలకు అమెరికా చేసే సాయంపై పునఃసమీక్ష చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఇందులో భాగంగా యూఎస్ఎ యిడ్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ క్రమంలో భారత్‌లో ఓటింగ్ శాతం పెంచేందుకు 21 మిలియన్ డాలర్లు యూఎస్ఎయిడ్ ఖర్చు చేసిందనే విషయాన్ని డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఆ దేశంలో మరెవర్నో గెలిపించేందుకు వారు (బైడెన్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ) ప్రయత్నించినట్లు అర్థమవుతోందన్న ఆయన.. ఈ విషయాన్ని భారత్‌కు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు.



## ఒక్కరోజు కూడా కాలేదు...అప్పుడే విమర్శలా

### మాజీ సిఎం అతిశీ వ్యాఖ్యలపై సిఎం రేఖాగుప్తా మండిపాటు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి): భాజపా ఎన్నికల వాగ్దానాలను నెరవేర్చలేదంటూ దిల్లీ మాజీ సీఎం ఆతిశీ చేసిన విమర్శలను కొత్త సీఎం రేఖా గుప్తా తిప్పికొట్టారు. ఒక్కరోజుకే విమర్శలు చేయడం దారుణమని అన్నారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆప్ 13 ఏళ్లు దిల్లీని పాలించాయి. ఇన్నేళ్లపాటు మీరేం చేశారో చూసుకోకుండా.. అధికారంలోకి వచ్చి ఒక్కరోజు కూడా కానీ మాపై విమర్శలు చేస్తారా.. మొదటిరోజే మేం క్యాబినెట్ సమావేశం జరిపాం. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆయుష్మాన్ భారత్ యోజనను అందుబాటులోకి తీసుకువచ్చాం. దాంతో ప్రజలకు రూ.10లక్షల మేర వైద్యసహాయం అందనుంది. ఈ పథకాన్ని ఆప్ అమలు చేయలేదు. మమ్మల్ని ప్రశ్నించే హక్కు వారికి లేదు. ప్రధాని మోదీ నాయకత్వంలో దిల్లీ తన హక్కులన్నీ పొందుతుంది. ముందు మీరు మీ పార్టీ గురించి చూసుకోండి. ఎంతోమంది మీ పార్టీని వీడాలని చూస్తున్నారు. కాగ్ రిపోర్ట్‌ను అసెంబ్లీలో పెడితే అందరి జాతకాలు బయటపడతాయని ఆందోళన చెందుతున్నారని రేఖ దుయ్యబట్టారు. దిల్లీలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థికసాయం అందించే పథకాన్ని మొదటి క్యాబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని భాజపా హామీ ఇచ్చిందని, కానీ మొదటిరోజే దానిని ఉల్లంఘించిందని ఆతిశీ విమర్శించారు. దీనిపైనే సీఎం స్పందన వచ్చింది. నిన్న రామ్‌లీలా మైదానంలో భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య వైభవంగా నిర్వహించిన కార్యక్రమంలో దిల్లీ 9వ ముఖ్యమంత్రిగా రేఖాగుప్తా ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. ప్రమాణ కార్యక్రమం ముగిసిన వెంటనే ఆమె సచివాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి 8 నాటికి అర్హులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో నెలవారీ ఆర్థిక సహాయం రూ.2,500 జమ చేస్తామని తెలిపారు. దిల్లీ అభివృద్ధి కోసం ఒక్కరోజు కూడా వృథా చేయకుండా శ్రమిస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న 14 కాగ్ రిపోర్టులను అసెంబ్లీ తొలి సమావేశాల్లోనే సభలో ప్రవేశపెడతామని చెప్పారు. ఆమె అధ్యక్షతన దిల్లీ సచివాలయంలో గురువారం రాత్రి 7 గంటల సమయంలో తొలి మంత్రివర్గ భేటీ జరిగింది. అనంతరం మంత్రులందరితో కలిసి యమునా ఘాట్ వద్దకు వెళ్లి హారతి నిర్వహించారు.

**PUBLIC NOTICE**

I, the undersigned have lost my passport bearing **No. M976391** issued by the Passport Authority at Hyderabad. Despite efforts could not be traced out. If it is traced out or found by anybody may return to the given address mentioned below.

**D. Susheel Kumar**
S/o Shashikanth Rao
H.No: 9-54/1, Lane No.8
Teachers Colony, Adilabad-504001
**Cell: 9912700146**

## ఈ నెల23న 5వ తరగతి ప్రవేశ పరీక్ష

**- ప్రిన్సిపాల్ అంబడిపూడి శారద**

**సిర్పూర్(టి) ప్రజాజ్యోతి ఫిబ్రవరి22 :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఆధ్వర్యంలో 5వ తరగతి నుండి 9వ తరగతుల్లో ప్రవేశాలకై నిర్వహించబడుతున్న సాధారణ ప్రవేశ పరీక్ష (సెట్-2025) ఈ నెల 23 (ఆదివారం) రోజున నిర్వహించనున్నట్లు సిర్పూర్-టి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (డి.పి.ఐ.పి) ప్రిన్సిపాల్ శ్రీమతి అంబడిపుడి శారద తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా సెంటర్లో (సెంటర్ కోడ్-250406) ఐదు నుంచి తొమ్మిది వ తరగతి వరకు రాసే అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని తెలియపరిచారు. పరీక్షకు వచ్చేటప్పుడు ఎగ్జామ్ పాడ్, హాల్ టికెట్, బ్లూ ఇంకు లేదా బ్లాక్ ఇంకు పెన్, తీసుకొని ఉదయం 9:00 గంటలకు ఎగ్జామ్ సెంటర్ దగ్గరకు చేరుకోగలరని తెలియజేశారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని గెలిపిద్దాం



**నార్నూర్. (ప్రజాజ్యోతి 21 ఫిబ్రవరి):** నార్నూర్ ఉమ్మడి మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు డిసిసి అధ్యక్షులు విశ్వ ప్రసాద్,పిసిసి నాయకురాలు రావాలి రెడ్డి, ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మరియు పట్టభద్రుల ఎన్నికల మేనిఫెస్టో విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పట్టపద్రులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు దేవరావ్ లోకండే,సీనియర్ నాయకులు వుత్తం రాథోడ్, కర్మాన్కర్ బిరాజులాల్,యూత్ ఉపద్యకడు,మహమ్మద్,నసిర్,యువ కాంగ్రెస్ నాయకులు,కోరేల మహేందర్,కాంతరవ్ దుర్గే,జకీరుల ఖాన్,జాదవ్ కైలాష్, జకీర్ ఖాన్ మండల కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## మండలంలో ఉన్న పట్టభద్రులు నిర్మల్‌లో జరిగే ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయాలి



**లక్ష్మణ చాంద, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి) :** నిర్మల్ జిల్లాలో ఈనెల 24వ తేదీ సోమవారం రోజున కొండాపూర్ గ్రామంలో గల చంద్రశేఖర్ ఫంక్షన్ హాల్ లో జరిగే పట్టభద్రుల సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారని లక్ష్మణ చాంద మండలంలో ఉన్న పట్టభద్రులు హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్ తెలిపారు. ఆయన శుక్రవారం రోజు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి మద్దతు ఇచ్చి వారి గెలుపుకు కృషి చేయాలని కోరారు. పట్టభద్రులు హాజరై ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మేకల రాజేందర్, నాయకులు మల్లేష్, నారాయణ, నరేష్ పాల్గొన్నారు.

## నూతన హనుమాన్ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన

**లక్ష్మణ చాంద, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి) :** మండలం లోని మల్లాపూర్ గ్రామంలో నూతన హనుమాన్ ఆలయ విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు 23 వ తారీకు వరకు కొనసాగు తాయని గ్రామ కమిటీ సభ్యులు వీడీసీ సభ్యులు తెలిపారు. ఇందులో హనుమాన్ పంచాయతన ధ్వజ, యంత్ర, శిఖర ప్రాణ ప్రతిష్ట, మూర్తి ప్రతిష్ట , వాస్తు హోమము, పూర్ణాహుతి వివిధ కార్యక్రమాలు జరుగు తు న్నాయని తెలిపారు. నేటి నుండి ఆదివారం వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఈ ఉత్సవాలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని గ్రామస్తులు కోరుతున్నారు.

## గ్రామాలలో పారిశుద్ధ లోపం లేకుండా చూడాలి






**లక్ష్మణ చాంద, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి) :** గ్రామంలో ఎక్కడ పారిశుద్ధ లోపం లేకుండా సిబ్బంది పని చేయాలని ఎంపీడీవో రాధా రాథోడ్ తెలిపారు. శుక్రవారం రోజున లక్ష్మణ చాంద గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సిబ్బంది చెత్తను సేకరించి తడి పొడి చెత్త వేరుచేసి నాణ్యమైన ఎరువును తయారు చేయాలని అన్నారు. నర్సరీ, స్మశాన వాటికను ప్రతి రోజు సందర్శించాలని తెలిపారు. వారానికి ఒకసారి పాఠశాలలు ప్రధాన వీధులలో వాకింగ్ చేయాలని సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచు కొని త్రాగునీటి సమస్య ఉండకుండా చూడాలని విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. పుట్టపల్లి గ్రామ పంచాయతీ లో తడి పొడి చెత్తను సేకరించి దాదాపు 280 కిలోల నాణ్యమైన ఎరువులు తయారు చేసి నందుకు పంచాయతీ కార్యదర్శిని వారి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నజీరుద్దీన్, పంచాయతీ కార్యదర్శి రాకేష్, గ్రామ పంచాయతీ సిబ్బంది అక్బర్, అఫ్జల్ వారి సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లాలో ఎమ్మెల్సి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు

**- కలెక్టర్ అభిలాష అభినవ్**





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21 ప్రజాజ్యోతి :** ఎమ్మెల్సి ఎన్నికల నిర్వహణ పై సిఈఓ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో ఎమ్మెల్సి ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని నిర్మల్, బైంసా డివిజన్ లలోని మండల కేంద్రాలలో మొత్తం 46 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 21 లొకేషన్ లలోని పోలింగ్ కేంద్రాలను 8 రూట్లలో విభజించామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు కల్పిస్తున్నామని, ర్యాంప్, వీల్ చైర్, త్రాగునీరు, మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఓటరు స్లిప్ల లను పంపిణీ చేస్తున్నామని, ఎన్నికల సిబ్బందికి ఇప్పటికే శిక్షణలు అందించామని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓలు రత్నకల్యాణి, కోమల్ రెడ్డి, జడ్పి సీఈఓ గోవింద్, డిపిఓ శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికై సమతా భారత్ ఐక్య వేదిక చేయూత









**వాంకిడి, ఫిబ్రవరి 21( ప్రజా జ్యోతి) :** వాంకిడి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమతా భారత్ ఐక్యవేదిక వారి ఆధ్వర్యంలో పాఠశాలలో గ్రంథాలయానికి పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు ,గ్రంథాలను సమతా భారత్ ఐక్య వేదిక ప్రతినిధులు జాడి.అన్న రావు, జాడి.ఆనంద్ రావు, డోంగ్రి. ప్రవీణ్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు నటరాజన్, ఉపాధ్యాయుల సమక్షంలో అందజేసి, పాఠశాల అభివృద్ధి కోసం పదివేల రూపాయల చెక్కును అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా సమతా భారత్ ఐక్య వేదిక ప్రతినిధులు జాడి.అన్నారావు, జాడి.ఆనంద్ రావు మాట్లాడుతూ పాఠశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులుగా వారి సామాజిక బాధ్యతగా, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చిచ్చర పిడుగులు వారిని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పాఠశాలలో చదువుకున్న రోజుల్లో వారి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ చదువుకు పేదరికం అడ్డురాదని, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని, లక్ష్యాన్ని సాధించడానికి క్రమశిక్షణ, నిబద్ధత భావంతో, కఠోర శ్రమతో కృషి చేస్తే జీవితంలో ఏ రంగాల్లో నైనా రాణించవచ్చునని, విద్యార్థులు ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగుతూ తమ గమ్యాలను చేరుకొని జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. రానున్న పదవ తరగతి పరీక్షల్లో మేరిట్ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా తగిన పారితోషికం అందజేయనున్నట్లు, విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి సమతా భారత్ ఐక్య వేదిక వారి సహాయ సహకారాలు ఎల్లపుడూ అందిస్తామని తెలుపుతూ, విద్యార్థులు ఉన్నతంగా రాణించి పాఠశాలకు,తల్లి,తండ్రులకు, ఉపాధ్యాయు లకు, గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు నాగరాజ్,శ్రీనివాస్, సంతోష్, చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్ వైజర్ దుర్గం. పీతాంబర్, స్వరాజ్,షారుఖ్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు వద్దు.. ఆడపిల్లల చదివే ముద్దు

- చైల్డ్ హెల్ప్ లైన్ 1098 పై అవగాహన కార్యక్రమం
- బాల్య వివాహాలను రూపుమాపాలి
- బడి బాటే భవిష్యత్తు కావాలి
- ఆడపిల్ల భారం కాదు బాధ్యత భవిష్యత్తు
- బాల్యవివాహాల 1098కు కాల్ చేయండి
- చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్




**బోథ్, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి) :** బోథ్ మండల కేంద్రంలోనీ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం బాల్య వివాహ ముక్త్ భారత్ , చైల్డ్ హెల్ప్ లైన్ 1098 పోక్సో చట్టం పై చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడుతూ పిల్లలు చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే పిల్లల హక్కులకు ఎటువంటి భంగం కలిగిన చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ కు సమాచారం అందించాలని పేర్కొన్నారు. అదే విధంగా ప్రధానమంత్రి ఇచ్చిన పిలుపుమేరకు భారతదేశాన్ని బాల్య వివాహ ముక్తభారత్ గా మార్చాలని అందరూ చదువు పై శ్రద్ధ చూపి తల్లిదండ్రులకు దేశానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ముఖ్యంగా బాల్య వివాహాలు వద్దు ఆడపిల్లల చదివే ముద్దు కావాలని , ప్రతి ఒక్క తల్లి తండ్రి ఆడపిల్లలు భారం అనుకోకుండా వారి బాధ్యత భవిష్యత్తును కీర్తించడానికి ప్రయత్నించాలని తెలిపారు. అనంతరం డీసీపీయు కౌన్సిలర్ మాట్లాడుతూ చిన్నపిల్లల పెళ్లిళ్ల వల్ల జరిగే అనర్థాల గురించి, పిల్లలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పిల్లల భవిష్యత్ ప్రణాళిక ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిపియు సోషల్ వర్కర్ రవికాంత్, డిసిపియు ఔట్ రిచ్ వర్కర్ అశ్విని, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు రాకుండ చర్యలు చేపట్టాలి

**కలెక్టర్ అభిలాష అభినవ్**





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21 ప్రజాజ్యోతి :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ అభిలాష అభినవ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వేసవి కాలంలో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో నీటి లభ్యత తగ్గడం, నీటి మట్టాలు పడిపోవడం వంటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా మిషన్ భగీరథ ద్వారా త్రాగు నీరు అందించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న జలాశయాలు, బోర్లు, చెరువుల స్థితిని సమీక్షించాలని, తాగునీటి మూలాలను పరిశు భ్రంగా ఉంచి, తాగునీటి కొరత ఎదురవుతున్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాల ఆదేశించారు. నీటి పొదుపు, సరైన వినియోగం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. వ్యవసాయ, నీటిపారుదల శాఖ అధికారులు పంటలకు నీటి కొరత రాకుండా రైతులతో సమీక్షించి పరిస్థితులను పర్యవేక్షించాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అధిక ఉష్ణోగ్రతల వలన చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, ఉపాధి హామీ కూలీలు, సిబ్బంది తగు జాగ్రత్తలు పాటించేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ప్రాథమిక కేంద్రంలో అవసరమైన మందులను ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎండాకాలంలో అటవీ ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అటవీ, సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలోని మున్సిపాలిటీలలోని ఆయా వార్డులలో త్రాగునీటి కొరతను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. బోరు బావులకు అవసరమైన మరమ్మత్తులు చేయించాలని సూచించారు. అలాగే డబుల్ బెడ్ గదుల ఇండ్ల ప్రాంతాలలో నీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన నీటిని నిరంతరం సరఫరా చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పశువులకు త్రాగునీటి సమస్యలు రాకుండా ఆయా ప్రాంతాలలో నీటి తొట్టెలను ఏర్పాటుచేయాలని, వాటికి వేసవిలో వచ్చే జబ్బుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫైర్, పోలీస్ శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి నాగిని భాను, ఆర్డీవోలు రత్న కళ్యాణి, కోమల్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో గోవింద్, డిపిఓ శ్రీనివాస్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, డిసిహెచ్ఓ సురేష్, కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్లు, ఎంపీడివో లు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మాతృభాష మన విజయానికి పునాది

**బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్**







**బెల్లంపల్లి, ఫిబ్రవరి 21(ప్రజాజ్యోతి) :** ఎవరు ఎంతటి ఎత్తులకు ఎదిగినా అందుకు ప్రాథమిక విద్యాభ్యాసం నుంచి ఉపయోగపడిన మాతృభాష పునాదిరా యిలా నిలుస్తుంది అనడంలో సందేహం లేదని బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ అన్నారు. కళాశాల తెలుగు విభాగం అధ్యక్షులు తమటం రేణుబాబు గౌడ్ డాక్టర్, అధ్యాపకులు డాక్టర్ కంబాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం "అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని" నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాతృభాషా ఔన్నత్యం గురించి వక్తలు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

**పోటికి తగ్గట్లుగా అభ్యసించాలి :** విద్యార్థులు మాతృభాషలో విద్యను అభ్యసిస్తూనే ప్రపంచ పోటీ వాతావరణా నికి అనుగుణంగా ఇతర భాషలను, విజ్ఞానాన్ని కూడా అభ్యసించాలని ప్రిన్సిపల్ డాక్టర్ కాంపల్లి శంకర్ పిలుపునిచ్చారు. కళాశాలకు ప్రతిరోజు హాజరవుతూ బాగా చదువుకోవాలని సూచించారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఇంత చక్కగా కార్యక్రమాన్ని నిర్వహించినందుకు తమటం రేణుబాబు గౌడ్, డాక్టర్ కంబాల మురళీకృష్ణను అభినందించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా మాతృభాషకు ప్రస్తుతం చక్కని ప్రాధాన్యం లభిస్తుందని వక్తలు గుర్తు చేశారు. అలా సాధించుకున్న మాతృభాష ఆవశ్యకతను మనం గౌరవిం చుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్, తెలుగు విభాగ అధ్యక్షులు తమ టం రేణుబాబు గౌడ్, అధ్యాపకులు డాక్టర్ కంబాల మురళీకృష్ణ, అసిస్టెంట్ ప్రొపె సర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం అభినందనీయం - సిఐ శశిధర్ రెడ్డి





**మందమర్రి, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి) :** మందమర్రి పట్టణంలోని అంగడి బజార్ కేంద్రంగా బస్తీ ప్రజలు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం పట్టణ సిఐ శశిధర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ సీసీ కెమెరాల ఉపయోగం మరియు అవగాహన కల్పించారు. కాలనీ వాసులు ముందుకు రావడంతో పాటు నాలుగు కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని అన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు చేయడానికి సహకరించిన అంగడి బజార్ కాలనీ ప్రజలకి అభినందనలు తెలిపారు.సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని సిసి కెమెరాలు ఉన్న ప్రాంతాలలో ఎలాంటి కేసులు నమోదు కావడం లేదని, ఏ చిన్న సంఘటన జరిగినా సీసీ కెమెరాల ద్వారా వెంటనే తెలుసుకోవచ్చని, సీసీ కెమెరాలు మరింత భద్రత కల్పిస్తాయని,సీసీ కెమెరాల ద్వారా ఈ మధ్యకాలంలో చాలా కేసులు చేదించడం జరిగిందని అన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు లేని కాలనీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు.ప్రతి ఒక్కరూ సిసి కెమెరాల ఏర్పాటుకు ముందుకు రావడం ద్వారా నేరరహిత అకృత్యాలు అసాధ్యమని అన్నారు.సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేసిన కాలనీ వాసులను సిఐ శశిధర్ రెడ్డి, స్థానిక ఎస్సై రాజశేఖర్ తో కలిసి సన్మానించారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డిని గెలిపించండి

**మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి**





**బెల్లంపల్లి, ఫిబ్రవరి 23 (ప్రజాజ్యోతి) :** భారతీయ జనతా పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా తాండూర్ మండలంలోని బోయపల్లి గ్రామంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న పట్ట బద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు బిజెపి అభ్యర్థి అంజిరెడ్డికి వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి అసెంబ్లీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ క్యాతం వెంకటరమణ,బిజెపి జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయలు,మండల ఎన్నికల సహ ఇంచార్జ్ న్యాయవాది నల్లుల సంగీత,మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోమాస కమల,మండల ప్రధాన కార్యదర్శి పుట్ట కుమార్,మండల ఉపాధ్యక్షులు సిద్ధం మల్లేష్,చోక్కాల నాగభూషణం,బోయపల్లి బూత్ అధ్యక్షులు కొమ్మ కొమురెల్లి,మహిళా మోర్చా నాయకురాలు స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఉన్న పట్టభద్రులు నిర్మల్‌లో జరిగే ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయాలి



**లక్ష్మణ చాంద, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి) :** నిర్మల్ జిల్లాలో ఈనెల 24వ తేదీ సోమవారం రోజున కొండాపూర్ గ్రామంలో గల చంద్రశేఖర్ ఫంక్షన్ హాల్ లో జరిగే పట్టభద్రుల సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతారని లక్ష్మణ చాంద మండలంలో ఉన్న పట్టభద్రులు హాజరు కావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓడ్నాల రాజేశ్వర్ తెలిపారు. ఆయన శుక్రవారం రోజు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి మద్దతు ఇచ్చి వారి గెలుపుకు కృషి చేయాలని కోరారు. పట్టభద్రులు హాజరై ముఖ్యమంత్రి సభను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మేకల రాజేందర్, నాయకులు మల్లేష్, నారాయణ, నరేష్ పాల్గొన్నారు.

## నూతన హనుమాన్ ఆలయ విగ్రహ ప్రతిష్టాపన



**లక్ష్మణ చాంద, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి) :** మండలం లోని మల్లాపూర్ గ్రామంలో నూతన హనుమాన్ ఆలయ విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు 23 వ తారీకు వరకు కొనసాగు తాయని గ్రామ కమిటీ సభ్యులు వీడీసీ సభ్యులు తెలిపారు. ఇందులో హనుమాన్ పంచాయతన ధ్వజ, యంత్ర, శిఖర ప్రాణ ప్రతిష్ట, మూర్తి ప్రతిష్ట, వాస్తు హోమము, పూర్ణాహుతి వివిధ కార్యక్రమాలు జరుగు తు న్నాయని తెలిపారు. నేటి నుండి ఆదివారం వరకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కావున భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఈ ఉత్సవాలలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని గ్రామస్తులు కోరుతున్నారు.

## రాష్ట్ర శాసనమండలి ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

**రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి21, ప్రజాజ్యోతి :** ఎమ్మెల్సి ఎన్నికల నిర్వహణ పై సిఈఓ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా, ఎన్నికల ప్రవర్తన నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన వసతులు కల్పించి, ఫిబ్రవరి 27న ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ఏర్పాట్లు చేయాలని సిఈఓ సూచించారు. అలాగే, ఎన్నికల సిబ్బందికి శిక్షణ అందించాలని, బ్యాలెట్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లను అనువైన ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓలు రత్నకల్యాణి, కోమల్ రెడ్డి, జడ్పి సీఈఓ గోవింద్, డిపిఓ శ్రీనివాస్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రానున్న వేసవిలో నిరంతర, నాణ్యమైన
# విద్యుత్ సరఫరా అందించాలి: జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్





గద్వాల ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి ప్రతినిధి): ప్రస్తుత రబీ సీజన్,రానున్న వేసవిలో జిల్లాలో నాణ్యమైన,నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జూరాల జనరేషన్ ప్లాంట్,220/132 కేవీ జూరాల సబ్ స్టేషన్,132/33 కేవీ ,33/11 కేవీ గద్వాల్ సబ్ స్టేషన్,మానిటరింగ్ సెల్ లను ఆకస్మికంగా తనిఖీ చేసి,అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యుత్ సరఫరా ఎక్కడి నుండి వస్తుంది,ఎంత మేరకు సరఫరా అవుతోంది, సరఫరాలో అంతరాయం ఏర్పడితే ఏ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటారు,ఎంత మంది సిబ్బంది విధుల్లో ఉంటారు అనే అంశాలను విద్యుత్ శాఖ ఇంజినీర్ ను అడిగి తెలుసుకున్నారు.తదనంతరం విద్యుత్ సరఫరా,నిర్వహణ,డిమాండ్-సరఫరా అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రస్తుత రబీ సీజన్,రానున్న వేసవిలో వ్యవసాయం,గృహాలు,ఆసుపత్రులు,పరిశ్రమలకు నాణ్యమైన,నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని, డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.ప్రజలకు నిరంతర విద్యుత్ అందించడంలో ఏమైనా సమస్యలు ఎదురైతే, సంబంధిత అధికారులు తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గద్వాల్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ తిరుపతి రావు,అసిస్టెంట్ డివిజన్ ఇంజినీర్లు రమేష్ బాబు, గోవిందు,నవీన్ బాబు,ట్రాన్స్ కో జెన్కో సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 31వరకు లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- మంజూరు చేసిన పనులను 100% పూర్తి చేయాలి
- గుర్తించిన పనుల వివరాలను అంతర్జాలంలో నమోదు చేయాలి
- అధికారుల సమీక్షలో అదనపు డిఆర్డిఓ రాజేశ్వరి





నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 21 ప్రజా జ్యోతి లేబర్ బడ్జెట్ ఎస్ బి ఎం,మెటీరియల్ వర్క్స్ పేమెంట్ ఆర్ లేబర్ పేమెంట్ వర్క్స్ మరియు కంప్లిషన్, నర్సరీ ల నిర్వహణ మార్చి 31 వరకు పూర్తి చేయాలని అదనపు డిఆర్డిఓ రాజేశ్వరి అన్నారు.శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో అన్ని మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు,ఈసీలతో జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లేబర్ బడ్జెట్,ఎస్ బి ఎం, మెటీరియల్ వర్క్స్, కంప్లేషన్,నర్సరీల నిర్వహణ మార్చి 31 వరకు పూర్తి చేయాలని,ఉపాధి కూలీలకు కల్పించవలసిన పని దినాలపై, కూలీలకు పని దగ్గర కల్పించాల్సిన వసతులు, త్రాగునీరు,మెడికల్ కిట్,టెంట్ మొదలైన అంశాలను, 2024-25లో గ్రామ పంచాయతీలు నిర్దేశించిన టార్గెట్ ప్రకారం మొక్కలు నాటి,పండ్ల తోటల పెంపకం లబ్ధిదారులకు లబ్ధిదారులను గుర్తించాలని,ఈత ప్లాంటేషన్ చేయుటకు స్థలాలు గుర్తించి,నిర్వహణ లక్ష్యాన్ని పూర్తిచేసి,ప్లాంటేషన్ చేసిన మొక్కలను పరిరక్షణకు టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి మొక్కలను పరిరక్షించేందుకు పంచాయతీ కార్యదర్శులు బాధ్యత తీసుకోవాలని అన్నారు. శనివారం సాయంత్రం మెటీరియల్ పేమెంట్స్ వివరాలు అందించాలని,మంజూరు చేసిన పనులను 100% పూర్తి చేయాలని,స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మరుగుదొడ్ల పనులను గుర్తించిన వారి వివరాలను అంతర్జాలంలో నమోదు చేయాలని,2025-26 సంవత్సరానికి పండ్లతోటలు పెంపక లబ్ధిదారులను గుర్తించి ఈత మొక్కల ఫౌండేషన్ స్థలాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ లు,ఏపిఓ లు,ఈసిలు, కార్యాలయ సిబ్బంది శ్రీను,రాజేష్,క్రాంతి,జీవన్, తాహెర్,పవన్ లు పాల్గొన్నారు.

## శివలకు 14 సంవత్సరాల నుండి
# అన్నదాన కార్యక్రమం చేస్తున్న సత్యనారాయణ శెట్టి



అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) ఫిబ్రవరి21: జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూర్ నియోజకవర్గం వడ్డేపల్లి మండలం జులకల్ గ్రామ శివారలో గల శివాలయం నందు గత14 సంవత్సరాల నుండి బోయలగూడ గ్రామానికి చెందిన మెతుకు సత్యనారాయణ శెట్టి మెతుకు వరలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం శివలకు నిర్వహిస్తున్నారు. శ్రీశైలంకు పాదయాత్ర వెళ్లే భక్తులకు శివ స్వాములకు అన్నప్రసాద వితరణతో పాటు ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నారు శివయ్య కరుణాకటాక్షం వీరి కుటుంబంపై ఉండాలని భక్తులు మరియు శివ స్వాములు ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో సత్యనారాయణ శెట్టి కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు శివ స్వాములు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రంజాన్ మాసం ఏర్పాట్లను ప్రభుత్వపరంగా చేయాలి

- ముస్లీం మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి



నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 21 ప్రజా జ్యోతి ముస్లింల పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని రంజాన్ ఏర్పాట్లను ప్రభుత్వ పరంగా చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు హబీబ్-ఉర్- రహమాన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ అధికారికి వినతి పత్రం అందించారు.నాగర్ కర్నూలు జిల్లాలోని 4 మున్సిపాలిటీలు,20 మండలాలలోని మసీదులు, ఈద్గాల వద్ద పారిశుద్ధ్య పనులతో పాటు నీటి వసతి,విద్యుత్,పెయింటింగ్,ఇతర మరమ్మత్తుల కోసం చర్యలు తీసుకోవాలని,స్మశానాల ల వద్ద పారిశుధ్య పనులతో పాటు పెయింటింగ్ తదితర పనులను చేపట్టాలని,అదేవిధంగా షబేఖధర్ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని రంజాన్ మాసంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలన్నారు.ప్రభుత్వం జారీ చేసిన విధంగా నాగర్కర్నూల్ జిల్లాలో కూడా రాత్రివేళలో హెూటళ్ళు,ఇతర వ్యాపారాలను కొనసాగించే విధంగా అనుమతులు ఇవ్వాలని,ముస్లిం జనాభా ఉన్న వీధులలో పారిశుధ్య,ఇతర ఏర్పాట్లను చేపట్టాలన్నారు,నీటి సరఫరాకు ఇబ్బందులు ఉన్నచోట ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని వినతిపత్రంలో కోరారు.మైనార్టీ ఉపాధ్యక్షుడు ఖలీల్,మైనార్టీ నాయకులు మహమ్మద్ గౌస్, మహమ్మద్ హబీబ్ ఖాన్,మహమ్మద్ నజీర్,మహ్మద్ ఖాదర్,ఇంతియాజ్ మహమ్మద్,జాకీర్, ఖాజా బాబా,కిషోర్ తదితరులు ఉన్నారు.

# శివాసాయి దాబాను ప్రారంభించిన ఎమ్మెల్యే



అడ్డాకుల. ఫిబ్రవరి 20 (ప్రజా జ్యోతి) అడ్డాకుల మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కోటాల వేగనాథ్ కు చెందిన శివ సాయి దాబాను దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా మహిళా సమాఖ్య పెట్రోల్ బంక్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి









నారాయణపేట జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి ఫిబ్రవరి21: మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం దేశంలోనే మొదటిసారిగా మహిళా సంఘాల సభ్యులకు పెట్రోల్ బంకులు ఏర్పాటు చేసి ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. నారాయణపేట జిల్లాలోని సింగారం ఎక్స్ రోడ్డు వద్ద రూ. 1.30 కోట్ల వ్యాయంతో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకులు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కోటి మంది మహిళలను కోటీశ్వరుడు చేయాలనే లక్ష్యంతో పెట్రోల్ బంకును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.హొ ప్రతి జిల్లాకు ఒక పెట్రోలు బంకు ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలను కేటాయిస్తామన్నారు. మహిళలు తమ కాళ్ళపై నిలబడితే వారి కుటుంబంలోని పదిమందికి సహకరించే విధంగా ఉంటారని, వచ్చిన ఆదాయాన్ని దుర్వినియోగం చేయకుండా తమ పిల్లల భవిష్యత్తుకు ఖర్చు చేస్తారని తెలిపారు. మహిళల అభివృద్ధి ద్వారా వారి కుటుంబం గౌరవంగా బతకడానికి ఉపయోగపడుతుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పట్టణ గ్రామీణ ప్రాంతాలు తేడా లేకుండా తెలంగాణ మహిళల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాలలో సహకారము అందిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీలతో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు బ్యాంకు రుణాలను విరివిగా అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 60 లక్షల మంది మహిళలు చేరినారని,రాబోవు రోజులలో కోటి మంది మహిళలను సంఘాలలో చేర్చే విధంగా మహిళా సంఘం అధ్యక్షులు కృషి చేయాలని కోరారు.ఐకెపి ద్వారా మహిళలకు పెట్రోల్ బంకులు, 600 ఆర్టీసీ బస్సుల యజమానులుగా తయారు చేయడం జరిగిందన్నారు. దేశంలో మొదటిసారిగా సోలార్ పార్కుల ద్వారా 1000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి మహిళలు వ్యాపారం చేసుకుని అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. మహిళా సంఘాల సభ్యులకు ఒకే డ్రెస్ కోడ్ అమలు చేసే విధంగా వెయ్యి కోట్ల రూపాయలతో నాణ్యమైన రెండు జతల చీరలు అందించనున్నట్లు ముఖ్యమంత్రి తెలియజేశారు. హైదరాబాదులోని శిల్పారామం లో మహిళా సంఘాల సభ్యులు రూపొందించిన ఉత్పత్తులను కార్పొరేట్ స్థాయిలో మార్కెటింగ్ చేసుకునే విధంగా మూడు ఎకరాల స్థలంలో వెయ్యి కోట్ల రూపాయలతో ఆకర్షణీయమైన మార్కెట్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, ఎక్సైజ్ మరియు టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ,స్థానిక శాసనసభ్యులు పర్ణిక రెడ్డి, అచ్చంపేట శాసనసభ్యులు వంశీకృష్ణ,శాసనసభ్యులు వాకిటి శ్రీహరి, వీర్లపల్లి శంకర్, చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి, సర్ఫ్ సీఈఓ దివ్య దేవరాజన్, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పేట మెడికల్ కాలేజీలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మారుమూల ప్రాంతంలో ఒక మెడికల్, పారామెడికల్, నర్సింగ్ కాలేజీ ప్రారంభించుకోవడం సంతోషం గతంలో కేంద్రం తిరస్కరించినా.. మా మంత్రి, అధికారులు తీవ్రంగా ప్రయంత్నించి ఎనిమిది మెడికల్ కాలేజీలకు అనుమతి తీసుకొచ్చారు .మా ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం,కాలేజీలో పూర్తి స్థాయి మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది.వీటిని మీరు సద్వినియోగం చేసుకోవాలి,నిజమైన పేదవాడికి సంక్షేమం చేరినప్పుడే అభివృద్ధి జరిగినట్లు అని బాబా సాహెబ్ అంబేద్కర్ చెప్పారు .మీ అవసరాలపై అవగాహన ఉన్నవారే మీ ఎమ్మెల్యేగా ఉన్నారు.పేదలకు విద్య అందుబాటులోకి తీసుకురావడానికి మా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుంది.డాక్టర్ వృత్తి ఒక ఉద్యోగం కాదు%" % ఒక బాధ్యత,మీరంతా గొప్ప డాక్టర్లుగా రాణిస్తే రాష్ట్రానికి మంచి సేవలు అందించగలరు.యాభై ఏళ్లు ఇక్కడి ప్రజలకు సేవలందించిన చిట్టెం నర్సిరెడ్డి గారి పేరు ఈ కాలేజీకి పెట్టడం సముచితం అని నేను భావిస్తున్న అన్నారు.ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మా అధికారులకు సూచిస్తున్నా అన్నారు.

# పన్నెండు నెలలలో ఎంతో అభివృద్ధి చేశాం

- అధికారంలోకి రాగానే 55 వేల ఉద్యోగాలు ఇచ్చాం - ఏడాదికి 5 లక్షల ఇండ్లు ఇస్తున్నాం
- రాబోయే రోజుల్లో దేశంలోనే రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలుపుతాం - నారాయణపేట ప్రజా పాలన ప్రగతి బాట సభలో సీఎం రేవంత్ రెడ్డి







నారాయణపేట జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి ఫిబ్రవరి21: కేవలం 12 నెలల్లో రాష్ట్రంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ఈ విషయంలో ప్రతిపక్షాలతో చర్చకు సిద్ధమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు.శుక్రవారం నారాయణ పేట జిల్లా పర్యటన సందర్భంగా దాదాపు 1000 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి అప్పక్ పల్లి లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.ఆడ బిడ్డలకు ఆలంబన ఇవ్వాలని దేశంలో ఎక్కడ లేని విధంగా నేడు మహిళా సమాఖ్యాల ద్వారా పెట్రోల్ బంక్ నడిపించుకునే విధంగా పెట్రోల్ బంక్ ప్రారంభోత్సవం చేసుకోవడం జరిగిందన్నారు.ఆనాడు కాంగ్రెస్ హయంలో 25 లక్షల ఇందిరమ్మ ఇళు మంజూరు చేస్తే ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వం 10 సంవత్సరాలు బడుగు బలహీన వర్గాల ప్రజలను విస్మరించిందని విమర్శించారు. తిరిగి ఇప్పుడు ప్రభుత్వం ఏర్పాటు చేశాక ప్రతి నియోజక వర్గానికి 3500 ఇళ్ల చొప్పున రాష్ట్రంలో 5 లక్షల ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేసుకొని ఈరోజు నారాయణపేట నుంచి భూమి పూజ చేసుకోవడం జరిగిందన్నారు. అవసరం అనుకుంటే నియోజకవర్గానికి 5 వేలకు పెంచుతామని పేర్కొన్నారు. హైదరాబాద్ రాష్ట్రానికి పాలమూరు జిల్లావాసి బూర్గుల రామకృష్ణ రావు తొలి ముఖ్యమంత్రి గా పనిచేస్తే దాదాపు 7 దశాబ్దాల తర్వాత తిరిగి పాలమూరు బిడ్డకు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చిందన్నారు. ఈ అవవకాశాన్ని సద్వినియోగం చేసుకొని వెనకబడ్డ ఈ పాలమూరు జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకుంటానని హామి ఇచ్చారు.పాలమూరు జిల్లా గుండా సంవత్సరానికి 811 టి.యం.సి ల నీరు పోతుంటే పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేయకుండా జిల్లాను ఎందుకు నిర్లక్ష్యం చేశారని ప్రశ్నించారు. పాలమూరు జిల్లా తెలంగాణ రాష్ట్రంలో లేదా అని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి, భీమా, నెట్టెంపాడు, తుమ్మిళ్ల, ఆర్.డి ఎస్, కల్వకుర్తి, కోయిల్ సాగర్ ప్రాజెక్టులను పూర్తి చేయకుండా 10 ఏళ్ల నిర్లక్ష్యం చేశారని ఎద్దేవా చేశారు. పైగా పోతిరెడ్డి పాడు, ముచ్చుమర్రి ప్రాజెక్టుల ద్వారా రాయలసీమకు నీళ్లు తరలించుకుపోయేందుకు అవకాశం కల్పించారని పరోక్షంగా మాజీ సీఎం కే సి ఆర్ ను ఉద్దేశించి విమర్శించారు.మక్తల్, కొడంగల్, నారాయణపేట ప్రాజెక్టు నిర్మాణానికి 2014లో కోట్లాడి మంజూరు చేయిస్తే తనపైన ఉన్న కోపంతో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకుండా ఆపేశారని అన్నారు. ఇప్పుడు తన హయాంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఉదండాపూర్, పాలమూరు రంగారెడ్డి, ప్రాజెక్టులను పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామని హామి ఇచ్చారు. లగ చర్లలో పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తే అడ్డుకున్నారని, పాలమూరు జిల్లాను అభివృద్ధి చేసుకుంటే ఎందుకు అక్కసు వెళ్లగక్కుతున్నారని ప్రశ్నించారు.ప్రభుత్వం ఏర్పడి కేవలం 12 నెలలు పూర్తి అయ్యిందని, భారాస ప్రభుత్వం చేసిన 10 సంవత్సరాల పాలన, కేంద్రంలో 12 సంవత్సరాల మోడీ ప్రభుత్వం పాలన పై బహిరంగ చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాదని, నన్ను కాపాడుకునే బాధ్యత ప్రజల పై ఉందని అన్నారు.ఈ సభలో పాల్గొన్న రాష్ట్ర ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఆగష్టు 1, 2024 న సుప్రీం కోర్టు ఇచ్చిన సూచనల మేరకు 120 రోజుల్లో విజవంతంగా కుల గణన పూర్తి చేయడం జరిగిందని దానితో పాటు వర్గీకరణ పూర్తి చేసి అన్ని విధాలుగా వెనుకబడిన మాదిగ కులానికి 9.7 శాతం రిజర్వేషన్ ఇవ్వబోతున్నట్లు తెలిపారు.రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు మాత్రమే అవుతుందని ఈ 14 నెలల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేశామని తెలిపారు. 10 సంవత్సరాల పరిపాలన చేసిన గత ప్రభుత్వం 8 లక్షల కోట్లు అప్పు చేసి మరో 40 వేల కోట్ల పెండింగ్ బిల్లులు పెట్టి ఇచ్చిన హామీలు ఏమయ్యిందినని అడుగుతున్నారని అన్నారు.అభివృద్ధి విషయంలో వేదిక ఎక్కడైనా చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.అంతకు ముందు నారాయణపేట శాసన సభ్యులు చిట్టెం పర్ణికా రెడ్డి, మంత్రులతో కలిసి వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.నారాయణ పేట జిల్లాలో దాదాపు 967 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేశారు.56 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన వైద్య కళాశాల భవనానికి ప్రారంభోత్సవం చేశారు.130 కోట్ల అంచనా వ్యయంతో వైద్య కళాశాల నూతన హాస్టల్ నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు.నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ కు శంఖుస్థాపన చేశారు.26 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవనం, 40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల యూనిట్ కు శంఖుస్థాపన చేశారు.రూ. 5.58 కోట్ల వ్యయంతో నిర్మించిన ధన్వాడ, నారాయణపేటలో నిర్మించిన రూరల్ పోలీస్ స్టేషన్ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు.1.23 కోట్ల వ్యయంతో నిర్మించిన జిల్లా మహిళా సమాఖ్య నిర్వహించే పెట్రోల్ బంక్ ను ప్రారంభోత్సవం చేశారు.295 కోట్ల అంచనా వ్యయంతో తుంకిమెట్ల నారాయణపేట రోడ్, కోటకొండ మద్దూరు రోడ్ అభివృద్ధి పనులు, అప్పక్ పల్లి గుండిమాల్ రోడ్, మద్దూరు లింగాల్ చెడ్ రోడ్ లలో హైలెవల్ బ్రిడ్జీల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.193 కోట్ల నిధులతో గుల్బర్గా కొడంగల్ , రావులపల్లి మద్దూరు, కొస్గి దౌల్తాబాద్ రోడ్డు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు.రూ.12.70 కోట్ల నిధులతో నారాయణపేట నియోజకవర్గ పరిధిలో సి.ఆర్.ఆర్. రోడ్లకు శంఖుస్థాపన చేశారు.7 కోట్లతో మరికల్ లో నిర్మించిన మండ్లపరిషత్ కార్యాలయ భవనానికి ప్రారంభోత్సవం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి అనసూయ సీతక్క, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డి.జి.పి జితేందర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్, జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్,నారాయణపేట శాసన సభ్యులు పర్ణిక రెడ్డి, మహబూబ్ నగర్ శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి రెడ్డి, మక్తల్ శాసన సభ్యులు వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సారెస్పీ ప్రధాన కాలవను పరిశీలించిన కలెక్టర్



**రాయపర్తి, ఫిబ్రవరి 21, ప్రజా జ్యోతి.**రబి సీజన్లో రైతులకు పంటలకు నీరు ఇవ్వాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద అన్నారు. శుక్రవారం అధికారులతో కలిసి డిబిఎం 2 ప్రధాన కాలువను పరిశీలించారు. సందర్భంగా రబి సీజన్లో రైతులందరికీ నీటి సమస్య తలెత్తకుండా చూడాలని అన్నారు. ముఖ్యంగా రాయపర్తి, వర్ధన్నపేట ,పర్వతగిరి, మండలాలలో నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు ఈ .ఈ. ఎం శంకర్ చౌహాన్, పి .కిరణ్ కుమార్ డిప్యూటీ ఈ. ఈ., రాయపర్తి, ఎన్ .రాజు డిప్యూటీ ఈఈ వర్ధన్నపేట , ఏ.ఈ.లు బాల దాసు, డి. నంద కుమార్, వై .ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ టిపిసిసి అధ్యక్షుడు బిల్లా సుధీర్ రెడ్డి, మాజీ రైతుబంధు అధ్యక్షులు సురేందర్ రావులను సన్మానించి న గన్నారం కాంగ్రెస్ పార్టీ నాయకులు



**రాయపర్తి, ఫిబ్రవరి 21, ప్రజాజ్యోతి.** స్థానిక పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం రాయపర్తి మండల కేంద్రంలోని మాజీ టి.పి.సి.సి కార్య దర్శి బిల్లా సుధీర్ రెడ్డి ని,మరియు మండల మాజీ రైతు బంధు అధ్యక్షులు ఆకుల సురేందర్ రావు ని వారి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి,కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా, శాలువాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేసిన గన్నరం గ్రామపార్టీ అధ్యక్షుడు చిట్టే ఎల్లేష్ మండల పార్టీ నాయకులు,జనగాం యాకన్న, సారంగం,రాయపర్తి పట్టణ మాజీ ప్రధాన కార్యదర్శి ఉబ్బని అశోక్, అబ్బరిబోయినా నర్సయ్య, రాజిడి దయాకర్ రెడ్డి,జనగాం బిక్షపతి,కాముటం వీరాస్వామి, మునిగల కొమురయ్య, అల్లాడి రాజు,అబ్బరబోయిన సోమరాజు,అయితే ప్రవీణ్, అల్లాడి కరుణాకర్,అల్లాడి రాజు,తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు అండగా ధర్మన్న..

* కాట్రపల్లి గ్రామంలో మాజీ ఎంపిటీసీ సౌరం సంపత్ తల్లి యకమ్మ,స్పందన కుటుంబాలను పరామర్శించిన పరకాల మాజీ ఎమ్మెల్యే



**సంగెం,పిబ్రవరి21,(ప్రజాజ్యోతి):** కార్యకర్తల కష్ట సుఖాలలో ఎల్లప్పుడు తోడుగా ఉంటానని ఏ ఒక్క కార్యకర్త అధైర్యపడొద్దు అండగా ఉంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మరెడ్డి అన్నారు. శుక్రవారం రోజున మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు,మాజీ ఎంపీటీసీ సౌరం సంపత్ తల్లి యాకమ్మ మృతి చెందగా ఆమె పార్థివదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అదేవిధంగా గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన స్పందన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బీఆరెస్ మండల పార్టీ అధ్యక్షులు పసునూరి సారంగపాణి,మాజీ జెడ్పిటీసీ గూడా సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు పులుగు సాగర్ రెడ్డి,నాయకులు గాయపు రాజురెడ్డి,బుచ్చిరెడ్డి,మండల బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆకేరు ఆక్రోశం....

* ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు
* తాటిచెట్టంత లోతులో గుంతలు
* కాలిబాటను కూడా తవ్వేసిన వైనం
* అడుగంటిపోయిన భూగర్భ జలాలు
* విచ్చలవిడిగా అనుమతి లేని విద్యుత్ వినియోగం
* కోట్లు సొమ్ము చేసుకున్న అక్రమార్కులు
* తూతూమంత్రపు తనిఖీలతో సరిపెడుతున్న అధికారులు







**పర్వతగిరి, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి)** కనుచూపుమేరంతా పరుచుకున్న ఇసుక.. రెండు తాటిచెట్ల ఎత్తులో ఇసుక మేటలు.. సాయంకాలం ఆటవిడుపుగా ఆలంకీలంకా లాంటి ఆటలతో ఎగిరే అలసి పోయే పిల్లలు.. కబడ్డీ లాంటి పోటీలతో సరదాగా గడిపే యువకులు.. కాస్త తవ్వితే చాలు ఉబికి వచ్చే నీటి ఊటలు.. చుట్టుపక్కల ప్రాంతా ల్లోని బావుల్లో జల ధారలు.. ఎండా కాలంలో నీటి ఎద్దడిని తగ్గించి దాహార్తి తీర్చేలా భూగర్భ జలాలు.. దసరా పండుగొస్తే పాలపిట్టను చూసి జమ్మిచెట్టు వద్ద పూజలు చేయ డానికి నామీదుగానే వెళ్లేవాళ్లు.. ఊళ్లో ఎవ్వరైనా చనిపోతే నాపైనే కాల్చేసి నేను ఇచ్చిన నీళ్లల్లోనే స్నానాలు చేసి ఇంటికి వెళ్లే.. అప్పుడు ఎంత ముద్దుగా ఉండే దాన్నో.. నన్ను ఎంత పద్దతిగా చూసుకునేవాళ్లో.. అవసరమైనప్పుడు మాత్రమే.. అవసరమైనంత మేరకే నా నుంచి లాభం పొందే వాళ్లు.. ఇదంతా ఒకనాటి వైభవం.. మరి.. ఇప్పుడు.. ఆకేరు పరివాహక ప్రాంతమైన చెరువు ముందు తండా, రోళ్లకల్, నారాయణపురం, కల్లెడ గ్రామాలలో ఆనాటి ప్రాభవం గతించి పోయింది.. ఒళ్లంతా గుంతలమయమై కళావిహీనంగా మారిపోయాను.. అక్రమార్కులు నన్ను చెరబట్టారు.. ఇసుక మేటలను ఇష్టారాజ్యంగా తవ్వేసి రాళ్ల దిబ్బగా మార్చేశారు. ముళ్ల పొదలు, తుమ్మ చెట్లతో నిండిపోయి నా రూపం నాది కాకుండా పోయింది. ఒకటా రెండా డజన్ల సంఖ్యలో వాహనాలు తెచ్చి నన్ను తోడేసి కోట్లాది రూపాయ లు సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకునేవాళ్లేరీ..? అందరు అధికారులకు, నాయకులకు తెలిసినా నా బాధను ఆలకించేవాళ్లేరీ..? ఒకప్పుడు ఇసుక, నీటి చెమ్మలతో నిండు గర్భిణిలా కళకళలాడిన నేను ఇప్పుడు మోడివారిన చెట్టులా మారిపోయానంటే ఇందుకు కారణం మీరు కాదా.? ఈ పాపంలో అధికారులు, ప్రజా ప్రతినిధులకు భాగం లేదా.? మోడువారిన చెట్టులా ఉన్నప్పటికీ నన్ను ఇప్పుడు కూడా వదిలిపెట్టడం లేదు కదా..! రైతులు నడిచి వెళ్లే కాలిబాటను సైతం తవ్వేశారంటే ఏమని అనుకోవాలి.. అనుమతి లేకుండా విచ్చలవిడిగా విద్యుత్ ఉపయోగిస్తూ విద్యుత్ లైన్లను దెబ్బతీసేలా ఇసుక తోడేస్తున్నారంటే ఎంతని మొత్తుకోవాలి.. నా బాధ ఇప్పటికైనా మీకు అర్థమవుతోందా..? నన్ను నాశనం చేస్తే దెబ్బతినేది మీరే కదా.. నాలో నీళ్లు ఇంకిపోతే మీ బోరు బావుల్లో నీళ్లు ఇంకిపోవా..? ఇప్పటికే నన్ను పూర్తిగా తవ్వేశారు.. ఇంకా ఎంతని తవ్వుతారు.. మట్టిని కూడా నీటితో కడిగి ఇసుకగా మార్చి అమ్ముకుంటున్నారు కదా.. నన్ను అమ్మి లక్షలు, కోట్లు సంపాదించి సొమ్ము చేసుకున్నారుగా.. ఇంకా మీకు సరిపోవడం లేదా..? అందరికీ ఆమ్యామ్యాలు అందుతున్నాయి గనుకనే నన్ను పట్టించుకోవడం లేదనే మాటలు నిజమేనా.. ? ఓ అయ్యలూ, అమ్మలూ ఇప్పటికైనా నా బాధను ఆలకించండి. నా కష్టాన్ని తీరిస్తే మీ రుణం ఊరికే ఉంచుకోను.. మళ్లీ ఇసుక మేటలు వేసి, నీటి ఊటలు ఊరించి మళ్లీ మీకే లాభం చేకూరుస్తాను.. నా బాధను తీరుస్తారు కదూ..

## ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయాలి



- స్థానిక ఎన్నికలలో యూత్ కాంగ్రెస్ నాయకులు చురుగ్గా పాల్గొనాలి
- యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్

**పర్వతగిరి, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి)** పర్వతగిరి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం రోజు నిర్వహించిన సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ మాట్లాడుతూ పదేళ్ల తర్వాత వచ్చిన పేదల ప్రభుత్వం పది కాలాలపాటు మనుగడ సాధించాలంటే ప్రతి యువజన కాంగ్రెస్ కార్యకర్త గ్రామాల్లో ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి అన్నారు. మీ గ్రామంలో మీరే మంత్రి, ఎమ్మెల్యే, కదా నాయకుడిగా భావించి మూడు రంగుల జెండాను ముందుకు తీసుకువెళ్లాలి.అధికారంలో లేని పదేళ్లలో మనం పడిన ఇబ్బందులు గుర్తు చేసుకుంటూ చేతికి అంది వచ్చిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అర్హులకు చర్చేందుకు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి.

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తిరుగులేని ఆదిపత్యాన్ని కనబరచాలి. మొదటి ఏడాదిలోనే ఎవరి ఊహకందని పథకాలు ప్రతిగడపకు చేర్చాం. అవినీతి, అక్రమం అనే మాట తలెత్తకుండా ప్రభుత్వం ముందుకు పోతుంది. ప్రజా ప్రభుత్వం పనితీరుతో ప్రతిపక్షాల ఆర్తనాదాలు ప్రజలు పట్టించుకునే పరిస్థితి లేదు. వారి ఆశలు ఆవిరి ఆవిరి అయిపోయాయి.

పార్టీ గెలుపులో యువజన కాంగ్రెస్ నాయకుల పాత్ర కీలకమని రాబోవు స్థానిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ సత్తా చాటేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పూర్తి స్థాయిలో ప్రజల్లోకి వెళ్ళేలా యువజన నాయకులు కృషి చేయాలన్నారు. యువజన విభాగం తరుపున విస్తృతంగా సేవా కార్యక్రమాలను చేపట్టాలని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల అనిల్ కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి భూక్య విజేందర్ నాయక్, యూత్ కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ అధ్యక్షులు కొమ్ము రమేష్, యూత్ కాంగ్రెస్ పర్వతగిరి మండల్ ఉపాధ్యక్షులు భూక్య సురేందర్, మూడు దేవరాజ్, యూత్ కాంగ్రెస్ పర్వతగిరి మండల మాజీ అధ్యక్షులు నీరటి ప్రశాంత్, మైనార్టీ నాయకులు యాకూబ్ పాషా, యూత్ కాంగ్రెస్ మండల నాయకులు పిట్టల లోకేష్, నూనె మణికంఠ, వంగ సాయి తదితరులు పాల్గొన్నారు.

## ముల్కనూరు డైరీని సందర్శించిన టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థులు



**రాయపర్తి, ఫిబ్రవరి 21, ప్రజా జ్యోతి.** పి ఎం .ఎస్ .హెచ్ .ఆర్ ఐ. పథకంలో భాగంగా తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల ,రాయపర్తి విద్యార్థులను ఫీల్డ్ విసిట్ లో భాగంగా శుక్రవారం ముల్కనూర్ మహిళా డైరీ కో ఆపరేటివ్ సొసైటీ కి తీసుకువెళ్ళడం జరిగింది అని కళాశాల ప్రిన్సిపల్ సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందుగా సహకార బ్యాంకు కి తీసుకువెళ్లి అందులో జరిగే వివిధ కార్యక్రమాలను వివరించదం జరిగిందని తరువాత విద్యార్థులు డైరీ ఫారం లోని వివిధ రకాల యంత్రాలను పరిశీలించి, ఆధునిక పద్ధతులలో పాల సేకరణ, పాల ప్యాకెట్ తయారీ విధానం, సరఫరా గురించి అధికారులు వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సరిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిఎస్పి జిల్లా ఈసీ మెంబర్‌గా తాటి ధనాకర్ నియామకం

**వెంకటాపురం,ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా వెంకటాపురం మండల కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ కార్యకర్తల సమావేశం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కడపాక రాజశేఖర్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ ఆదేశాల మేరకు వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన తాటి ధనాకర్ ను జిల్లా కార్యవర్గ సభ్యునిగా నియమించడం జరిగిందని తెలిపారు.ములుగు జిల్లాలో ఉన్న ప్రతి మండలంలోని గ్రామాలలో బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేసి రాజ్యాధికారం సాధించే దిశగా ప్రయాణం చేస్తామని అన్నారు.అగ్రవర్ణ పార్టీలు ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనార్టీ వర్గాల ప్రజలకు ఎన్నికల్లో డబ్బు,మద్యం ఆశ చూపి మన ఓట్లను వాళ్ల గెలుపుకు ఉపయోగించుకొని మనల్ని బానిసలుగా చూస్తున్నారని అన్నారు.బిఎస్పి పార్టీ బహుజనులలో ఓటు చైతన్యం కల్పించి అధికారానికి దూరంగా ఉన్న కులాలకు అధికారాన్ని అందించడమే బహుజన్ సమాజ్ పార్టీ లక్ష్యమని తెలిపారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అగ్రకుల పార్టీలకు ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పి పార్టీని గెలుపు దిశగా ప్రయాణం కొనసాగిస్తామని అన్నారు.అనంతరం నూతనంగా జిల్లా ఈసీ మెంబర్ గా ఎన్నికైన ధనాకర్ మాట్లాడుతూ..పార్టీ రాష్ట్ర అధ్యక్షులు,జిల్లా అధ్యక్షులు నా మీద ఉన్న నమ్మకంతో ఈ పదవి కట్టబెట్టినందుకు మనస్ఫూర్తిగా కృతజ్ఞలు తెలియజేస్తున్నానని,బీఎస్పీ ఎదుగుదలకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.బహుజన్ సమాజ్ పార్టీ సిద్ధాంతం నచ్చి పార్టీలో చేరదామని వచ్చిన మహేష్,సమ్మయ్య,కుమార్, సాయిరాం ,బాబురావు,విజయ్,పవన్ కుమార్ లకు జిల్లా అధ్యక్షుడు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సంఘమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల పోస్టరు ఆవిష్కరణ

* సంఘమేశ్వరస్వామి దేవాలయంలో 23-02-2025నుండి27-02-2025 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు..
* మహాశివరాత్రి బుధవారం రోజున రాత్రి 1-15 నిమిషాలకు శివపార్వతుల కళ్యాణం..సాయంత్రం 8గంటలకు శివాలయం దగ్గర సాంస్కృతిక కార్యక్రమాలు
* సంఘమేశ్వరస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ కందగట్ల నరహరి



**సంగెం,పిబ్రవరి21(ప్రజాజ్యోతి);**మండల కేంద్రంలో మహాశివరాత్రి సందర్బంగా శుక్రవారం రోజున బ్రహ్మోత్సవాల పోస్టర్ ను దేవస్థాన కమిటీ సభ్యుల చేతుల మీదుగా చైర్మన్ కందగట్ల నరహరి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా దేవస్థాన కమిటీ చైర్మన్ కందగట్ల నరహరి మాట్లాడుతూ...సంగెం మండల కేంద్రంలోని సంగమేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం 23-02-2025 నుండి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు 27-02-2025 వరకు గురువారం వరకు కార్యక్రమములు నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు.మహాశివరాత్రి బుధవారం 26-02-2025 రాత్రి 1-15 నిమిషాలకు శివపార్వతుల కళ్యాణం జరుగుతుందని,సాయంత్రం 8గంటలకు శివాలయం దగ్గర సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన కార్యదర్శి ఆగపాటి రాజు (ఏపిఆర్ ),స్థానిక పూజారి అప్పే నాగార్జున శర్మ,మెట్టిపెల్లి రమేష్,మాజీ సర్పంచ్ గుండేటి బాబు,మాజీ ఎంపిటిసి మెట్టిపెల్లి మల్లయ్య,కోడూరి సధయ్య,మునుకుట్ల కోటేశ్వర్,కక్కెర్ల శరత్,మెట్టిపెల్లి శేఖర్,మునుకుంట్ల మోహన్,పులి సాంబయ్య,ఇప్పకాయల మనోహర్,లవ్ కుమార్,గుండేటి రాజు,నల్లతీగల రవి,ఉండిలా మల్లికార్జున్, అప్పాల కవిత,ఆగపాటి రామకృష్ణ,మెట్టిపల్లి సునీల్,గుండేటి సునీల్,తాటికొండ శ్రవణ్,తాటికొండ సాయి,గుండేటి రాజేష్,ఎం.డి.రియాజ్ పాషా,గుండేటి ప్రశాంత్, మహంకాళి మొగిలి,గుండేటి మొగిలి,నమ్మిండ్ల ఏలీయా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలి

* ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలి
* పిఓలు,ఏపిఓల శిక్షణ తరగతుల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ దివాకర



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజా జ్యోతి):** వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 27న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని,ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర కోరారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర వరంగల్- ఖమ్మం -నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించబడిన ప్రిసైడింగ్ ఆఫీసర్,అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్,మైక్రో అబ్జర్వర్ల శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా పిఓలు,ఏపిఓ లను ఉద్దేశించి కలెక్టర్ కీలక సూచనలు చేశారు. శిక్షణ తరగతులను చక్కగా ఆకళింపు చేసుకునిఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. ఇదివరకు నిర్వహించిన ఎన్నికల విధులే కదా అని శిక్షణ తరగతులను తేలికగా తీసుకోకుండా ఎన్నికల సంఘం మార్గ దర్శకాలు, నిబంధనలకు సంబంధించిన ప్రతి ఒక్క అంశాన్ని తెలుసుకోవాలని సూచించారు.ప్రధానంగా అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే,శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కొంత భిన్నంగా ఉంటుందన్నారు.బ్యాలెట్ పద్ధతిన జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు ఒకింతఎక్కువ వ్యవధి పట్టే అవకాశాలు ఉన్నందున ఓపిగ్గా, సంయమనంతో వ్యవరిస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని హితవు పలికారు.27వ తేదీన ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ సమయం ఉంటుందని,గడువులోపు పోలింగ్ కేంద్రం పరిధిలో క్యూ లైన్ లో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నెంబర్లు అందించి వారిచే ఓటింగ్ జరిపించాలన్నారు. పోలింగ్ కు ఒక రోజు ముందుగానే ఈ నెల 26న ఉదయం 8 గంటలకు ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు.పంపిణీ కేంద్రాల వద్ద అందించే పోలింగ్ సామాగ్రి,బ్యాలెట్ బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని,చెక్ లిస్ట్ లో పొందుపర్చబడిన దానికి అనుగుణంగా మెటీరియల్ అంతా కేటాయించబడిందా లేదా అన్నది జాగ్రత్తగా సరి చూసుకోవాలని తెలిపారు. పోలింగ్ సామాగ్రిని పరిశీలించుకున్న మీదట తమ బృందంతో కలిసి అధికార యంత్రాంగం సమకూర్చిన వాహనంలోనే నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎంతో బాధ్యతాయుతంగా జాగ్రత్తగా పోలింగ్ ప్రక్రియను జరిపించాలన్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ చిన్న తప్పిదానికి కూడా తావు లేకుండా పూర్తి పారదర్శకంగా స్వేచ్ఛా యుత వాతావరణంలో ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియ జరిగేలా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు.నిర్లక్ష్యానికి తావిస్తూ,తప్పిదాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.పోలింగ్ కేంద్రాలలోనికి సెల్ ఫోన్లు తీసుకెళ్లేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు.దీనిని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగానే పోలింగ్ విధుల గురించి పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని అన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు బ్యాలెట్ బాక్సులుతీసుకొని, పోలింగ్ ప్రక్రియ ముగిసిన మీదట వాటిని నల్గొండ లోని రిసెప్షన్ సెంటర్ లో అప్పగించాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనని స్పష్టం చేశారు.ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాలెట్ పేపర్లు,బ్యాలెట్ బాక్సులను పీఓలు తమ పర్యవేక్షణలో తమ వెంటే ఉంచాలని జాగ్రత్తలు సూచించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నియమావళి ప్రకారంగా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా విధులు నిర్వహించాలన్నారు. ఓటర్లు,అభ్యర్థుల ఏజెంట్లు వివిధ అంశాలపై సందేహాలను లేవనెత్తే అవకాశాలు ఉన్నందున వాటిని నివృత్తి చేయాల్సిన బాధ్యత పిఓలదేనని అన్నారు.పోలింగ్ పూర్తైన అనంతరం పక్కాగా రికార్డు బుక్కులలో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు.

ఎలాంటి సందేహాలు ఉన్నా,శిక్షణ తరగ తుల్లో మాస్టర్ ట్రైనర్లను అడిగి నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు.అనంతరం పోలింగ్ డే సందర్భంగా పిఓ లు,ఏపీఓలుతీసుకోవాల్సిన జాగ్రత్తలు,నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మాస్టర్ హమీద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా క్షుణ్ణంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రాజ్ కుమార్,ములుగు తహశీల్దార్ విజయభాస్కర్, పర్యవేక్షకులు సలీం,శివ కుమార్ తదితరులు ఉన్నారు.

## సేవలను అభినందించి ఘన సన్మానం

### వినియోగదారులకు మరింత సేవలను అందించాలి

కోదాడ టౌన్, ఫిబ్రవరి 21 ( ప్రజా జ్యోతి): కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్ రోడ్ ఎస్బిఐ బ్రాంచ్ వినియోగదారులకు విశిష్ట



సేవలను అందిస్తుందని కోదాడ పట్టణ విద్యుత్ శాఖ ఏఈ రామిశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ పల్లవి అసిస్టెంట్ మేనేజర్ ఆఫీసర్ కొలుగూరి మధూని శుక్రవారం ఆయన ఘనంగా సన్మానించారు. ప్రజలకు మరింత సేవలను అందించాలని కోరారు ఈ కార్యక్రమంలో పలువురు వినియోగదారులు కూడా పాల్గొన్ని బ్యాంకు ఉద్యోగులను అభినందిచారు.

## రైతులకు యూరియ క్రాప్ లోన్స్ అందజేత

నాంపల్లి,ఫిబ్రవరి,21(ప్రజా జ్యోతి): మండలంలోని ప్రాథమిక సహకార సంఘం కేంద్రంలో శుక్రవారం రైతులకు యూరియ మరియు క్రాప్ లోన్స్ ను నాంపల్లి సింగిల్ విండో చైర్మన్ గట్టుపల్లీ నర్సిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ ప్రజా పాలనలో ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రజా పాలన సాగుతుందని పేర్కొన్నారు. రైతులకు పెట్టుబడికి కావలసిన క్రాప్ లోన్స్ రూ. 50 లక్షలు మంజూరు చేశారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగపరచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ వెంకట్ రెడ్డి, హరీష్, సహకార సంఘ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## మీడియాపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

**ఎవరి మెప్పుకోసం, ఎవరు కింద చెంచాగిరిలుగా పత్రికలు చేయవు**

**జర్నలిజం విలువలు తెలియని వారు పత్రికల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉంది**

**తక్షణమే రామగుండం ఎమ్మెల్యే అనుచరులు మీడియాపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి**

**సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన్ గౌడ్**

కోదాడ టౌన్, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి):



ఆధారాలతో వార్తలు రాస్తే జీర్ణించుకోలేక మీడియాపై కావాలని అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, పత్రికలను కించపరిచే విధంగా మాట్లాడడం రామగుండం ఎమ్మెల్యే అనుచరులకు తగదని తక్షణమే వారి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సూర్యాపేట జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం కోదాడ పట్టణంలో మాట్లాడుతూ.... ప్రజా సమస్య ఉంటేనే పక్క ఆధారాలతో పత్రికలు వార్తలు రాస్తాయన్నారు. అక్రమాల పైన రాసేవి ఇన్వెస్టిగేషన్ స్టోరీలని, ఇవి వారి సోర్సును బట్టి పత్రికల రాస్తాయని తెలిపారు. ప్రెస్ మీట్ లాగా అందరూ కలిసి ఒక దగ్గర కూర్చొని రాయరని, పక్క సమాచారం ఉంటేనే పూర్తి ఆధారాలతో వార్తల ప్రచురిస్తారని గుర్తు చేశారు. రాజకీయంగా పరంగా ఏమైనా ఉంటే మీరు మీరు చూసుకోవాలి కాని, పరిధి దాటి మీడియాపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. తక్షణమే మీడియాపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలని లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా మీడియా పవర్ ఏంటో చూపిస్తామని హెచ్చరించారు.

## కంటైనర్ భీభత్సం... స్కూటీ, ఆటో, 2డిసిఎం లకు టక్కర్

### ఒకరు మృతి, పలువురికి గాయాలు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 21,( ప్రజాజ్యోతి ): మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు బైపాస్ రోడ్డు వద్ద అద్దంకి- నార్కట్ పల్లి రహదారిపై శుక్రవారం కంటైనర్ లారీ



బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఒకరు చనిపోగా పలువురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు నుండి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఎం హెచ్ 04 కె ఎఫ్ 8358 నెంబర్ గల కంటైనర్ లారీ అతి వేగంతో శరణ్య గ్రీన్ హోమ్స్ వద్ద పెట్న కోటి భారతయ్య (83) ను బలంగా ఢీ కొట్టింది అదే వేగంతో సమీపంలోని ఒక ఆటో ను, టీ స్టాల్ వద్ద ఆగి ఉన్న రెండు డీసీఎంలను బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న భారతీయ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే చనిపోగా, ఆటో డ్రైవర్ ధనుంజయ, కంటైనర్ డ్రైవర్ కూడా గాయాల పాలయ్యారు. మృతదేహాన్ని, క్షతగాత్రులను టూ టౌన్ పోలీసులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతిని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కంటైనర్ డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ ఎస్ఐ రాంబాబు తెలిపారు.





# మాత శిశు మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు

**మరణాలకు కారణాలను విశ్లేషించాలి**

**అరికట్టడంలో అంగన్వాడి, ఆశాలది కీలకపాత్ర**

**దేవరకొండ ప్రాజెక్టుపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలి**

**సిడిపివోలు ప్రతినెల ఆశా, అంగన్వాడీలతో సమావేశాలు నిర్వహించాలి**

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**గత సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు సంభవించిన మరణాలపై సమీక్ష**

నల్గొండ, ప్రజా జ్యోతి ప్రతినిధి: మాతా, శిశు మారణాలను తగ్గించడంలో భాగంగా మాతా, శిశు మరణాలు సంభవించడానికి గల కారణాలను విశ్లేషించాలని జిల్లా కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో నల్గొండ జిల్లా డివిజన్ కు సంబంధించి మాతా, శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవిస్తే ఈ విషయాన్ని అందరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు. ముఖ్యంగా మాత, శిశు మరణాలను అరికట్టడంలో అంగన్వాడి, ఆశాలది కీలకపాత్ర అని చెప్పారు. అనారోగ్యం కారణంగా మరణాలు సంభవించినప్పుడు వైద్యులు, నర్సులు, మెడికల్ సహాయం అవసరం అవుతుందని, అయితే అవగాహన లోపం , పౌష్టికాహార లోపం, నిర్లక్ష్యం వంటి కారణాలవల్ల మాత, శిశు మరణాలు సంభవిస్తే సరైన విధంగా వారికి అవగాహన కల్పించకపోవడం వల్లనే మరణాలు సంభవిస్తున్నాయని అర్థం వస్తుందని తెలిపారు. ఈ విషయంలో అంగన్వాడీ, ఆశలు కీలక పాత్ర పోషించాలని కోరారు. దేవరకొండ ప్రాజెక్టుపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని, సిడిపివోలు ప్రతినెల ఆశా ,అంగన్వాడీలతో సమావేశాలు నిర్వహించి గర్భిణీ స్త్రీలకు అన్ని విషయాల పట్ల కౌన్సిలింగ్ ఇవ్వాలని, ప్రత్యేకించి వైద్య పరీక్షలు, పౌష్టికాహారం, తీసుకోవాల్సిన ఇతర జాగ్రత్తలపై తెలియజేయాలని, మహిళ గర్భం దాల్చినప్పటి నుండి ప్రసవం వరకు, అలాగే ప్రసవం అయిన తర్వాత బిడ్డకు పాలు పట్టడం వరకు ఏం చేయాలో స్పష్టంగా తెలియజేయాలి అన్నారు. ఇకపై ఎక్కడైనా మాత శిశు మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అందువల్ల అంగన్వాడీలు, ఆశలు, డాక్టర్లు అందరూ జాగ్రత్తగా ఉండాలన్నారు. మాత, శిశు మరణాల కారణాలపై విశ్లేషణ చేయాలని, మహిళలు గర్భం దాల్చిన వెంటనే ఆశాలు ప్రతిరోజు వారి ఇంటికి వెళ్లి గమనించాలని తెలిపారు. కొన్ని మరణాలు మేనరికం, మూఢనమ్మకాలు, పౌష్టికాహారం తీసుకోకపోవడం వంటి కారణాలవల్ల జరుగుతున్నాయని, ఇలాంటి విషయాలలో తల్లిదండ్రులకు, గర్భిణీ స్త్రీలకు పూర్తిస్థాయిలో కౌన్సిలింగ్ చేయాల్సిన బాధ్యత అంగన్వాడీ, ఆశాలతో ఆశాలపై ఉందని అన్నారు. ఎక్కడైనా మాతా, శిశు మరణాలు సంభవించిన చోట చనిపోవడానికి గల కారణాలను విశ్లేషిస్తే ఒకవేళ సరైన విధంగా వైద్యం అందించి సకాలంలో వారికి కౌన్సిలింగ్ చేసినట్లయితే బతికేందుకు గల అవకాశాలను బేరిజు వేసుకొని ఇకపై మాత, శిశు మరణాలు సంభవించకుండా చూడాల్సిన బాధ్యత ఉందని అన్నారు. కౌన్సెలింగ్ ద్వారా 80శాతం మరణాలను అరికట్టవచ్చని చెప్పారు. పౌష్టికాహారం లోపం లేకుండా అవగాహన కల్పించాలని, మహిళా గర్భం దాల్చక ముందు నుండే మల్టీ విటమిన్ టాబ్లెట్లు వినియోగించే విధంగా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కట్టంగూరు, లైన్ వాడ, కేతపల్లి, చిట్యాల, కనగల్, రాములబండ, మాన్యం చెలుక, తదితర ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల పరిధిలో గత సంవత్సరం జనవరి నుండి ఇప్పటివరకు సంభవించిన మరణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మాతా శిశు మరణాలు సంభవించకుండా ప్రతి ఒక్కరు సమన్వయంతో కృషిచేసి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.





జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, డిప్యూటీ డిఎంహెచ్ఓ వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ వందన, డాక్టర్ స్వరూప రాణి, డాక్టర్ కల్యాణ చక్రవర్తి, వైద్యాధికారులు, సిడిపిఓలు, ఆశ, అంగన్వాడీ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి

**50 మంది ప్రిసైడింగ్, 50 మంది పోలింగ్ అధికారుల నియామకం**

**4182 ఓటర్ స్లిప్పులకు 501 పంపిణీ**

**పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు**

**41 ఎంసిసి బృందాలు.. 518 పోలీస్ సేవల వినియోగం**

**ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి**

నల్గొండ, ప్రజాజ్యోతి ప్రతినిధి: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్, వరంగల్, ఖమ్మం,నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి రాష్ట్ర ప్రధానఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి తెలియజేశారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వరంగల్,ఖమ్మం,నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ను కోరగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నియోజకవర్గ వ్యాప్తంగా 200 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, నల్గొండ జిల్లాకు సంబంధించి 37 ఉన్నాయని, ఇందుకుగాను 50 మంది ప్రిసైడింగ్ అధికారులను, 50 మంది పోలింగ్ అధికారులను నియమించడమే కాకుండా, వారికి





శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశామని తెలిపారు. 22 వేల 439 ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్పులకు గాను, 3358 వరకు పంపిణీ చేయడం జరిగిందని, ఈనెల 25 లోపు తక్కినవి పంపిణీ చేస్తామని, నల్గొండ జిల్లాకు సంబంధించి 4182 ఓటర్ స్లిప్పులకు గాను, ఇప్పటివరకు 501 పంపిణీ చేసినట్లు ఆమె వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఎమ్మెల్సీ ఎన్నికలకు జంబో బ్యాలెట్ బాక్సులు వినియోగిస్తున్నామని, నియోజకవర్గ పరిధిలో అన్ని జిల్లాలలో సరిపడే విధంగా జంబో బాక్సులు ఉన్నాయని, సిద్దిపేట జిల్లాకు మాత్రం జనగామ నుండి తీసుకుంటున్నారని తెలిపారు. 28 వేల బ్యాలెట్ పేపర్లను ఈ ఎన్నికలలో వినియోగించడం జరుగుతున్నదని, వీటన్నింటినీ ఇదివరకే పరిశీలించడం జరిగిందని, శనివారం అన్ని జిల్లాలకు వీటిని పంపిస్తున్నట్లు తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి, ఇతర నియమ, నిబంధనలను ఎప్పటికప్పుడు పోటీలో ఉన్న అభ్యర్థులకు, రాజకీయ పార్టీలకు, వారి ఏజెంట్లకు తెలియజేస్తున్నామని ఆమె వివరించారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటుకు గాను బిఎస్ఎన్ఎల్ కు వర్క్ ఆర్డర్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. నల్గొండ పట్టణం సమీపంలోని ఆర్జాలబావి గోదాము వద్ద ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, ఎమ్మెల్సీ ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రత్యక్షంగా అర్జాలబావి గోదాం సందర్శించి ఆమోదం తెలిపారని చెప్పారు. అలాగే 50 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామని, వారికి శిక్షణ కార్యక్రమాన్నీ కూడా పూర్తి చేయడం జరిగిందని వెల్లడించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం,నల్గొండ ఉపాధ్యాయ





ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా 37 పోలింగ్ స్టేషన్లు ఉండగా, 5 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు గుర్తించడం జరిగిందని, 13 రూట్లను ఏర్పాటు చేశామని, అలాగే ఇందుకు సంబంధించి 15 స్ట్రైకింగ్ ఫోర్సు , 3 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, 29 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 518 మంది పోలీసుల సేవలను తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని ఆయన వివరించారు. అంతకుముందు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వివిధ అంశాలపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సంబంధించిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. అదనపు కలెక్టర్ , వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల అదనపు రిటర్నింగ్ అధికారి జె. శ్రీనివాస్, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

## పదో తరగతి విద్యార్థులకు ఫ్యాడ్లు పెన్నులు పంపిణీ

అడ్డగూడూర్ ఫిబ్రవరి 21(ప్రజా జ్యోతి) అడ్డగూడూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అడ్డగూడూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తన సొంత డబ్బులతో శుక్రవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. . ఈ సందర్భంగా బైరెడ్డి సందీప్ రెడ్డి మాట్లాడుతూ...తాను బాల్యంలో



చదువుకున్న పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలో పదో తరగతిలో క్లాస్ మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి 2500 రూపాయలు, సెకండ్ ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.1500, థర్డ్ ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.1000 నగదు బహుమతి అందిస్తానని ప్రకటించారు. క్రమం తప్పకుండా శ్రమిస్తే కష్టానికి తగ్గ ఫలితం వస్తుందని, విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివి మంచి మార్కులు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యు,మహేష్, యు నరేందర్, బి లక్ష్మణ్, ఏన్, వెంకటేష్,జోసెఫ్, స్వప్న, కళ్యాణి,మరియు ఈ కార్యక్రమం లో అడ్డగూడూర్ పట్టణ కాంగ్రెస్ నాయకులు పరిగల సత్యనారాయణ, తుప్పతి లక్ష్మి నారాయణ, అడ్డగూడూర్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు బైరెడ్డి జగదీష్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ నాయకులు గండేలా రవి, షేక్ సమీర్, షేక్ సోహెల్, బాబు తదితరులు పాల్గొన్నారు

## ఈనెల 23న జరిగే గురుకుల ప్రవేశ పరీక్ష కు ఏర్పాట్లు పూర్తి

### - ఎస్సి గురుకుల ప్రిన్సిపాల్ ఐ. కృష్ణ

మిర్యాలగూడ, ఫిబ్రవరి 21,( ప్రజాజ్యోతి ): 2024 -25 విద్యా సంవత్సరానికి గాను ఐదవ తరగతిలో ప్రవేశాలకు గాను నిర్వహించే పరీక్షలకు ఏర్పాట్లు అన్ని పూర్తయినట్లు సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల ప్రిన్సిపాల్ ఐ. కృష్ణ నాయక్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 472 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు కేటాయించబడ్డారని



తెలిపారు. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష నిర్వహించబడు తుందని, గంట ముందుగా విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఇస్తారని తెలిపారు. విద్యార్థులు హాల్ టికెట్, పరీక్షా ప్యాడ్, బాల్ పాయింట్ పెన్ తప్పనిసరిగా తెచ్చుకోవాలని, పరీక్ష ఓఎంఆర్ షీట్ విధానంలో జరుగు తుందని తెలిపారు. విద్యార్థులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా సకల ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ కృష్ణ చెప్పారు.

## చంద్రబాబు జపం మానవా చంద్రశేఖరా

కోదాడ టౌన్, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబును దూషిస్తూ తన ఉనికిని కాపాడుకొనే ప్రయత్నం చేస్తున్న బీఆర్ఎస్ నేత కల్వకుంట్ల చంద్రశేఖర్రావు కుట్రలిక సాగవని తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు హెచ్చరించారు. తెలంగాణ భవన్ లో ఇటీవల బిఆర్ఎస్ శ్రేణులను ఉద్దేశించి కేసీఆర్ మాట్లాడుతూ సమయం సందర్భం కాకున్నా చంద్రబాబు నాయుడు పేరును ప్రస్తావించి విమర్శించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇరవై నాలుగేండ్ల క్రితం తెలంగాణలో పార్టీ పెట్టి, పదేండ్లు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పరిపాలన చేసి, చెప్పటానికి తన దగ్గర ఏమిలేనట్లు ఇప్పటికీ చంద్రబాబు నాయుడును తెలంగాణ ద్రోహిగా చిత్రించటం భావ్యం కాదని విమర్శించారు. బిఆర్ఎస్ పార్టీకి ఓటమి ఎదురైనప్పుడల్లా, పద్ద ప్రతిసారీ నిలదొక్కు కొనేందుకు చంద్రబాబు నాయుడును దుషించటమో, విమర్శించటమో కేసీఆర్ కు పరిపాటైందని దుయ్యబట్టారు. చంద్రబాబు పట్ల కేసీఆర్ వైఖరి వల్లే గత అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ ఓటమి చవిచూసినప్పటికీ కేసీఆర్ కు జ్ఞానోదయం కాకపోవటం ఆశ్చర్యం కలిగిస్తున్నదని చెప్పారు. చంద్రబాబుపై, టీడీపీపై అసత్య ఆరోపణలతో బురద చల్లే కుట్రలకు, కుతంత్రాలకు స్వస్తి చెప్పకపోతే భవిష్యత్తులో కేసీఆర్ కు, బిఆర్ఎస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రంలో పుట్టగతులుండవని హెచ్చరించారు.

## ఉమ్మడి గురుకులాల ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

### ఆర్ పి ఆర్ పి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి

తుంగతుర్తి, ఫిబ్రవరి 20,(ప్రజాజ్యోతి) తెలంగాణ రాష్ట్ర గురుకులా తరగతి ఉమ్మడి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తుంగతుర్తి మండల కేంద్రంలోని ఆర్పిఆర్పి బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈనెల 23వ తేదీన నిర్వహించిన ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహించినట్లు వివరించారు. మొత్తం 515 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. హాల్ టికెట్లు సంబంధిత వెబ్ సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాన్ని ఒకరోజు ముందు చూసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పరీక్ష కేంద్రం వద్దకు ఉదయం 9.30 గంటలకు చేరుకోవాలన్నారు. పరీక్ష ప్యాడ్, బ్లూ, బ్లాక్ పెన్, ఆధార్ కార్డు, హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు.

## మిర్యాలగూడలో పట్టపగలు చోరీ..!

### బంగారు ఆభరణాలు అపహరణ

మిర్యాలగూడ, ఫిబ్రవరి 21,( ప్రజాజ్యోతి ): మిర్యాలగూడ పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం పట్టపగలు దొంగతనం జరిగింది. పట్టణంలోని సీతారాంపురం కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు రషీద బేగం రోజు మాదిరిగా శుక్రవారం విధులకు గాను స్కూల్ కు వెళ్ళింది. ఇదే అదునుగా గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలు అపహరించుకు పోయారు. సాయంత్రం ఐదు గంటలకు విధులు ముగించుకొని ఇంటికి వచ్చిన ఉపాధ్యాయురాలు ఇంటికి ప్రధాన దర్వాజ తాళం పగిలిపోట్టి ఉండడం, వెనుక నుంచి తలుపు తీసి ఉండడంతో గుర్తించి లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం పగలగొట్టి అందులో ఉన్న సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలు అపహారణకు గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. టూ టౌన్ ఎస్ఐ రాంబాబు సంఘటన చేరుకొని పరిసరాలను పరిశీలించారు. నల్గొండ నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలను సేకరించారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు సిఐ నాగార్జున తెలిపారు.



# మాతృభాష తల్లితో సమానం

– నలంద కళాశాలలో ఘనంగా మాతృభాషా దినోత్సవం



ఎల్లారెడ్డి ఫిబ్రవరి 21:(ప్రజా జ్యోతి ) అంతర్జాతీయ మాతృభాషాను నిర్లక్ష్యం చేయొద్దని మాతృభాష తల్లితో సమానమని నలంద కళాశాల ప్రిన్సిపాల్ సంగ్రామ్ నాయక్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణంలోని నలంద జూనియర్, డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...ఆంగ్ల భాషను నేర్చుకోవాలి కానీ, మన మాతృభాష అయిన తెలుగును నిర్లక్ష్యం చేయొద్దని విద్యార్థులకు సూచించారు. ప్రపంచంలో ఎన్నో భాషలున్నా.. అందులో మాతృభాషా చాలా గొప్పదన్నారు. మాతృభాష తల్లితో సమానమని, పసికందుకు తల్లిపాలు ఎంత ముఖ్యమో.. విద్యార్థులకు మాతృభాష అంతే అవసరమని వివరించారు. మాతృభాషను మరువనంత వరకు విద్యార్థులు విజయాల బాటలో విహరిస్తారని అన్నారు. అనంతరం మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల, కళాశాల విద్య సంస్థల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### కామారెడ్డి పట్టణంలో నిరంతర

## పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు నిర్వహించాలి

– జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 21. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని విద్యానగర్, వార్డు నెం 12, రామారెడ్డి బై పాస్ ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటించి మున్సిపల్ అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటింటి చెత్త సేకరణ ప్రతీరోజూ నిర్వహిస్తే వీధుల్లో గృహిణులు చెత్త వేయరని, ప్రతీరోజూ ప్రతీ ఇంటి నుండి తడి పొడి చెత్తను మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది సేకరించాలని అన్నారు. రోడ్లపై వేయకుండా చెత్త బుట్టలో వేసే విధంగా అవగాహన కల్పించాలని, ప్రచారం నిర్వహించాలని సూచించారు. మున్సిపల్ ఆధీనంలోని ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఆయా వార్డు అధికారులు, మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఇంటింటి నుండి సేకరించిన చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని, సేగ్రిగేషన్ చేయాలని తెలిపారు. దుకాణ సముదాయల్లోని చెత్తను ప్రతీరోజూ సేకరించాలని, రోడ్డు పై చెత్త వేసే వారికి మొదట అవగాహన కల్పించాలని, ఆ తదుపరి కూడా చెత్తను రోడ్లపై వేస్తే మున్సిపల్ యాక్ట్ ప్రకారంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న నాలీల్లోని చెత్తను తొలగించాలని తెలిపారు. దోమలు వ్యాప్తి చెందకుండా చూడాలని, నాలీల్లో చెత్త వేయకుండా ప్రజలకు తెలియపరచాలని అన్నారు. మున్సిపల్ టాక్స్ వసూలు చేయాలనీ, ఏరియర్స్ తో సహా వసూలు చేయాలనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రాజేందర్ రెడ్డి, డిప్యూటీ ఈ ఈ వేణుగోపాల్, ఏఈఈ శంకర్, శానిటరీ ఇన్స్పెక్టర్, తదితరులు ఉన్నారు.

## రక్తదానంతో ఆదర్శంగా జమీల్ హైమద్

– 28వ సారి రక్తదానం చేయడం అభినందనీయం

– ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు




కామారెడ్డి జిల్లా ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 21. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో అనీమియా వ్యాధితో బాధపడుతున్న శిల్ప (24) కి బి పాజిటివ్ రక్తం అవసరం కావాలని వారి కుటుంబ సభ్యులు సంప్రదించడంతో వారికి కావలసిన రక్తాన్ని కామారెడ్డి రక్తదాతన సమూహ అధ్యక్షులు జమీల్ హైమద్ 28 వ సారి ప్రభుత్వ వైద్యశాల లోని రక్తనిధి కేంద్రంలో రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాలు మాట్లాడుతూ నేటి సమాజంలో కొందరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు సంఘాల ముసుగులో పాఠశాలలకు వెళ్లకుండా, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు,ప్రైవేటు కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తూ సమాజంలో చెడ్డ పేరు తీసుకువస్తుంటే,జమీల్ హైమద్ మాత్రం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉండి ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడమే కాకుండా, తలసేమియా చిన్నారులకు మెగా రక్తదాన శిబిరాలను విజయవంతం చేస్తూ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు సంపాదించుకొని ఉపాధ్యాయ లోకానికే ఆదర్శంగా నిలిచాడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాదిక్ అలీ, సంతోష్, టెక్నీషియన్ అమర్ లు పాల్గొనడం జరిగింది.

## రోడ్డు ఇలా.. ప్రయాణం ఎలా.. అదుపు తప్పితే అంతే..

– ప్రమాదం జరిగితే కానీ పట్టించుకోరా – ఇస్సాన్నపల్లి,.రామారెడ్డి సర్వీస్ రోడ్

– నిద్ర అవస్థలో అధికార యంత్రాంగం



రామారెడ్డి ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి) రామారెడ్డి మండల కేంద్రంలోని మద్దికుంట అటవీ ప్రాంతంలో స్వయంభుగా వెలసిన శ్రీ బుగ్గ రామలింగేశ్వర ఆలయానికి ప్రతి ఏటా వేలాది సంఖ్యలో మహాశివరాత్రి పర్వదినాన పుణ్యస్నానాల కోసం, ఆ యొక్క పార్వతీ పరమేశ్వరుల ఉత్సవాలకు గ్రామంలోని ప్రజలే కాకుండా, చుట్టుపక్కల గ్రామాలలు, వివిధ జిల్లాల నుండి అంతేగాక ఇతర రాష్ట్రాల నుండి కూడా ఇక్కడికి తండోపతండాలుగా మహా పుణ్యక్షేత్రమైనటువంటి బుగ్గ రామలింగేశ్వర ఆలయాన్ని దర్శించుకోవడానికి ప్రజలు వస్తుంటారు.

**రోడ్డు ఆలా ఉంటే భక్తులు ఎలా వస్తారు..!**

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బస్ డిపో నుండి నేరుగా ఈ యొక్క ఆలయాన్ని దర్శించుకోవడానికి భక్తులు చాలామంది వస్తుంటారు వారి సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపిస్తుంటారు. అదేవిధంగా డైలీ ఆర్టిసి బస్సు వెళ్లడం జరుగుతుంది. ఈ యొక్క బస్సు ప్రయాణానికి సంబంధించిన రోడ్డు మార్గం అస్తవ్యస్తంగా,గుంతల మయంగా మారడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడడం జరుగుతుంది. ప్రయాణంలో వాహనదారులు అదుపుతప్పితే అంతే, అయితే మహాశివరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్న సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులు చదవచీ త్వరగా రోడ్డు మార్గాన్ని బాగు చేయవలసిందిగా ప్రజలు కోరుతున్నారు.

## గ్రామాల్లో బెల్ట్ షాప్‌ల వలన ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

– అధికార పార్టీ అండతోనే కొనసాగుతున్నాయన్న ఆరోపణలు?





రాజంపేట, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి) రాజంపేట మండల పరిధిలోని ఆర్గొండ కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, గుండారం గ్రామాల్లో మరియు తండాల్లో బెల్ట్ షాప్‌ల ద్వారా మద్యం విక్రయం నిర్బంధంగా కొనసాగుతుందని, అర్ధరాత్రి దాటిన తరువాత కూడా అమ్మకాలు సాగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నియంత్రణ లేకుండా అధిక ధరలకు మద్యం విక్రయిస్తూ ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతీస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. లైట్ బీర్ వైన్ షాప్‌లో రూ.180 ఉండగా, గ్రామాల్లోని బెల్ట్ షాపుల్లో రూ.230కి విక్రయిస్తున్నారని తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఎన్నికల సమయంలో బెల్ట్ షాపులను నిర్మూలిస్తానని హామీ ఇచ్చినా, అదే పార్టీకి చెందిన కొందరు నేతల అండదండలతో బెల్ట్ షాపులు నిర్బంధంగా కొనసాగుతున్నాయని ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల డిమాండ్.

# నిర్మలమ్మ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో పేదలకు శ్రమజీవులకు చోటెక్కడ!

– సీఐటీయు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్



కామారెడ్డి ప్రజాజ్యోతి ప్రతినిధి ఫిబ్రవరి 21. కామారెడ్డి జిల్లా కేంద్రంలో సిఐటియు. రైతు. వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025.26 సంవత్సరాల బడ్జెట్ను వ్యతిరేకిస్తూ జిల్లా సెమినార్ నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ హాజరై, సెమినార్ను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటవ తేదీన ప్రవేశపెట్టిన 2025, 26 సంవత్సరాలకు ప్రవేశపెట్టిన 50 లక్షల 65,346 కోట్లు వార్షిక బడ్జెట్లో లో పేదలకు కార్మిక వర్గానికి ఎలాంటి కేటాయింపులు దక్కలేదన్నారు. ఈ బడ్జెట్ కేవలం కార్పొరేట్ల కు దోచిపెట్టే బడ్జెట్ గా ఉందనీ, మధ్యతరగతి ఉద్యోగులను మాయ చేస్తూ తమ ఆదాయంలో పన్ను రాయితీని ప్రకటిస్తూనే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లుగా 12 లక్షల 75000 దాటిన ఒక్క రూపాయి పెరిగిన నాలుగు లక్షల పన్నును విధించింది ఇది దుర్మార్గం మరోవైపు ఇన్సూరెన్స్ రంగంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను 100 శాతం స్వాగతిస్తూ ప్రకటన చేయటం దేశవ్యాప్తంగా ఉన్న ఎల్ఐసి, జిఐసి, పోస్టల్ బీమా లాంటి సంస్థలను నీరుగారిస్తూ ప్రైవేటు వ్యక్తుల పరం చేసిందన్నారు. విద్యుత్తును ప్రైవేటీకరిస్తూ భారతదేశానికి తలమానికంగా ఉన్న వ్యవసాయ రంగాన్ని పెద్ద ఎత్తున దెబ్బకొట్టేందుకు ప్రయత్నాలు చేసిందనీ, సంవత్సరాల తరబడి రైతాంగం వ్యవసాయ దారులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని పోరాటం చేస్తున్నప్పటికీ కేంద్ర బడ్జెట్లో పంటల గిట్టుబాటుకు సంబంధించిన ప్రకటన చేయకపోవడం తీవ్ర వ్యతిరేకతను కేంద్ర బిజెపి ప్రభుత్వం కూడగట్టుకుందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పనికి బడ్జెట్ పెంచాలని పని రోజులు పెంచాలని కోరుతున్నప్పటికీ ఏటేటా బడ్జెట్ చెల్లింపులలో తగ్గిస్తూ రావడం ఈ పథకాన్ని నీరుగార్చడం తప్ప మరొకటి కాదన్నారు. దేశవ్యాప్తంగా 30 కోట్ల పైగా ఉన్న యువతకు ఉపాధి కల్పన చూపిస్తామని సంవత్సరానికి కోటి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ప్రకటిస్తున్నప్పటికీ ఆమెరకు బడ్జెట్లో యువతకు ఉపాధి కల్పించే అంశాల పట్ల గాని నిరుద్యోగ సమస్యను పరిష్కరించే ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఈ బడ్జెట్ యొక్క అసలు స్వరూపాన్ని వ్యక్తపరుస్తున్నదన్నారు. దేశ ఆర్థిక శాఖ సర్వే జాతీయ స్థూల ఆదాయాన్ని మరో పదేళ్ల కాలంలో 8 శాతానికి పెంచకోకుంటే భారతదేశ ప్రమాదంలో పడుతుందని హెచ్చరిస్తు న్నప్పటికీ ఆ పద్ధతిలో జాతీయ స్థూల ఆదాయాన్ని పెంచేందుకు బిజెపి ప్రభుత్వం ఏ మాత్రం కూడా అడుగు ముందుకు వేయని పరిస్థితి ఉంది, ప్రస్తుతం మోడీ అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు దేశంలో 19 మంది గా ఉన్న సంపన్నులు నేడు 200 మందికి పెరగడం ఎంతటి కార్పొరేట్ బడా సంస్థలకు కేంద్రం కొమ్ముకాస్తుందో అర్థం చేస్తుంది . దేశంలో బడా కార్పొరేట్ సంస్థల ఆదాయంలో నాలుగు శాతం పన్ను గనుక విధిస్తే దేశ జాతీయ స్థూల ఆదాయం మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నప్పటికీ కార్పొరేట్ల ఆదాయం పై పన్ను విధించేందుకు బిజెపి ప్రభుత్వం ధైర్యం చేస్తున్న పరిస్థితి లేదు, ముఖ్యంగా నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందనేది చెబుతున్న తెలంగాణ రాష్ట్రం నుండి ఎనిమిది మందిని కేంద్ర మంత్రులుగా తెలంగాణ రాష్ట్రం అందించినప్పటికీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం బిజెపి ప్రభుత్వం తమ బడ్జెట్లో ఎలాంటి ప్రకటన ప్రకటించిన పరిస్థితి లేదు, ముఖ్యంగా రైల్వే కోచ్ ప్రకటిస్తామని, బయ్యారం ఇనుప కర్మాగార నిర్మాణానికి చర్యలు చేపడతామని అదే విధంగా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించే విషయంలో ఎలాంటి ప్రకటన చేయకపోవడం ఇప్పటికే విభజన హామీల ప్రకారం రాష్ట్రానికి అందించాల్సిన నిధులను అందించకపోవడం, జీఎస్టీ పేరుతో తెలంగాణ రాష్ట్రానికి రావలసిన నిధులను కూడా కేంద్ర ప్రభుత్వం తొక్కి పట్టడం వెనక కచ్చితంగా తెలంగాణ రాష్ట్రం పట్ల మొండిగా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్నదనేది అర్థమవుతుందన్నారు. కాబట్టి కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్లో తక్షణమే సమూల మార్పులు చేయాలని ముఖ్యంగా కార్మిక వర్గంపై కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే ప్రయత్నాలను మానుకోవాలని, ఎనిమిది గంటల పని దినాలను 12 గంటలకు మారుస్తూ చేసే విధానాలను తక్షణమే వెనుక్కు తీసుకోవాలని లేబర్ కోర్టులో అమలుకు సిద్ధమవుతున్న బిజెపి ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోళ్లను వెనుక్కు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతాలలో కోటి ఇండ్ల నిర్మాణానికి తక్షణమే పూనుకొని ఇండ్ల నిర్మాణం చేపట్టాలని దేశవ్యాప్తంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు బీమా సౌకర్యాన్ని కల్పించాలని, వలస కార్మిక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటి జిల్లా కార్యదర్శి కే చంద్రశేఖర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోతిరామ్, సిఐటియు జిల్లా నాయకుడు వెంకట్ గౌడ్, మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు, కార్యదర్శి మహబూబ్, ఉపాధ్యక్షుడు కాత్రియాల ప్రభు, గ్రామపంచాయతీ బాల్ నర్సు, మిషన్ భగీరథ అధ్యక్షుడు అనిల్, ప్రతినిధులు విజయ్, నర్సింలు, భూలక్ష్మి, నర్సింలు, సాయిలు, పురుషోత్తం, లక్ష్మితదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు పెండింగ్ నిధుల విడుదల చేయాలని విజ్ఞప్తి

– వేసవిలో త్రాగునీటి సమస్య తీవ్రత పెరిగే అవకాశం



రాజంపేట ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి) రాజంపేట మండలంలోని గ్రామ పంచాయతీలకు పెండింగ్‌లో ఉన్న నిధులు వెంటనే విడుదల చేయాలని శుక్రవారం రాజంపేట ఎంపిడిఓ రాజేశ్, ఎంపీడీవో రఘురాం, కు పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శులు మాట్లాడుతూ, పాలకవర్గం పదవీకాలం ముగిసిన తర్వాత గ్రామ పంచాయతీ నిర్వహణ పూర్తి బాధ్యత తమపై పడిందని, నిధుల లేమితో పంచాయతీ పరిపాలనకు తీవ్రమైన సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. పారిశుధ్య పనులు, ట్రాక్టర్ల నిర్వహణ, త్రాగునీటి సరఫరా కోసం నిధులేక అప్పులు చేసి పనులు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. వేసవి కాలంలో త్రాగునీటి సమస్య మరింత తీవ్రతరమవుతుందని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకముందే పెండింగ్ నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు.

### ఎల్లారెడ్డిపల్లిలో మిషన్

## భగీరథ పైప్‌లైన్ లీకేజీల పరిశీలన

– లీకేజీలు వెంటనే సరిచేయాలని అధికారుల ఆదేశం



రాజంపేట ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి) రాజంపేట మండల పరిధిలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం మిషన్ భగీరథ క్వాలిటీ కంట్రోల్ డి.ఈ. వెంకటేష్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలు, వాటర్ ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్ పౌడర్ వినియోగం తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. అలాగే, మిషన్ భగీరథ పంప్ హౌస్‌ల వద్ద సూపర్వైజర్లు నీటిని పొదుపుగా వినియోగించేలా పర్యవేక్షించాలని సూచించారు. కొత్తగా నిర్మితమైన గృహాలకు భగీరథ నీటి సరఫరా అందించాలని, నూతన గృహదారులు దరఖాస్తులు చేసుకుంటే వారికి తక్షణమే అనుమతులు మంజూరు చేయాలని పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ క్వాలిటీ కంట్రోల్ ఏ.ఈ. సత్యనారాయణ, మిషన్ భగీరథ ఏ.ఈ. రజిత, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్నేషనల్ ట్విన్స్ డే..!

– సమరూపకులు..సమ్ థింగ్ స్పెషల్..!

– ఫిబ్రవరి 22 అంతర్జాతీయ కవలల దినోత్సవం

– గుమ్మడి లక్ష్మీనారాయణ, సామాజిక రచయిత





రామారెడ్డి ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి) తల్లి గర్భం నుంచి ఒకే సమయంలో లేదా కొన్ని సెకన్ల వ్యవధిలో జన్మిస్తే వారిని కవల పిల్లలు అంటారు. ఇద్దరు మగ పిల్లలు, లేదా ఆడ పిల్లలు కావచ్చు, అరుదుగా ఒక ఆడబిడ్డ, ఒక మగబిడ్డ కావచ్చు. కవలలుగా జన్మించే పిల్లల్లో చాలా వరకు ఒకేలా ఉంటారు. శరీర నిర్మాణం, రంగు, జట్టు, ఎత్తు వంటివన్నీ దాదాపు 99 శాతం ఒకేలా ఉంటాయి. ఒకే పోలికతో ఉండే కవలలను వైద్య పరిభాషలో 'ఐడెంటికల్ ట్విన్స్' అని వేర్వేరు పోలికలతో జన్మించిన కవల పిల్లలను 'నాన్ ఐడెంటికల్ ట్విన్స్' అని పిలుస్తారు. ప్రపంచ వ్యాప్తంగా 130 మిలియన్ల ట్విన్స్ ఉన్నారని 2006లో ఓ సర్వే ద్వారా బయటపడింది. అప్పటి నుంచి ప్రతి ఏటా ఫిబ్రవరి 22 న అంతర్జాతీయ కవలల దినోత్సవం నిర్వహించడం ప్రాచుర్యంలోకి వచ్చింది.

**పోలెండులో జన్మించిన..!**

"మోజెస్, ఆరన్ విల్కాక్స్" అనే కవల సోదరులు మరణించిన రోజును ప్రపంచ కవలల దినోత్సవంగా తొలిసారి 1976లో నిర్వహించారు. దీనికి ఒక కథనం కూడా ప్రచారంలో వుంది. మోజెస్, ఆరన్ విల్‌కాక్స తాము నివసిస్తున్న ఇంటి (ఊరు) కి 'ట్విన్స్ బర్గ్' అని పేరు పెట్టుకుని ఎంతో ఆప్యాయతతో ఉండేవారు. వివాహం తరువాత తమ అనుబంధం విడిపోవద్దన్న ఆలోచనతో అక్కచెల్లెళ్ళను వివాహం చేసుకుని, రెండు కుటుంబాలు ఎంతో అనురాగంతో ఉండేవి. విచిత్రంగా ఇద్దరూ ఒకే వ్యాధితో భాధపడుతూ ఒకే రోజున (ఫిబ్రవరి 22న) మరణించారు. బింబప్రతిబింబాల మాదిరిగా ఉన్న ఈ కవలసోదరుల గౌరవార్థం ఆ నాటినుంచి ఆ కవలలు మరణించిన రోజునే కవలల దినోత్సవంగా జరుపుతున్నారు. పురుషుల్లోని ప్రత్యుత్పత్తి వ్యవస్థ నుంచి విడుదలయ్యే శుక్ర కణం మహిళల్లోని అండంతో ఫలదీకరణం చెందడం వల్లే పునరుత్పత్తి జరుగుతుందని తెలుసు. ఐతే.. ఒక్కొసారి కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు కనిపిస్తాయి. మహిళల్లో కొన్నిసార్లు రెండు అండాశయాల నుంచి రెండు అండాలు విడుదలైనప్పుడు వాటికి రెండు శుక్ర కణాలు జతకలిస్తే ఫలదీకరణ విభిన్నంగా ఉంటుంది. లేదా ఒకే అండం రెండు సార్లు విదళనం. చెందిన క్రమంలో కవల పిల్లలు జన్మిస్తారు. కవలలకు జన్మనివ్వడంలో జన్యువులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అంటే.. ఒక వంశంలో పూర్వం ఎవరైనా కవలలకు జన్మనిచ్చి ఉంటే.. ఆ వంశంలోని వారికి ఆ అవకాశం ఎక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులిద్దరి వంశాల్లో 'ట్విన్స్ హిస్టరీ' ఉంటే కవలలకు జన్మనిచ్చే అవకాశం మరింత పెరుగుతుంది. 'ట్విన్స్ జీన్స్' ఉన్న మహిళలు.. 30 ఏళ్ల వయసు దాటాక గర్భం ధరిస్తే కవలలు జన్మించే అవకాశం ఎక్కువ. కానీ వాటిని గుర్తించడం కష్టం.

**కవలలు రూపంలో ఒకేలా ఉన్నా..!**

వారి ఫింగర్ ప్రింట్స్, కళ్లు మాత్రమే వేరేలా ఉంటాయి. కొంతమంది ట్విన్స్ ముఖ కవలికలు ఒకేలా ఉన్నా శారీరక బరువు వేర్వేరుగా ఉంటుంది. కవలల ఆకృతి మాత్రమే ఒకేలా ఉన్నా వారి ఆలోచనలు ఒకేలా ఉండవు. కొందరి కవలల్లో చుస్తే – చదువులో కొద్ది తేడాతో ఒకసారి ఒకరు, మరోసారి ఇంకొకరు ముందుంటూ ఆశ్చర్య పరుస్తారు. కొందరు ట్విన్స్‌లో ఒకరు ఆరోగ్యంగా ఉంటే మరొకరు బలహీనంగా ఉండవచ్చు. అలాగే ఇద్దరిలో రోగ నిరోధక శక్తుల్లో చాలా వ్యత్యాసం ఉంటుంది. ఇతరులు కవల పిల్లలను ఎలాగైతే గుర్తించలేకపోతారో, వారి తల్లిదండ్రులు కూడా కొన్ని సార్లు తికమక పడుతుంటారు. ఎందుకంటే ప్రతి ఆరునెలలకొకసారి శరీర రూపం మారుతుంది. చదువు విషయంలోనూ ఏడాదికి ఒక్కొక్కరు ఒకసారి ముందుండటం చూసి ఆశ్చర్యానికి గురౌతుంటారు. శరీరాలు అతుక్కుని జన్మించే పిల్లలను సయామీ కవలలు అంటారు.

**ఇద్దరు కవలలు జన్మించడం సాధారణమే..!**

కానీ ముగ్గరు నుంచి ఏడుగురి వరకు జన్మించడం అత్యంత అరుదుగా జరుగుతుంది. కవల పిల్లలకు జన్మినిచ్చే మహిళలు ఎక్కువ కాలం జీవిస్తారని ఓ అధ్యయనం ద్వారా తేలింది. ఒకసారి కవలలకు జన్మినిచ్చిన మహిళకు మరో కాన్పులో కూడా కవల పిల్లలు పుట్టే అవకాశం ఎక్కువగా ఉందంటున్నారు వైద్యనిపుణులు. ప్రతి పన్నెండు మంది మహిళల్లో ఒకరికి ఈ అవకాశం ఉండవచ్చు. అయితే.. తొలిసారి జన్మించే కవలలు ఒకేలా ఉన్నప్పటికీ రెండోసారి కాన్పులో జన్మించిన ట్విన్స్ వేర్వేరు రూపాల్లో ఉండే అవకాశాలే ఎక్కువగా ఉంటాయట. ఏదేమైనా కవలల యొక్క సమరూపకత, సమానత్వం, సౌభ్రాతృత్వం, ఐకమత్యం వంటి లక్షణాలు అందరిలో ఉంటే ఎంత బావుండు కదా!

## మాత, శిశువు సంరక్షణ వైద్య ఆరోగ్య ఆసుపత్రికి 40 పడకల

* సిజేరియన్ పోస్ట్ సర్జికల్ వార్డు మంజూరు
* తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి
* కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా.సిద్దం.ఉజ్వల్ రెడ్డి



**జహీరాబాద్,ఫిబ్రవరి 21( ప్రజా జ్యోతి న్యూస్)** పట్టణములో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మాత, శిశువు సంరక్షణ వైద్య ఆరోగ్య ఆసుపత్రి నిర్మాణ పనులను తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా.సిద్దం. ఉజ్వల్ రెడ్డి పరిశీలించారు. ఇదిలా ఉండగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు శ్రీధర్, కిరణ్మాయి వారిని మాత, శిశువు సంరక్షణ వైద్య ఆరోగ్య ఆసుపత్రికి 40 పడకల సిజేరియన్ పోస్ట్ సర్జికల్ వార్డు మంజూ రుకు కృషి చెయ్యాలని కోరగా వారు స్పందించి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వర్యులు దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లడంతో మంత్రి వర్యులు 40 పడకల సిజేరియన్ పోస్ట్ సర్జికల్ వార్డు మంజూరు చేశారు. దీంతో స్థానిక వైద్యులు హర్షవ్యక్తం చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు దామోదర రాజనర్సింహ, తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డా॥ఉజ్వల్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## కోహెడలో డాక్టర్ ప్రసన్న హరికృష్ణ ఎమ్మెల్సీ గెలుపు కోసం భారీ ప్రచారం



**కోహెడ, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి):** డాక్టర్ ప్రసన్న హరికృష్ణ ఎమ్మెల్సీ గెలుపు కోసం కోహెడ మండల పరిధిలో భారీ స్థాయిలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ టి. జగదీష్, సామాజిక సేవ సీనియర్ నాయకులు కొయ్యాడ కొమురయ్య, హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ తల్లపల్లి వెంకటేష్, పోలు శంకర్, బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రాజు పాల్గొన్నారు.అలాగే, కోహెడ ప్రసన్న హరికృష్ణ టీం ఇంచార్జ్ కాత శ్రీకాంత్, మౌటం ప్రదీప్, కోహెడ బీఎస్పీ మండల అధ్యక్షులు వేల్పుల మహేష్, ఉపాధ్యక్షులు చిట్యాల అశోక్, కొంకటి పరశురాములు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ప్రచారంలో భాగంగా నాయకులు గ్రామస్థులను కలిసి బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ విజయం కోసం మద్దతు కోరారు.

## ప్రాథమిక పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం



**చిన్నకోడూర్, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి):** మండల పరిధి విఠలాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థుల స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వివరించి పాఠాలు బోధించారు. డీఈవోగా మర్కంటి శ్రీవర్షిని, ప్రధానోపాధ్యాయులుగా మన్నె తేజశ్రీ, ఉపాధ్యాయులు గా హాసిని, నవనీత, నాగవర్ధన్,మైథిలీ,దృషిత, తేజశ్విని, మనస్విత, రాంచరణ్ నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయులు శశి కుమార్, ఉపాధ్యాయులు ప్రశాంత్, రత్నమాల, రాంమోహన్ పర్యవేక్షించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

* కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మచ్చ శ్రీనివాస్

**సిద్దిపేట ప్రజాజ్యోతి :** ప్రస్తుతం డబ్బు పలుకుబడి కుటుంబ నేపథ్యం ఉంటేనే రాజకీయాలు చేయాలనే ట్రెండు నడుస్తుందని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మచ్చ శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం పట్ల, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల పట్ల తనకు ఉన్న అవగాహనతో కరీంనగర్ పట్టబద్రుల ఎమ్మెల్సీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని తెలిపారు. నేటి పరిస్థితుల్లో రాజకీయాలను డబ్బు పూర్తిగా శాసిస్తుందని ఎలాంటి ఆర్థిక వనరులు, పలుకుబడి లేకున్నా ప్రజాస్వామ్యం మీద నమ్మకంతో పోటీ చేస్తున్నాను అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తమ వంతు పాత్ర పోషించిన దుబ్బాక గడ్డ నుండి పోటీ చేస్తున్నానని.తనపై నమ్మకం ఉంచి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉద్యోగులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేస్తానని, పట్టభద్రులు అందరూ తనను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సురేష్, గోపి, రంజాన్ నాయక్, బ్రహ్మ స్వామి పలువురు పాల్గొన్నారు.



# మార్పు కోసం వస్తున్న కామన్ మ్యాన్‌ను ఆశీర్వదించండి

ట్రస్మా బలపరిచిన స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు




**సిద్దిపేట ప్రజాజ్యోతి :** విద్యను వ్యాపారం చేయలేదని సర్వీస్ చేస్తున్నానని మార్పు కోసం వస్తున్న ఆశీర్వదించండి పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు అన్నారు. శుక్రవారం రోజు సిద్దిపేట ప్రెస్ క్లబ్ జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు దేశంలో పలు రాష్ట్రాలకు చెందిన ప్రైవేట్ స్కూల్ మేనేజ్మెంట్ ప్రతినిధులు తన గెలుపు కోసం వివిధ ప్రాంతాల్లో ప్రచారం చేస్తున్నారని తెలిపారు బిజినెస్ చేసేవారు తన లాభం కోసం చూస్తారు గాని నిస్వార్థంగా సేవ చేయలేరన్నారు పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలను కాదని వేలకోట్ల సంపాదించే కార్పోరేట్ వ్యక్తులకు పార్టీ టికెట్లు ఇచ్చి పార్టీలో కార్యకర్తలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు నేడు 40 మంది ఉన్న శాసనమండలిలో ఎలాంటి చర్చ జరుగుతా లేదన్నారు తనను గెలిపిస్తే 6 సంవత్సరాలలో ప్రతి నెల జీతం ఒక్కొక్క మండలానికి ఇచ్చి రిసోర్స్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉచితంగా కోచింగ్ ఇచ్చి పట్టభద్రుల అభివృద్ధికి దోహదపడతానని అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు వేల కోట్ల రూపాయలతో ఎన్నికలకు వస్తున్నారని పట్టబద్రులు ఆలోచించాలన్నారు పట్టభద్రులను ఓటు అడిగే నైతిక విలువ లేని వారు కూడా ఈరోజు ఓట్లు అంటూ వస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కయని అన్నారు 272 మండలాలు తిరిగిన వ్యక్తి తానని ప్రతి వారి సమస్యను తెలుసుకున్నానని ముఖ్యంగా జూనియర్ లాయర్లకు స్టైఫండ్ ఇచ్చేలా కృషి చేస్తానని ప్రైవేట్ టీచర్లకు ఐదు లక్షల ఆరోగ్య భీమా ఐదు లక్షల ఇన్సూరెన్స్ వచ్చేందుకు కృషి చేస్తానని అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి రియంబర్స్మెంట్ తీసుకొచ్చి ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారని ఇప్పుడు రియంబర్స్మెంట్ రాక చాలామంది విద్యార్థులు చదువును కొనసాగించలేకపోతున్నారని పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని బెస్ట్ అవైలబుల్ స్కూల్ లకు సంబంధించిన నిధులు గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్నాయని వాటిని కూడా త్వరగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఉన్న డబ్బు ను కాపాడడానికి ఆస్తులు పెంచుకోవడానికి ఎమ్మెల్సీగా పోటీ చేయడం లేదని సేవ చేయడానికి మీ ముందుకు వచ్చానని ఆశీర్వదించండి అని అన్నారు ఈ ఎలక్షన్లు ముఖ్యంగా కామన్ మ్యాన్ కు కార్పొరేట్ మ్యానుకు మధ్య జరుగుతుందని అన్నారు. పార్టీలను చూసి గాని కులాలను చూసి గాని ఓట్లు వేయకండి సేవా గుణం ఉన్న వ్యక్తిని నేనని అన్నారు.కొంత మంది వ్యక్తుల వల్ల రాజకీయాలంటేనే డబ్బు అనే అభిప్రాయం ప్రజల్లో నాటుకుపోయిందని దీన్ని మార్చడానికి తాను ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న అని అన్నారు. రాష్ట్రంలో ఉన్న వందలాది ట్రస్మా సంఘంలోని పాఠశాలలన్నీ తనకు మద్దతు ప్రకటిస్తున్నాయని అన్నారు గత కరోనా సమయంలో ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు 25 కిలోల బియ్యం రెండు వేల రూపాయల నగదు ప్రభుత్వం నుండి తాను ఇప్పించిన విషయం ప్రైవేటు పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులు మరిచిపోలేదని ఎక్కడికి వెళ్లినా తనకు గుర్తు చేస్తున్నారని చేసిన మేలు గుర్తుంచుకుంటామని చెబుతున్నారని అన్నారు. స్వచ్ఛమైన రాజకీయాలకు ఆరోగ్యకరమైన కోటికి చిరునామాగా నేనున్నానని పట్టభద్రుడు నమ్మకంతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ట్రస్మా అధ్యక్షులు నాగిని నరసింహారెడ్డి, ట్రెజరరీ శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుభాష్, శైలేందర్ జిల్లా ఉపాధ్యక్షులు,కే నారాయణరెడ్డి రాష్ట్ర సలహాదారు ట్రస్మా భాద్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలి



డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి

**రాయపోల్ ఫిబ్రవరి 21 ప్రజా జ్యోతి** రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ నిలబెట్టుకోవాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి,జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అధ్వర్యంలో గజ్వేల్ డిప్యూటీ తహశీల్దార్ కి వినతిపత్రం ద్వారా ప్రభుత్వానికి తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 20 24- 25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ లో కేవలం 7 శాతం నిధులు మాత్రమే కేటాయించారు. రానున్న 2025-26 బడ్జెట్ లోనైనా ఎన్నికల హామీ ప్రకారం 15 శాతం నిధులు కేటాయించి మాట నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కరువై విద్యార్థులు సమస్యల మధ్య చదువులు సాగిస్తున్నారని అసర్ నివేదిక స్పష్టం చెసిందన్నారు.అసర్ నివేదిక ప్రకారం 5.4 శాతం పాఠశాలలో టాయిలెట్స్ లేవని 19 శాతం బడులు పాడుబడ్డాయని పేర్కొన్నది. పాఠశాలలో 27శాతం బాలికలకు మూత్రశాలల సౌకర్యం లేవని అసర్ నివేదిక తేల్చిందన్నారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 2024 అబ్ స్ట్రాక్ నివేదిక ప్రకారం 11.95 శాతం పిల్లలు డ్రాప్ అవుట్ గా మారి బడి బయట ఉన్నారని తెలియజేసిందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన అంతర్జాతీయ మోడల్ స్కూల్ ల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపాదికన పూర్తి చేయాలని ,ప్రతి మండల కేంద్రంలో ప్రారంభించాలని విన్నవిస్తున్నామన్నారు.గురుకులాలకు, సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలను నిర్మించాలని కొరుతున్నామన్నారు.పాఠశాలలో మధ్యాహ్న భోజనం, గురుకులాలలో ,సంక్షేమ వసతి గృహాలలో పౌష్టికాహారం అందించాలని ,ప్రభుత్వ పర్యవేక్షణ మరింత పకడ్బందీగా చేయాలి. ప్రభుత్వ విద్యాలయంలో నాణ్యమైన ,సమాన విద్యను అందించి ప్రభుత్వ విద్యా వ్యవస్థను పరిరక్షించాలని కోరుతున్నామన్నారు.

## ప్రాణాలైనా ఇస్తాం.. సెల్ టవర్ వేయనివ్వం

* నర్స్ ఖేడ్ వద్ద స్థానికుల ఆందోళన
* ఎంపీ రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లిన స్థానికులు
* ప్రజామోదానికి వ్యతిరేకంగా పనిచేయొద్దంటూ అధికారులకు వార్నింగ్
* పనులు నిలిపివేయాలని ఆదేశించిన ఎంపీ



**మెదక్ (ప్రజాజ్యోతి)** ప్రాణాలైనా ఇస్తాం.. సెల్ టవర్ వేయనివ్వమని స్థానికులు తేల్చిచెప్పారు. ఏయిర్ టెల్ సంస్థ నిర్వాహకులు మెదక్ పట్టణంలోని నర్స్ ఖేడ్ కాలనీ లో ఇళ్లమధ్య ఏర్పాటుచేస్తున్న సెల్ టవర్ నిర్మాణాన్ని స్థానికులు అడ్డుకున్నారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బిష్మించుకూర్చున్నారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కండేల నర్సింలు మాట్లాడుతూ సెల్ టవర్ విషయమై గత కొంత కాలంగా ఆందోళన చేస్తున్నామన్నారు. అధికారులను కలిసి మా కాలనిలో సెల్ టవర్ నిర్మాణం చేయొద్దంటూ పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేశామన్నారు.టవర్ వేస్తే దాని ద్వారా వచ్చే రెడీయేషన్ తో కాలనీ ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయన్నారు.కంపెనీ నిర్వాహకులు పోలీసులను పెట్టి మరీ సెల్ టవర్ ఏర్పాటు చేయించడం తగదన్నారు. టవర్ ఏర్పాటు విషయమై స్థానికంగా ఉన్న ఎంపీ రఘునందన్ రావు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు.వెంటనే స్పందించిన ఎంపీ ప్రజామోదానికి వ్యతిరేకంగా పనిచేయొద్దంటూ అధికారులకు వార్నింగ్ ఇచ్చారు.సెల్ టవర్ పనులు వెంటనే నిలిపివేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో స్థానికులు చింతల రమేష్, వనం యేసయ్య, కండేలా రాములు, గంగాధర్, గోపయ్య, పాపయ్య, పోచయ్య, నాగరాజు, నవీన్, దాసు, సూరి, యేసు లతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

## కేతకి సంగమేశ్వర స్వామి జాతరకు ఏర్పాట్లు చేయాలి

* కలెక్టర్ వల్లూరు క్రాంతి



**జహీరాబాద్, ఫిబ్రవరి 21( ప్రజా జ్యోతి న్యూస్ )**ఈనెల 23 నుంచి జరిగే ఝరసంగం కేతకి సంగమేశ్వర స్వామి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి లోని కలెక్టర్ ఛాంబర్ లో జాతర ఏర్పాట్లపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతరలో త్రాగునీరు, మరుగుదొడ్లు కనీస వసతులు కల్పించాలని సూచించారు. దేవాలయం వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ జాతరలో ఇతర రాష్ట్ర కర్ణాటక మహారాష్ట్ర నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి జాతరలో పాల్గొంటారని అన్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

# కుర్చీలో మార్పు తప్ప పాలనలో మార్పు లేదు

* ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను మేధావులు గెలిపించి సత్తా చాటాలి
* కెసిఆర్ పాలనలో అప్పులు అవినీతి అక్రమాలు తప్ప అభివృద్ధి శూన్యం
* కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి,తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి



**మెదక్ ప్రతినిధి ( ప్రజాజ్యోతి );** తెలంగాణ రాష్ట్రం లో సీఎంలు మారారే గానీ తెలంగాణ పాలనలో ఎలాంటి మార్పు లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ,తెలంగాణ బీజేపీ అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని మాయ గార్డెన్ లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థులు కొమురయ్య, అంజి రెడ్డి కి మద్దతుగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ,తెలంగాణ బీజేపీ అధ్యక్షులు కిషన్ రెడ్డి ,మెదక్ ఎంపీ రఘునందన్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ రాబోయే శాసనమండలి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను మేధావులు గెలిపించి సత్తా చాటాలన్నారు. ఎన్నికల తరువాత ప్రజా సమస్యలపై ఉద్యమ బాటలోపయని స్తామన్నారు. అనేక రాష్ట్రాల్లో మోదీ నేతృత్వంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏ విధంగా అభివృద్ధిలో దూసుకు పోతుందో చూస్తున్నారని చెప్పారు. కర్ణాటక, హిమాచల్, తెలంగాణలో అవినీతి, అక్రమ ప్రభుత్వాల చేతకాని విధానాల వల్ల కనీసం జీతాలివ్వలేని స్థితిలో కొట్టు మిట్టాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన గ్యారెంటీలు, సబ్ గ్యారెంటీల మాట దేవుడెరుగు, కనీస హామీలను కూడా అమలు చేయలేని పరిస్థితుల్లో 14 నెలలుగా తెలంగాణలో కాంగ్రెస్ పాలన కొనసాగుతుందన్నారు.బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు తెలంగాణను అప్పుల కుప్పగా మార్చాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండి పడ్డారు.నిరుద్యోగ భృతి రూ. 4 వేలు, మహిళలకు రూ. 2వేల 5 వందలు, ప్రతీ దళిత కుటుంబానికి రూ. 12 లక్షలు, రైతులు, రైతు కూలీలకు ఆదుకుంటామన్న హామీలన్నీ నీటిమూటలుగానే మిగిలాయన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ హామీలిచ్చి ఇప్పుడు వారిని కనీసం కలవడం కూడా లేదని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చినవి, చేసినవన్నీ మోసపూరిత హామీలేనని, ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప ఇంకేం లేవన్నది తేలిపోయిందని విమర్శించారు. ఇప్పటికేదివాళా తీసిన ఆర్థిక పరిస్థితి తో తెలంగాణలో ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాళా తీసిందని, ఉద్యోగులకు జీతాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఐదు డీఏలపై మాట్లాడే పరిస్థితి లేదన్నారు. మిగులు బడ్జెట్ తో ఉన్న రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చిందని అదే దిశలో మోసపూరిత హామీలతో కాంగ్రెస్ పాలన కొనసాగిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.మోసపూరిత హామీలు, అహంకారపూరిత చర్యలు,తప్ప ఏమి లేదని మార్పు వచ్చిందంటే కేవలం కేసీఆర్, రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ కుటుంబాల్లోనే అని అన్నారు. ప్రజాతీర్పు బీజేపీ వైపే ఉందని ఈ శాసనమండలి ఎన్నికల్లో ప్రజల తీర్పు కాంగ్రెస్ వైఫల్యానికి వ్యతిరేకంగా రానుందని బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేస్తుందని ఈ మార్పులోవిద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు కీలక పాత్ర పోషించి మోదీ ప్రభుత్వాన్ని అక్కున చేర్చుకోవాలని భారీ మెజార్టీతోగెలిపించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో టీచర్స్ ఎంఎల్సీ అభ్యర్థి కొమరయ్య ,బిజెపి తెలంగాణఉపాధ్యక్షులు ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్ , మెదక్ బిజెపి జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ ,మెదక్ జిల్లా ఇంచార్జ్ మురళి గౌడ్ , సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి , బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్ , జిల్లా నాయకులు, మోర్చా నాయకులు, మండల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## ప్రజాజ్యోతి ఎఫెక్ట్

### తిగుల్‌లో విధి దీపాలు వేశారు



**జగదేవపూర్: ఫిబ్రవరి21(ప్రజాజ్యోతి)** జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో గత కొన్ని రోజులుగా ఎస్సీ, బీసీ కాలనీలో వీధి దీపాలు లేక అంధకారంగా ఉన్న సమస్యపై శుక్రవారం ప్రజా జ్యోతి దినపత్రికలో తీగుల్ లో సమస్యల తిష్ట ..అంధకారం కాలనీలు అనే కథనాన్ని ప్రచురించింది. ఈ కథనానికి ఎంపీడీవో యాదగిరి స్పందిస్తూ గ్రామ కార్యదర్శి నరేందర్ కు ఆదేశించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరాదీసి వెంటనే పరిష్కారం చేయాలని గ్రామ కార్యదర్శికి ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం గ్రామంలో ఎస్సీ కాలనీలో గ్రామపంచాయతీ హెల్పర్ సిద్ధారెడ్డి వీధిదీపాలను స్తంభాలకు బిగించారు. అలాగే గ్రామంలో నెలకొన్న సమస్యలను విడుతలవారీగా పరిష్కరిస్తామని గ్రామ కార్యదర్శి నరేందర్ తెలిపారు. ఎస్సీ కాలనీలో విధి ధీపాలు ఏర్పాటు చేయడం వల్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ మాజీ ఉప సర్పంచ్



**చేర్యాల ప్రజాజ్యోతి :** మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ ఉప సర్పంచి శేట్టే ఓజయ్య తో పాటు బండారి సిద్దయ్య, బండారి మల్లయ్య లు కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్ము రవి,చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి కనకయ్య ఆధ్వర్యంలో జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి తక్షణమే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, పేద ప్రజల సంక్షేమం కాంగ్రెస్ తో సాధ్యమని, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నామని ఓజయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి కనకయ్య మాట్లాడుతూ... అర్హులందరికీ 6 గ్యారంటీలు అమలుపరచేందుకు సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు.విపక్షాలు దిక్కుతోచని స్థితిలో ఉండి విమర్శలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో రాంపూర్ గ్రామ మాజీ సర్పంచి రంగు శంకర్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు రంగు తిరుపతి గౌడ్ తో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలి



**చేర్యాల ప్రజాజ్యోతి:** ముస్త్యాల ఆదర్శ పాఠశాల( కళాశాల) లో శుక్రవారం రోజున పిఎంశ్రీ కార్యక్రమాల్లో భాగంగా 10వ తరగతి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం రెండవ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి ఎలా ప్రిపేర్ కావాలో అలాగే విద్యార్థులు యొక్క మానసిక స్థితిని ఎలా దృఢపరుచుకోవాలో అనే అంశం పైన కాలేజీ వైస్ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్ ఉపన్యాసం చేశారు ఈ ఉపన్యాసంలో విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశిస్తూ ఒక పెద్ద లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని దానికోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ జినుగు బిక్షం ,వైస్ ప్రిన్సిపాల్ నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్నకొండలో కాంగ్రెస్ ప్రచారం

చొప్పదండి ,ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు పట్టభద్రుల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఊట్కూరి నరేందర్ రెడ్డికి మద్దతుగా



కాంగ్రెస్ నాయకులు ఆర్నకొండలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పార్టీ గ్రామ అధ్యక్షులు గడమల్ల గంగారం ఆధ్వర్యంలో గ్రామంలో పట్టభద్రుల వద్దకు వెళ్లి మొదటి ప్రాధాన్యత ఓటు ఊట్కూరి నరేందర్ రెడ్డికి వేసి గెలిపించాలని కోరారు. పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి పోలింగ్ స్లిప్పులు ఇచ్చి తమ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు చిలుముల స్వప్న, నాయకులు మచ్చ రమేష్,గడ్డం తిరుపతిరెడ్డి . సోమిడి శ్రీనివాస్, ఎల్లల సంతోష్ రెడ్డి,దొంత శ్రీధర్, గర్శకుర్తి సునీత,పిట్ట పరశురాం,బూస అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా నేడు కరీంనగర్ లో పట్టభద్రుల సింహగర్జన

కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 21, (ప్రజాజ్యోతి)
మెదక్, అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం బీఎస్పీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా నేడు కరీంనగర్ లో పట్టభద్రుల సింహగర్జన సభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శ్రీనివాస్, అజయ్ లు ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రసన్న హరికృష్ణకు మద్దతు ప్రకటించిన 53 ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరౌతారని వారు తెలియజేశారు.నేడు సాయంత్రం 4 గంటలకు. కరీంనగర్ లోని గీతాభవన్ దగ్గర ఉన్న సర్కస్ గ్రౌండ్ లో ఈ సభ జరుగుతుందని,నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి వేలాదిగా పట్టభద్రులు తరలివచ్చి ప్రసన్న హరికృష్ణకు సంఘీభావం తెలియజేయాలని వారు కోరారు.

## చేతి బోరు..రిపేరు..

-ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

కొడిమ్యాల,ఫిబ్రవరి 21,(ప్రజాజ్యోతి): వేసవికాలం రాకముందే ఎండ తీవ్రత పెరిగిపోయి జనాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.మండలంలోని తిప్పాయపల్లి బిసి కాలనీ,నల్లగొండ



గ్రామంలో ఎస్సీ కాలనీలో గల చేతి పంపులు మొరాయించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కనీస అవసరాలు తీర్చే చేతి పంపులు మొరాయించడంతో ఇంకా వారి కష్టాలు రెట్టింపు అయ్యాయి. అధికారులు స్పందించి చేతి పంపు బాగు చేయించి తమ నీటి కష్టాలు తీర్చాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై సంబంధిత గ్రామ కార్యదర్శులను వివరణ కోరగా నల్లగొండ గ్రామంలోని హ్యాండ్ పంపు రిపేరు విషయమై తన దృష్టికి రాలేదని వెంటనే మరమ్మతు చేయిస్తారని తెలిపారు.తిప్పాయపల్లి సెక్రెటరీ మాట్లాడుతూ గతంలోని మరమ్మత్తు చేయించామని నాలుగు రోజుల క్రితం మళ్లీ మొరాయించడం ప్రారంభించిందని టెక్నీషియన్ కు సమాచారం ఇచ్చామని తొందరలోనే బాగు చేయిస్తామని తెలిపారు.

## భారతీయ జనతా పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల జగిత్యాల నియోజకవర్గం సమీక్ష

జగిత్యాల టౌన్ ఫిబ్రవరి 21 ప్రజా జ్యోతి. భారతీయ జనతా పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సమావేశంలో పాల్గొన్న జగిత్యాల్ నియోజకవర్గ టీచర్స్ ఎమ్మెల్సీ ప్రభావరీ మారుతి కిరణ్, జగిత్యాల నియోజకవర్గం టీచర్స్ ఎమ్మెల్సీ ఇంచార్జ్ పాత రమేష్,పట్టణ ఇంచార్జ్



రాపర్తి రాజు,మీడియా ఇంచార్జి గాదాసు రాజేందర్ మరియు బూత్ ఇన్చార్జిలు మరియు ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితురాలు కుటుంబానికి అండగా మిత్రులు

ముస్తాబాద్ ఫిబ్రవరి 21(ప్రజాజ్యోతి)
రాజన్న సిరిసిల్లా జిల్లా ముస్తాబాద్ మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన మంగలి దేవవ్వ (వాతపు) అనారోగ్యంతో మరణించగా మృతురాలికి భర్త బాలకిషన్,ఇద్దరు కుమార్తెలు



ఉన్నారు.ఇట్టి విషయాన్ని తెలుసుకున్న 2001-2002 పదవ తరగతి బ్యాచ్కు చెందిన తన మిత్రులు తమ వంతు సహాయంగా 50వేల రూపాయలను సమకూర్చి చిన్న కుమార్తె పేరు మీద తపాలా ఆఫీసులో డిపాజిట్ చేసి భర్త బాలకిషన్ మరియు కుమార్తెలకు అందజేశారు.మృతురాలి కుటుంబ సభ్యులు మృతురాలి స్నేహితులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 2001-2002 నామాపూర్ లో మృతురాలితో చదువుకున్న స్నేహితులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సైబర్ నేరస్తుడు అరెస్ట్

### టెలిగ్రామ్ యాప్ ద్వారా మోసపోయిన నితీష్ కుమార్

### సైబర్ నేరాల పట్ల విద్యార్థులు, యువకులు అప్రమత్తంగా ఉండాలి: సీఐ ఏ నిరంజన్ రెడ్డి

మెట్ పల్లి ప్రతినిధి, ఫిబ్రవరి 21, ప్రజా జ్యోతి: డివిజన్ పరిధిలో మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన మామిడాల నితీష్ కుమార్ ఉన్నత చదువుల నిమిత్తం లండన్ లోని యూనివర్సిటీలో సీటు ఇప్పిస్తానని మోసగించిన కేసులో సైబర్ నేరస్తుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు మెట్పల్లి సిఐ ఏ నిరంజన్ రెడ్డి తెలిపినారు. సీఐ కథనం ప్రకారం టెలిగ్రామ్ అప్లికేషన్ ద్వారా లండన్ లో ఉన్న షణ్ముఖ కృష్ణ యాదవ్ అనే వ్యక్తి, ఫోన్ అప్లికేషన్ ద్వారా నితీష్ కుమార్ ను పరిచయం చేసుకున్నాడు. నితీష్ కుమార్ కు ఏ ప్రాంతంలో ఉన్నట్లు తెలవకుండా, లండన్ లో చదివి, ఉద్యోగం చేస్తున్నానని నితీష్ కుమార్ కు మాయ మాటలు చెప్పి నమ్మించి ముత్యంపేట ఇండియన్ బ్యాంకు నుండి తిరుపతిలో ఉన్న నేరస్తుని ఖాతాలోకి ఆరు లక్షల రూపాయలు పంపించినారు, సంబంధించిన రసీదులు పంపుతాను అని చెప్పి మొబైల్ ఫోను ద్వారా ప్రయత్నించగా స్విచ్ ఆఫ్ పెట్టినట్లు గమనించిన నితీష్ కుమార్ మల్లాపూర్ పోలీస్ స్టేషన్ లొ దరఖాస్తు చేయగా ఎస్సై కేసు నమోదు చేసుకొని కృష్ణ యాదవ్ పై కోర్టు నుండి పర్మిషన్ తీసుకొని జిల్లా ఎస్పీ ద్వారా




ఎల్.ఓ.సి పంపించినారన్నారు. తర్వాత కొద్ది రోజుల తర్వాత నితీష్ కుమార్ లండన్ వెళ్లి చదువుకుంటూ అక్కడ కృష్ణ యాదవ్ గురించి వెతకగా గురువారం లండన్ నుండి విమానంలో హైదరాబాద్ ఎయిర్పోర్ట్ కి వచ్చే క్రమంలో ఇమిగ్రేషన్ డిపార్ట్మెంట్ వారు సిఐ నిరంజన్ రెడ్డికి సమాచారం తెలిపినారు. స్పందించిన పోలీసులు మల్లాపూర్ ఎస్సై కే రాజు హైదరాబాద్ ఎయిర్పోర్ట్ కి వెళ్ళగా ఎయిర్పోర్ట్ అధికారులు అనుమతితో కృష్ణ యాదవ్ ను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తము ముత్యంపేట గ్రామానికి చెందిన నితీష్ కుమార్ ను మోసపూరితంగా నమ్మించి తన అకౌంట్లో డబ్బులు వేయించుకొని కృష్ణ యాదవ్ వాడుకున్నట్లు పేర్కొన్నాడు. తండ్రి జయరామయ్య ఈ నేరంలో సహకరించాడని నేరం ఒప్పుకొనగా చట్ట ప్రకారం కోర్టుకు తరలించి మెజిస్ట్రేట్ ముందు హాజరు పరుచుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. సిఐ నిరంజన్ రెడ్డి తో పాటు ఎస్ఐ రాజు, సిబ్బంది పాల్గొన్నారు. సైబర్ నేరాలకు పాల్పడి అమాయకులను మోసం చేసి డబ్బులు తీసుకున్నట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని, మోసపూరితమైన విషయాలు చెప్పి నమ్మించినట్లయితే ప్రజలు గమనించి వెంటనే 1930 కి ఫోన్ చేయాలి లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని సిఐ నిరంజన్ రెడ్డి తెలిపినారు.

## మహిళా సమస్యలకు "శుక్రవారం సభ" ఒక పరిష్కార వేదిక

చొప్పదండి, ఫిబ్రవరి 21 ( ప్రజా జ్యోతి): మహిళా సమస్యలన్నింటికీ శుక్రవారం సభ ఒక పరిష్కార వేదికగా నిలుస్తుందని జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి సబితా అన్నారు. మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చొప్పదండి



మండలం రుక్మాపూర్ గ్రామం లో శుక్రవారం సభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా సంక్షేమాదికారి మాట్లాడుతూ మహిళల తమ సమస్యలు ఏవైనా శుక్రవారం సభలో విన్నవించుకోవచ్చని, సభానంతరం దరఖాస్తుల స్వీకరిస్తామని తెలిపారు. ప్రతి మహిళ, గర్భిణీ, బాలింత శుక్రవారం సభకు తప్పక హాజరు కావాలని సూచించారు. సభలో పలు విషయాలు చర్చించుకోవడం ద్వారా మహిళల్లో మానసిక ఉత్తేజం కలుగుతుందని అన్నారు. అంగన్వాడీ సిబ్బంది , హెల్త్ సిబ్బంది, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ఈ శుక్రవారము సభకు హాజరు అవుతారని, దీని వల్ల ఏవైనా సమస్యలు ఉంటే అప్పటికప్పుడే పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో జిల్లాలో మహిళలందరికీ సుమారు 50 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నామని, వీటిని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలలో ప్రాథమిక విద్యతో పాటు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా పిల్లలు సృజనాత్మకతను పెంపొందించే ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి సబిత, డి ఎం హెచ్ ఓ వెంకట రమణ, ఎంపీడీవో వేణు గోపాల్ రావు, అడిషనల్ డి ఎం హెచ్ ఓ సనా,సీడీపీవో కస్తూరి,ఏసీడీపీఓ నర్సింగా రాణి, ఎంపీ ఓ రాజు గోపాల్ రెడ్డి, కార్యదర్శి విజయ లక్ష్మి, వైద్యాధికారి అరుణ , ఐసిడిఎస్ సూపర్వైజర్లు శశి కిరణ్మయి,రేణుక,పోషణ అభియాన్ సిబ్బంది నాగరాజు, రోమిల్ల, శ్రీధర్,సఖి లక్ష్మి, డి సి పి ఓ పర్వీన్, చైల్డ్ లైన్ సంపత్, డి హెచ్ఈడబ్ల్యూ శ్రీలత, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, అంగన్వాడి టీచర్, ఆశా, ఏఎన్ఎం లు పాల్గొన్నారు.

## టి యు డబ్ల్యూ జే 2025 డైరీ ఆవిష్కరణ.

చిగురు మామిడి ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి)
మండలంలోని సుందరగిరి శ్రీ కోరమీసా లక్ష్మీనరసింహ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం 11 గంటలకు టి యు డబ్ల్యూ జే 2025 మీడియా డైరీ



లను ఆలయ అర్చకులు శేషం నంనింహా చార్యులు డైరీలకు పూజలు చేసి ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జేరుపోతుల వెంకటస్వామి (ఆంధ్రజ్యోతి) రిపోర్టర్ ఆంటీ అటాక్స్ కరీంనగర్ జిల్లా కో కన్వీనర్, ప్రకాష్ (నమస్తే తెలంగాణ) రిపోర్టర్ స్టేట్ హౌసింగ్ కమిటీ మెంబర్, పత్తెం రమేష్ పటేల్ (పి ఆర్ పి న్యూస్ ఛానల్ సీఈవో) టి యు డబ్ల్యూ జే (ఐజేయు) చిగురుమామిడి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు (మన తెలంగాణ) రిపోర్టర్, గాదె రఘునాథ్ రెడ్డి (ఆంధ్రప్రభ) రిపోర్టర్, శేషం నరసింహ చారి (మనం) రిపోర్టర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చిగురుమామిడి, జేరుపోతుల సదానందం (సూర్య) రిపోర్టర్, నగేష్ మైత్రి ఛానల్, పత్తెం శ్రీనివాస్ (మన తెలంగాణ) రిపోర్టర్, రంజిత్ కుమార్ (ప్రజా జ్యోతి) రిపోర్టర్, ఎనగందుల అశోక్ రిపోర్టర్, సుంకే సుధాకర్ రిపోర్టర్, అజయ్ కుమార్ రిపోర్టర్, సాయి చరణ్ రిపోర్టర్, నాంపల్లి లడ్డు రిపోర్టర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపద్బాంధవుడా... దోపిడి దారుడా... ?

- అంబులెన్స్ డ్రైవర్ కాదు... అంబులెన్స్ ల ఓనర్..
- సివిల్ ఆస్పత్రిలో కమిషన్ల దందా...
- ఆపదలో ఉన్నవారితో బేర సారాలు...
- ప్రాణాపాయ స్థితిలో ఎవరైనా వస్తే ఆయనకు కాసులపంటే

హుజురాబాద్, ఫిబ్రవరి 21, ప్రజా జ్యోతి : ప్రజలు ప్రాణాపాయస్థితిలో ఉంటే.. తక్షణమే స్పందించి వారిని రక్షించాల్సిన వారే... ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి పాలిట కాల యముడుగా మారుతు దోచుకు తింటున్నారు... చేసేది 108 అంబులెన్స్ డ్రైవర్ ఉద్యోగం... కానీ ఆయనకే మూడు ప్రైవేట్ అంబులెన్సులు... ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులను ఆస్పత్రి సిబ్బంది గద్దల్ల పిక్కు తింటున్నారు. ఆసుపత్రిలో జరిగే అక్రమాలపై వార్తాపత్రికల్లో వరుస కథనాలు వస్తున్న అధికారులు నిమ్మకు నీరతినట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పత్రిలో పనిచేసే కిందిస్థాయి సిబ్బంది నుండి అధికారుల వరకు ప్రతి ఒక్కరు అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు వారిపై చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తుండడం విడ్డూరంగా ఉంది. 108 అంబులెన్స్ డ్రైవర్స్ సైతం ఆసుపత్రికి వచ్చే రోగులను ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తూ వారి జేబులను కొల్లగొడుతున్నారు. ఆసుపత్రి చుట్టూనే వారి ప్రైవేట్ అంబులెన్స్ లను నిలుపుతూ ఆసుపత్రికి ప్రాణాపాయ స్థితిలో వచ్చే రోగులను టార్గెట్ చేస్తూ వారి దందాను యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఆస్పత్రి నుండే వారి దోపిడీకి బీజం పడుతుంది. ప్రైవేట్ అంబులెన్స్ మాకు ఉన్నాయి అని రోగులతో మాట కలిపి అంబులెన్స్ కిరాయి మాట్లాడుకుంటారు.




లోని అధికారుల అండదండలు మెండుగా ఉండడంతో ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు వారి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

### - పేరుకు 108 డ్రైవర్...

పేరుకు 108 అంబులెన్స్ డ్రైవర్.. కానీ ఆయనకు మూడు ప్రైవేట్ అంబులెన్సులు... అది కూడా ఆస్పత్రి చుట్టుపక్కలే ఉంటాయి... ప్రాణాపాయ స్థితిలో హుజురాబాద్ ప్రభుత్వాసుపత్రికి వచ్చిన వారిని టార్గెట్ చేసి వీరి దందా కొనసాగిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులను వరంగల్ ఎంజీఎం కు తీసుకువెళ్లాలని వైద్యులు సూచిస్తారు. 108 వాహనాలకు రోగులు ఫోన్ చేయగానే అందుబాటులో లేమని అటువైపు నుండి సమాధానం వస్తుంది. ఇక్కడ




మార్గమధ్యలో ఎంజీఎంలో సరైన వైద్యం అందదని మాకు తెలిసిన ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఉంది అక్కడికి తీసుకువెళ్తాం డబ్బులు కూడా కొంతమేర మాఫీ చేయిస్తామని నమ్మబలికి వారిని ప్రైవేట్ ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ఇలా అంబులెన్స్ కిరాయితోపాటు ప్రైవేట్ ఆస్పత్రుల యజమానులు ఇచ్చే కమిషన్ కూడా ఉండడంతో 108 అందుబాటులో ఉన్న లేదని చెప్తూ రోగులను దోచుకు తింటున్నారు. ఇదంతా ప్రభుత్వాసుపత్రి అధికారుల కనుసన్నల్లోనే సాగుతుంది.


### - ఆపదలో ఉన్న వారితో బేరా సారాలు

ప్రాణాలపై ఉన్న ఆశే వారి పెట్టుబడి... ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారు డబ్బులను లెక్క చేయరనే ఉద్దేశంతో ఆపదలో ఉన్న వారితో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి వచ్చిన రోగులను ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్లు పట్టిపీడిస్తున్నారు. హుజురాబాద్ నుండి వరంగల్ కు నాలుగువేల నుండి 5000 రూపాయల వరకు వసూలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు.

# కీలక ఖనిజాల ఉత్పత్తితో కాలుష్య నివారణ

### ఉత్పత్తి కి సింగరేణి శ్రీకారం: సింగరేణి సి అండ్ ఎండి బలరాం

గోదావరిఖని , ఫిబ్రవరి 21(ప్రజాజ్యోతి): కాలుష్య రహిత భారత్ కోసం కీలక ఖనిజాల ఉత్పత్తి ఎంతో అవసరమని సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అండ్ బలరాం అన్నారు.శుక్రవారం హైదరాబాద్ లో కీలక ఖనిజాలపై క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.బ్యాటరీ వాహనాలు,సోలార్ విద్యుత్తు వినియోగం క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో లిథియం,కోబాల్ట్,నికెల్ వంటి కీలకఖనిజాలకు అనూహ్య డిమాండ్ ఏర్పడుతోందన్నారు.ఈ విషయంలో భారత్ స్వయం సమృద్ధి సాధించడానికి ప్రభుత్వరంగ సంస్థలు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.2070 నాటికి భారత్ ను కర్బన ఉద్గార రహిత నెట్ జీరో దేశంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని,ఇది నెరవేరాలంటే దేశీయ ఖనిజ పరిశ్రమలు క్రిటికల్ మినరల్స్ (కీలక ఖనిజాల) ఉత్పత్తి పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఆవశ్యకత ఉందన్నారు.కీలక ఖనిజాల పై పరిశోధన,అన్వేషణ,ఉత్పత్తి వంటి విషయాలలో ప్రభుత్వ సంస్థల మధ్య సమన్వయం,సహకారం ఎంతో అవసరం అన్నారు.ఎలక్ట్రానిక్స్ రంగం,సాంప్రదాయేతర ఇంధన వనరుల రంగం,విద్యుత్ వాహనాలు,రక్షణ రంగాల్లో కీలక ఖనిజాల వినియోగం ఎంతో ఎక్కువగా ఉందని,ప్రస్తుతం ఈ ఖనిజాలను విదేశాలనుంచే ఎక్కువ శాతం దిగుమతి చేసుకుంటున్నామన్నారు.ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 30 రకాల కీలక ఖనిజాల జాబితాను విడుదల చేసిందని,వీటిని దేశీయంగా ఉత్పత్తి చేయడం,తద్వారా స్వయం సమృద్ధి సాధనకు పరిశ్రమలు కృషి చేయాలని పిలుపునిచ్చారని గుర్తుచేశారు.పెద్ద ఎత్తున పెరుగుతున్న డిమాండ్ కు తగ్గట్టుగా కీలక ఖనిజాలను దేశీయంగా ఉత్పత్తి




చేయటం ఎంతో అవసరమని,ఈ సవాలను ఒక అవకాశంగా దేశీయ పరిశ్రమలు తీసుకోవలసి ఉందన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు సింగరేణి సంస్థ కూడా కీలక ఖనిజ పరిశ్రమ రంగంలోనికి అడుగుపెట్టడానికి సంసిద్ధమయిందని పేర్కొన్నారు.సింగరేణి ఇప్పటికే ఈ విషయంలో ముందడుగు వేసిందని,జనవరి మొదటి వారంలో ఐఐటి హైదరాబాద్ వారితో ఒప్పందం కుదుర్చుకుందన్నారు.సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం నుండి విడుదలయ్యే ఫ్లై యాష్, క్లే ఓపెన్ కాస్ట్ గనుల ఓవర్ బర్డెన్ నుండి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ ను వెలికి తీసే అంశంపై పరిశోధనలు ప్రారంభమయ్యాయన్నారు.ఇకముందు సింగరేణి కేవలం బొగ్గు తవ్వకానికే పరిమితం కాకుండా కీలక ఖనిజాల అన్వేషణ ఉత్పత్తి రంగాల్లో కూడా అడుగు పెట్టనుందని తెలియజేశారు.సంస్థ తన వ్యాపార విస్తరణ కార్యక్రమంలో భాగంగా ఈ చర్యలు చేపడుతున్నప్పటికీ కీలక ఖనిజాల విషయంలో దేశీయ స్వయంసమృద్ధికి ఇది ఉడతాభక్తిని దోహదపడుతుందని భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సదస్సులో ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బిఎస్మూర్తి,సింగరేణి ఈడీ కోల్ మూమెంట్,జీ.ఎం కో-ఆర్డినేషన్ ఎస్.డి.ఎం.సుభాని,క్రిటికల్ మినరల్స్ అసోసియేషన్ ఇండియా అధ్యక్షుడు డాక్టర్ చైతన్యమొయి గంగూలీ,మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ హామిల్టన్,సింగరేణి జీ.ఎం లు మనోహర్,నారాయణరావు,మిథానీ,న్యూక్లియర్ ఫ్యూయల్ కార్పోరేషన్,వేదంతా తదితర కంపెనీల అధికారులు,ఐఐటి సంస్థల ఉన్నత అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా మాతృభాష దినోత్సవం

భద్రాచలం టౌన్, ఫిబ్రవరి 21(ప్రజాజ్యోతి ): అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో శుక్రవారం తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా మాతృ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.తెలుగు శాఖ అధ్యక్షులు డా.కపిలభారతి అధ్యక్షులు గా వ్యవహరించిన ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ శ్రీమతి డా.హవీలా పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృ భాష పరిరక్షణతో పాటు ఇతర భాషలను గౌరవించాలని ఉపన్యాసంలో విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులలో కోయ, కొలామి, ఉర్దూ, బంజారా తదితర మాతృ భాష గా ఉన్నవారు కవితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆద్యంతం ఆసక్తికరంగా జరిగిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇన్చార్జి హిమజా, అధ్యాపకులు జాయ్ కిరణ్, వరాలు బాబు, లక్ష్మిదేవి, బాలాజీ, గోపయ్య తదితరులు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## టేకులపల్లి లో కుండపోత వాన

టేకులపల్లి, ఫిబ్రవరి 21,ప్రజాజ్యోతి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారింది. టేకులపల్లి మండలలోని పలు ప్రాంతాల్లో 30 నిమిషాలు కుండపోత



వర్షం కురుసింది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడి వర్షం మొదలైంది. భారీగా వర్షం కురవడంతో మండల కేంద్రంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. వాగులలో వంకలలో, బోర్లలో నీరు అడుగు అంటే సమయానికి భారీ వర్షం పడడం వల్ల మండలంలోని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

## భద్రాద్రి రామయ్యకు సర్వాంగ స్వర్ణకవచాలంకరణ

భద్రాచలం, ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి ): భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5కోట్లతో తయారుచేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచనాలను అర్చకులు ధరింపచేశారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి



స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, అరగింపు, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

## ప్రజలను కొల్లగొట్టి కార్పోరేట్లకు దోచిపెట్టే పద్ధతిలో కేంద్ర బడ్జెట్

### -ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పాపారావు

భద్రాచలం టౌన్,ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి ): జీఎస్టీ పేరుతో ప్రజలపై పన్నులు వేసి వారి సంపదను కొల్లగొట్టి కార్పోరేట్లకు దోచిపెట్టే పద్ధతిలో కేంద్ర బడ్జెట్ ఉందని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు డాక్టర్ పాపారావు అన్నారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణకు ఊతమిచ్చే పద్ధతిలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా పారిశ్రామిక ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోయిందని, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. దేశవ్యాప్తంగా పేదరికం, నిరుద్యోగం అసమానతలు తీవ్రంగా




పెరిగాయన్నారు. ఈ బడ్జెట్ కొందరు ఇన్కమ్ ట్యాక్స్ కట్టేవారికి మినహా దేశంలో జనాభా మొత్తానికి వ్యతిరేక బడ్జెట్ అన్నారు. ఈ బడ్జెట్లో కార్మిక సమస్యల ఊసేలేదని, రైతులకు కనీస మద్దతు ధర గ్యారంటీ చేసే చట్టం గురించి చర్చించలేదన్నారు. ఈ సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎలమంచి వంశీకృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గడ్డం స్వామి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు నాదెళ్ల లీలావతి, గిరిజన సంఘం పట్టణ కార్యదర్శి కుంజా శ్రీనివాస్, కేవీపీఎస్ జిల్లా నాయకులు కోరాడ శ్రీనివాస్, డివైఎఫ్ఐ నాయకులు పి.సంతోష్ కుమార్, సీపీఎం సీనియర్ నాయకులు జీఎస్ శంకర్రావు, బీబీజీ తిలక్ లు పాల్గొన్నారు.

## ఘనంగా మాతృబాషా దినోత్సవ వేడుకలు

భద్రాచలం టౌన్,ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి ): భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవ వేడుకలు శుక్రవారం తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ హవీలా ముఖ్యఅతిధిగా హాజరై ప్రసంగించారు. మాతృబాష పరిరక్షణతో పాటు ఇతర బాషలను గౌరవించాలని ఉపన్యాసంలో విద్యార్థులకు పిలుపునిచ్చారు.




కళాశాలలో చదువుతున్న విద్యార్థుల్లో కోయ, కొలామి, ఉర్దూ, బంజారా మాతృబాషగా ఉన్నవారు కవితలు చదివి వినిపించారు. అనంతరం జరిగిన క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ ఇన్చార్జ్ హిమజ, అధ్యాపకులు జాయికిరణ్, వరాలబాబు, లక్ష్మీదేవి, బాలాజీ, గోపయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## తోటమల్ల నియామకం పట్ల హర్షం వ్యక్తం

చర్ల, ఫిబ్రవరి 21, (ప్రజాజ్యోతి ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాతీయ మాల మహానాడు అధ్యక్షులుగా తోటమల్ల రమణ మూర్తి ని నియమించడంతో మాల మహానాడు జిల్లాలో బలమైన శక్తిగా



మారనున్నదని మాల మహానాడు మండల అధ్యక్షులు తోటమల్ల గోపాలరావు అన్నారు.జాతీయ మాల మహానాడు జిల్లా నూతన అధ్యక్షులుగా తోటమల్ల రమణ మూర్తి ని రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, జిల్లా ఇన్ ఛార్జ్ అశోద భాస్కర్ బుధవారం నియమించిన విషయం పాఠకులకు విధితమే.ఈ నేపథ్యంలో ఆయన నియామకాన్ని హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని మాల మహానాడు కార్యాలయంలో మాల మహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మండల అధ్యక్షులు గోపాలరావు మాట్లాడుతూ రమణమూర్తి నియామకంతో జిల్లాలో మాల మహానాడు బలమైన శక్తిగా మారనున్నదని జోస్యం చెప్పారు.ఆయన నియామకానికి కృషి చేసిన వ్యవస్థాపక అధ్యక్షులు అద్దంకి దయాకర్, రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్, జిల్లా ఇన్ ఛార్జ్ అశోద భాస్కర్, రాష్ట్ర పొలిటి బ్యూరో సభ్యులు చిట్టిమల్ల సమ్మయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎస్సీ వర్గీకరణ పై వివిధ రాజకీయ పార్టీలు అనుసరిస్తున్న విధానాలను తప్పుపట్టారు. దళితులు ఐక్యమత్యంగా ఉండి రిజర్వేషన్ శాతాన్ని పెంచుకునేలా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.దళితులకు 20 శాతం రిజర్వేషన్ పెంచాలని డిమాండ్ చేశారు.ఎస్సీ వర్గీకరణ అంశం రాజ్యాంగ వ్యతిరేకమని అన్నారు.2014 నుండి ఎస్సీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు తడికల లాలయ్య, భద్రాచలం నియోజకవర్గం నాయకులు తోటమల్ల విజయరావు, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ బోళ్ల వినోద్, నాయకులు కుప్పా నిరంజన్, దొడ్డా వెంకటేశ్వర్లు, చింతల నాగేంద్ర, మంచాల చంటి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భారతీయ జనతా పార్టీ నాయకులు

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల ఖమ్మం జిల్లా ఇన్చార్జ్ ఉప్పల్ మాజీ



శాసనసభ్యులు బేతి సుభాష్ రెడ్డి బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ మరియు కిసాన్ మోర్చా అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి తో కలిసి ఎస్ ఆర్ అండ్ బి జి ఎన్ ఆర్ కాలేజ్, పీజీ కాలేజ్ ఎన్ ఎస్ పి కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల లో విస్తృతంగా ప్రచారం నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా ఉప్పల్ మాజీ శాసనసభ్యులు భేటీ సుభాష్ రెడ్డి మాట్లాడుతూఏ 317 జీవో చెల్లా చెదురైన స్థానిక ఉద్యోగులకు తిరిగి తమ సొంత జిల్లాలకు పంపిస్తామని సబ్ కమిటీ వేసిన ప్రభుత్వం ఏమి చేసింది గాడిద గుడ్డు చేసింది. బాధితులకు బరాబర్ మేము మాట ఇస్తున్నాం స్థానికత ఆధారంగా 317 జీవో నష్టపోయిన ప్రతి అభ్యర్థిని తమ సొంత జిల్లాలకు తీసుకొచ్చే దమ్మున్నది మన తపస్ కే మన బిజెపి కె. ఏ ప్రభావం చూపులేని వ్యక్తులను ప్రభుత్వానికి ఉపాధ్యాయ ప్రయోజనాలు తాకట్టు పెట్టి ప్రభుత్వానికి అడుగులు మడుగులు వత్తే వ్యక్తులనో, ప్రభుత్వం ఇచ్చిన 1,2 జీవో లనస్ మేము తెచ్చినం అని చెప్పుకొనే వ్యక్తులనో నమ్మి ఓటు వేస్తే వారు చివరికి ఉపాధ్యాయుల సమస్యలు పరిశీలించక పోగా.... వారి సమస్యలను మాత్రమే పరిష్కరించుకుంటారు అన్నారు.కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఏ 317 జీవో వచ్చినప్పుడు నిత్యం అగ్రరాజ్యం... పెట్టుబడిదారి విధానం అని విమర్శించే ప్రస్తుత ఎమ్మెల్సీ అదే అమెరికాలో సేద తీరుతూ అది ప్రభుత్వ నిర్ణయం మనమేమి చేయగలమని మాట్లాడుతున్నారు. సమర్థులు కాని వారు మీ తరపున ఎమ్మెల్సీ అయితే సమస్యలు అలాగే ఉంటాయి సమస్యలు పరిష్కరించే సత్తా ఉన్న పులి సరోత్తమ్ రెడ్డికే మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి.... జాతీయవాద భావ జాలం ఉన్నవారినే కౌన్సిల్ కి పంపి మన సమస్యలు పరిశీలించుకుందాం. విజ్ఞానంతోఆలోచించడి మిత్రులారాఏ ప్రభుత్వ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యం వహించిన గత ప్రభుత్వంను ఇంటిదారి పట్టించి, ప్రస్తుత ప్రభుత్వ మాటలు నమ్మి ఉపాధ్యాయులు గంప గుత్తుగా ఓట్లు మీ మానిఫెస్టో అంశాలలో అమలు చేసినవి ఎన్ని?ఉపాధ్యాయులు పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లు అయ్యింది, అన్నారు.బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ మాట్లాడుతూ ఏ మూడు డిఏలు పెండింగ్ ఉంచిన గత ప్రభుత్వాన్ని ఇంటికి పంపితే, 5 డిఏలు పెండింగ్ లో ఉంచిన వీరినీ ఎక్కడికి పంపించాలి. ఏ సిపిఎస్ ఉద్యోగుల వద్ద కట్ చేసిన 10 శాతం డబ్బులతో పాటు మ్యాచింగ్ గ్రాంట్ 10 శాతం నీ ఈ ప్రభుత్వం ఇంతవరకు మీ ప్రాన్ అకౌంట్ లో వేసిందా..... ఆలోచించుకోండి మీకు ఎవరికైనా ప్రాన్ అకౌంట్లో జమ అయినట్లు మెసేజ్ వచ్చిందా? ఈ డబ్బులను ప్రక్కదారి పట్టిస్తే మాట్లాడని ప్రస్తుత ఎమ్మెల్సీ మరియు ప్రధాన సంఘాలు పేరున నిత్యం జనరల్ ఫండ్ రాయించుకుని తమ పబ్బం గడుపుకునే సంఘాల బాద్యులు ఏమి చేస్తున్నారో కూడా మనం ఆలోచించుకోవాలి. ఏ కేజీబీవీ ఉద్యోగుల శ్రమ దోపిడీ మేము తొలగిస్తాం. ఏ వారికి గౌరవంతో కూడిన ఒత్తిడి లేకుండా ఉద్యోగం చేసుకునేలా మేము చేస్తాం. ఏ 2003 డిఎస్సి ఉద్యోగులను ఎందుకు పాత పెన్షన్ పరిధిలోకి ఇప్పటికీ తీసుకురాలేదు... సిపిఎస్ ఉద్యోగులకు ఇచ్చిన కాంగ్రెస్ హామీ ఏమైంది? ఏకాకి ఎత్తుకు పోయింది. మా కేంద్రం తెచ్చిన సిపిఎస్ విదానాన్ని సమీక్ష చేసుకుంటాం. మరింత మెరుగుపరిచి సి పి ఎస్ తెచ్చే ప్రయత్నం చేస్తాం. ఏఉపాధ్యాయ ఎన్నికలలో ఒక్క హైస్కూల్ ఉపాధ్యాయుల కే ఓటు ఉంది. మేము ఎస్ జి టి లకు ఓటు హక్కు ఇప్పిస్తాం... అది మాతోనే సాధ్యం అన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం అసెంబ్లీ ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ శ్రీ ఆచంటి కోటేశ్వరరావు, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, బిజెపి ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీమతి మందా సరస్వతి, గిరిజన మూర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీమతి దొడ్డ అరుణ, ఖమ్మం అర్బన్ టౌన్ అధ్యక్షులు కుమిలి శ్రీనివాస్, ఖమ్మం టూ టౌన్ అధ్యక్షులు వెంకటనారాయణ యాదవ్, జిల్లా నాయకులు భద్రం, వన్ టౌన్ ప్రధాన కార్యదర్శి డి కొండ శ్యామ్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు నీలిమ, నాగమణి, బేబీ, అర్బన్ టౌన్ నాయకులు వల్లాల రమేష్, సురేష్ గౌడ్, కృష్ణ, వాకదాని రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రతి దశలో తోడ్పాటు అందించాలి

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

### అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తే కఠిన చర్యలు

### ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ప్రతి దశలో తోడ్పాటు అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇల్లు గృహ నిర్మాణ పథకం (నిర్మాణం)పై ఖమ్మం, పాలేరు, మధిర నియోజకవర్గాల మండల, గ్రామ పంచాయితీ స్థాయి అధికారులతో పాటు మండల ప్రత్యేక అధికారులకు అందించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ప్రజల జీవన విధానంలో అద్భుతమైన మార్పులు తీసుకొని రావచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అర్హులకు ఇళ్లు అందేలా చూడాలని, అలాగే వీటి నిర్మాణంపై ప్రతి ఒక్కరికి సంపూర్ణ



అవగాహన ఉండాలని అన్నారు. గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తులను ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా మరోసారి వెరిఫై చేయడం జరుగుతుందని అన్నారు. అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు చేరవద్దని, తప్పులు ఏమైనా జరిగితే ముందుగానే చెప్పాలని, ప్రతి దరఖాస్తును ఎవరు వెరిఫై చేస్తున్నారు వివరాలు పక్కాగా రికార్డులలో ఉంటాయని, అనర్హులను అర్హులుగా చూపి ఇండ్లు మంజూరైనట్లు తేలితే చాలా కఠినంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. జనవరి 26న ప్రతి మండలంలో ఎంపిక చేసిన గ్రామంలో లాంఛనంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రారంభించామని అన్నారు. సొంత జాగా ఉండి ఇల్లు లేని వారు, జాగా ఇండ్లు రెండు లేని వారు, ఆర్.సి.సి. రూఫ్ తో ఉన్నవారు వివరాలతో ఎల్1, ఎల్2, ఎల్3 లుగా మూడు జాబితాలపై అధికారులు పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు. విడతల వారీగా ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. అత్యంత పేదలకు, ఇండ్లు లేని, స్వంత స్థలం ఉన్నవారికి మొదటి విడతలో ఇండ్లు అందించడం జరుగుతుందని అన్నారు. ప్రజలతో మాట్లాడే సమయంలో అధికారులు ప్రభుత్వ ఉద్దేశాన్ని తెలియపర్చాలన్నారు. భూమి పూజ నుంచి గృహప్రవేశం వరకు ఇంటి నిర్మాణంలో ప్రతి అడుగులో లబ్ధిదారులకు మనం తోడ్పాటు అందజేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ఇంటారాక్ట్ అవుతూ, ప్రతి దశ నిర్మాణంలో సామాగ్రి ధరలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. పేదలను ఎంపిక చేస్తున్న నేపథ్యంలో ఇంటి నిర్మాణం 5 లక్షలు దాటితే పూర్తి చేయడం లబ్ధిదారులకు కష్టం అవుతుందని, ప్రతి దశలో తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఇండ్లు ఎలా కట్టాలో సలహాలు, సూచనలు అందజేయాలని, ఇండ్లు నాణ్యతగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కూడా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను ప్రతి మండల కేంద్రానికి తీసుకుని వచ్చే బాధ్యత జిల్లా యంత్రాంగం తీసుకుంటుందని, మండల కేంద్రం నుంచి లబ్ధిదారులకు అందేలా అధికారులు చూడాలని అన్నారు. మండల కేంద్రంలో పెట్టే ఇసుక డంప్ దుర్వినియోగం కాకుండా చూసుకోవాలని అన్నారు. సిమెంట్ కూడా ఇందిరమ్మ లబ్ధిదారులకు తక్కువ ధరకు సరఫరా చేసేందుకు ప్రయత్నిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు గ్రౌండ్ చేయాలని, రెండు వారాలలో ఇంటి బేస్మెంట్ పనులు పూర్తి అయ్యేలా చూడాలని, బేస్మెంట్ పూర్తయితే లక్ష రూపాయలు విడుదల అవుతాయని అన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మొదటి విడత ప్రభుత్వ సహాయం వచ్చే వరకు పెట్టుబడి లేని లబ్ధిదారులకు స్వశక్తి మహిళా సంఘాల రుణాలు అందించడానికి గల అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. శిక్షణ పొందిన అధికారులతో మండల స్థాయిలో మేస్త్రీలకు తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణంపై శిక్షణ అందిస్తామని అన్నారు. ప్రతి మండల కేంద్రంలో మోడల్ ఇందిరమ్మ ఇండ్ల నిర్మిస్తున్నామని, అది ఎలా కడ్తున్నారో పంచాయతీ కార్యదర్శులు క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తూ గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి సోమవారం పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ ను పరిశీలించాలని అన్నారు. సొంత ఇల్లు ఉంటే ప్రజలకు ధైర్యం పెరుగుతుందని, వ్యాపారాలు పెరుగుతాయని, ఆడపిల్లలను చదివిస్తారని, కుటుంబాలలో మంచి మార్పులు వస్తాయని, పేదవాని ఇంటి కల సాకారం చేసే అవకాశం మనకు వచ్చిందని, ఈ అద్భుత అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ శిక్షణా సమావేశంలో డిఆర్డీవో సన్యాసయ్య, జెడ్పీ సిఇఓ దీక్షా రైనా, డిపిఓ ఆశాలత, హౌజింగ్ పిడి శ్రీనివాసరావు, పీఆర్ ఇఇ వెంకట్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లిటిల్ ఫ్లవర్స్ లో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

భద్రాచలం టౌన్,ఫిబ్రవరి 21 (ప్రజాజ్యోతి) : %×% పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. తొలుత విద్యాసంస్థల డైరెక్టర్లు మాగంటి




శ్రీనివాసవరప్రసాద్, మాగంటి రమేష్బాబు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. తల్లిని ఎలా గౌరవిస్తామో మాతృభాషను కూడా అలాగే గౌరవించాలన్నారు. ప్రపంచంలో అనేక బాషలు కనుమరుగవుతున్న నేపథ్యంలో మాతృబాష ప్రాముఖ్యతను గుర్తెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తులసీదాస్, బాలాజీ, వేణు, శ్రీను, కో-డైరెక్టర్ మాగంటి సాయి సూర్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## టేకులపల్లి కాంప్లెక్ లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ప్రదర్శన బాలమేళ

### బాలమేళాను సందర్శించిన మండల విద్యాశాఖ అధికారి ఏ. జగన్

టేకులపల్లి, ఫిబ్రవరి 21,ప్రజాజ్యోతి : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ప్రదర్శన జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశానుసారం







టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం మెరుగు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం బాలమేల కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి అజ్మీర జగన్ హాజరై ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు నేర్చుకున్న, సృష్టించిన ప్రతీ అంశాన్ని ప్రదర్శించి ఈ బాలమెలను విజయవంతం చేసినందున హెచ్ఎం లను,ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం కాంప్లెక్స్ హెచ్ఎం మెరుగు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇది విద్యార్థుల ఎదుగుదలకు,కళాత్మక వ్యక్తీకరణకు ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు.ఈ బాలమెల ప్రథమ బహుమతి పొందిన ఎంపిపిఎస్ బేతంపూడి, ద్వితీయ బహుమతి ఎంపీపీఎస్ రేగుల తండ, తృతీయ బహుమతి పాత తడికలపూడి పొందిన వారికి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు చక్కని పాటలతో,డాన్సులతో ప్రదర్శన చేసి బాలమేళ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్య క్రమంలో రిసోర్స్ పర్సన్ గూగులోత్ నరేష్ ,కాం ప్లెక్స్ సెక్రటరీ బాణోత్ లక్ష్మ , వేంకట్రం,సిఆర్పి నాగేశ్వరావు,సుజాత, మంగిలల్, హాతీరం,వీరన్న, భారతి,స్వరూప, రాణి,రాంబాబు,బలరాం,రాంబాబు పాల్గొన్నారు.

## కొత్తతండా క్రికెట్ టోర్నమెంట్ ను ప్రారంభించిన కోరం సురేందర్

టేకులపల్లి, ఫిబ్రవరి 21, ప్రజాజ్యోతి : టేకులపల్లి మండలం కొత్తతండా పంచాయతీ లో జరిగే కొత్తతండా ప్రీమియర్ లీగ్ మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ను జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్ ప్రారంభించారు. అనంతరం టాస్ వేసి బ్యాటింగ్ చేస్తూ క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దేవా నాయక్, నాయకులు ఈది గణేష్, భూక్య సర్దార్, నాగేశ్వరావు, ముచ్చ సుధాకర్,బాలకృష్ణ, రమేష్ బాబు, సుఖ్య, గోవర్ధన్, దేవేంద్ర,హనుమంతు,



సుధీప్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు భద్రత ఎక్స్గ్రేషియా చెక్కు అందజేసిన పోలీస్ కమిషనర్

ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి : కొణిజర్ల పోలీస్ స్టేషన్ లో భాధ్యతలు నిర్వహిస్తూ ఇటీవల అనారోగ్యంతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ %జు%. లోకేశ్, అదేవిధంగా అనారోగ్యంతో మరణించినఏఆర్ కానిస్టేబుల్ ఐ.బాలరాజు కుటుంబ సభ్యులకు ఒక్కొక్క కుటుంబ సభ్యులకు రూ. 8,00,000/- భద్రత ఎక్స్గ్రేసియా చెక్కు ను శుక్రవారం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ...శాఖపరంగా ఎటువంటి సహాయ సహకారాలు అందించేందుకైన పోలీస్ అధికారులు అందుబాటులో వుంటారని అన్నారు. పోలీసు కుటుంబాలకు అన్ని విధాల ఆదుకుంటామన్నారు.



## శివరాత్రికి ఖమ్మం రీజన్లో 75 బస్సులు

### ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాం

సత్తుపల్లి ఫిబ్రవరి21 ప్రజా జ్యోతి.

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఖమ్మం రీజన్లో 75 బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఖమ్మం రీజినల్ మేనేజర్ ఏ సరిరాం తెలిపారు. శుక్రవారం నీలాద్రి ఆలయాన్ని సందర్శించిన అనంతరం సత్తుపల్లి డిపోలో జరుగుతున్న సిబ్బందికి శిక్షణా కార్యక్రమము లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యం ఖమ్మం రీజియన్ పరిధిలో శివాలయాలకు శివరాత్రి



పర్వదినం సందర్భంగా 75 బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఖమ్మం రీజియన్ పరిధిలో సత్తుపల్లి నుండి నీలాద్రికి 25 బస్సులు, ఖమ్మం నుండి తీర్థాలకు 25 బస్సులు వైరా నుండి స్నానాల లక్ష్మీపురం కు పది బస్సులు, భద్రాచలం నుండి మోతే గడ్డకు ఐదు బస్సులు, కొత్తగూడెం నుండి నీలాద్రి ,బెండలపాడు అన్నపురెడ్డిపల్లి కు పది బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. భక్తుల రద్దీని బట్టి అదనంగా బస్సులు నడిపేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. సత్తుపల్లి డిపోలో ఉద్యోగులకు ఇస్తున్న శిక్షణ తరగతులకు హాజరై వృత్తి పట్ల అంకితభావంతో, సమిష్టిగా పని చేసినట్లయితే విజయాలు అవే వస్తాయని ఆయన అన్నారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ,సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులను కోరారు. ఉద్యోగులకు రిఫ్రెష్ చేయడం కొరకే శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ ఎం ఓ జి ఎన్ పవిత్ర ఉన్నారు.

## ఫిబ్రవరి 28 వ జాతీయ సైన్స్ దినోత్సవం..

### గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో.. పదవ తరగతి బాలికలకు బహుమతులు అందజేసిన పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. హేమాలత

ఎల్కతుర్తి ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి)

పదవ తరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్ మరియు ప్రతిభా పురస్కారములు.





శుక్రవారం రోజున ఫిబ్రవరి 28వ జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని హుజురాబాద్ కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ వారు ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాలలో పదవతరగతి చదువుతున్నటువంటి విద్యార్థినులకు సైన్స్ టాలెంట్ టెస్టును ట్రస్ట్ నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) నిర్వహించి పాఠశాల ప్రిన్సిపాల్ ఏ హేమలత చేతుల మీదుగా బహుమతులు మంచి ప్రతిభ కనబరిచిన మొదటి ఐదుగురు విద్యార్థులు బి కళ్యాణి, ఎస్ అక్షిత, కే అక్షర, వి ప్రగతి, బి మేఘన లకు శంకర్ నారాయణ డిక్షనరీలు మరియు మెమొంటోళ్లు ప్రిన్సిపాల్ చేతుల మీద అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఓ అన్నపూర్ణ ,ఎం ఉమారాణి, పి కార్తీక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భద్రకాళి చెరువు మట్టిని ఉపయోగించు కోవాలి

### జిల్లా కలెక్టర్ ప్రావిణ్య.

హనుమకొండ జిల్లా ప్రతినిధి: ఫిబ్రవరి 21,ప్రజా జ్యోతి.

భద్రకాళి చెరువు పూడికతీత మట్టిని ఇటుక బట్టీల యజమానులు ఇటుకల తయారీకి, పొలాలను సారవంతం చేసుకునేందుకు రైతులు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా





కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో భద్రకాళి చెరువు పూడికతీత మట్టి తరలింపు, తదితర అంశాలపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా సాగునీటి పారుదల శాఖ ఈఈ శంకర్ మాట్లాడుతూ భద్రకాళీ చెరువు పూడికతీత మట్టిలో ఇప్పటివరకు నాలుగు లక్షల 60 వేల క్యూబిక్ మీటర్లను తీసుకెళ్లేందుకు దరఖాస్తులను తీసుకెళ్లారని అధికారులు తెలిపారు. ఈనెల 28వ తేదీ వరకు గడువు ఉన్నందున మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని తెలియజేశారు. ఈ సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, కుడా పివో అజిత్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ, హనుమకొండ తహసిల్దార్ శ్రీపాల్ రెడ్డి, సీఐ సీతా రెడ్డి, మున్సిపల్ డీఈ సంతోష్, మైనింగ్, రవాణా, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడు ప్రియ శిష్యుడు రేవంత్ రెడ్డి

### కృష్ణ నీటిని తెలంగాణ నుండి ఆంధ్రప్రదేశ్ కు తరలించుకుపోతున్న

### కాంగ్రెస్ పార్టీ ముఖ్య మంత్రిగా స్పందించడం లేదు

### బస్వాపూర్ తిమ్మాపురం ప్రాంత ప్రజలకు న్యాయం చేయలేకపోతున్న ఎమ్మెల్యే కుంభం

### మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి

భువనగిరి,ఫిబ్రవరి 21(ప్రజాజ్యోతి)

యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యా లయంలో,మాజీ ప్రభుత్వ విప్ ఆలేరు మాజీ శాసన సభ్యురాలు గొంగిడి సునీత మహేందర్ రెడ్డి మరియు బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు,కంచర్ల



రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ కృష్ణ నీటిలో తెలంగాణకు రావలసిన వాటాను,కూడా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే తరలించకపోవడాన్ని ఈ కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి,ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి తొత్తుగా వ్యవహరిస్తూ కృష్ణ నీటిని తరలిస్తున్న,అతనికి పట్టనట్టు వ్యవహరిస్తున్నారు కనీసం నల్లగొండ సూర్యపేట జిల్లాలకు తాగు సాగు నీటికి ఇబ్బందులు తలెత్తుతున్న పట్టింపు లేకుండా వ్యవహరి స్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు.కనీసం నీటిపారుదల మంత్రి ఉమ్మడి జిల్లా అతను ఐ కూడా తను కూడా పట్టించుకోకపోవడం చాలా అన్యాయం ఇప్పటికే నీటి కష్టాలు ప్రజలు అనుభ విస్తున్నారు.ఇదేవిధంగా ఉంటే రానున్న రోజులలో ఇంకా చాలా ఇబ్బందులు ఎదురవు తాయని ఘాటుగా విమర్శిం చారు.తక్షణమే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మన తెలంగాణ కు రావాల్సిన వాటాను మనం వాడుకునే విధంగా చూడవలసిందిగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.లేదంటే గతంలో 2002 సంవత్సరంలో ఇదేవిధంగా నీటి కష్టం వచ్చినప్పుడు కేసీఆర్ ఒక్క పిలుపునిస్తే,వేల ట్రాక్టర్లతో రైతులు అందరు కూడా కృష్ణ బ్యారేజ్ పైకి విచ్చేసి నిరసన వ్యక్తం చేసి ఏ విధంగానైతే మన వాటాను మనం దక్కిచ్చుకున్నామో,ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితి వస్తే బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన ఏ విధమైన పోరాటానికి అయినా సిద్ధంగా ఉందని తెలియజేసారు. అదేవిధంగా బస్వాపురం ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించడం జరిగింది.ఈరోజు 8 9,టీఎంసీల నీటిని నింపుకోవడానికి సిద్ధంగా ఉన్నా109,కోట్ల రూపా యలను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద తిమ్మాపూర్ గ్రామ నిర్వాసి తులకు చెల్లిస్తే మన ప్రాంతం గోదావరి నీటితో సస్యశ్యామలమవుతుందని ఇందు గాను 50 కోట్ల రూపాయలను యాదాద్రి జిల్లా కలెక్టర్ అకౌంట్లో ఉన్నవని మిగిలిన సుమారు 60 కోట్ల రూపాయల నువ్వు భువనగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే గా ముఖ్యమంత్రి నుండి వెచ్చిస్తే బస్వపురం ప్రాజెక్టును నింపుకొని రైతులకు లాభం జరిగే విధంగా చేసుకో వచ్చు అని తెలిపారు.ఈ కార్య క్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల,అధ్యక్షుడు జనగాం పాండు బిఆర్ఎస్ పార్టీ పట్టణ ప్రధాన,కార్యదర్శి రచ్చశ్రీనివాస్ రెడ్డి నాయకులు బీరు మల్లయ్య,పెంట నరసింహ కాజా ఆజిముద్దీన్,బబ్లు వీరేశం,మోత్కూపల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల23న 5వ తరగతి ప్రవేశ పరీక్ష

### ప్రిన్సిపాల్ అంబడిపూడి శారద



సిర్పూర్(టి) ప్రజాజ్యోతి ఫిబ్రవరి22

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ఆధ్వర్యంలో 5వ తరగతి నుండి 9వ తరగతుల్లో ప్రవేశాలకై నిర్వహించబడుతున్న సాధారణ ప్రవేశ పరీక్ష (సెట్-2025) ఈ నెల 23 (ఆదివారం) రోజున నిర్వహించనున్నట్లు సిర్పూర్-టి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల (డి.పి.ఐ.పి) ప్రిన్సిపాల్ శ్రీమతి అంబడిపుడి శారద తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మా సెంటర్లో (సెంటర్ కోడ్ %-% 250406) ఐదు నుంచి తొమ్మిది వ తరగతి వరకు రాసే అభ్యర్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని తెలియపరిచారు. పరీక్షకు వచ్చేటప్పుడు ఎగ్జామ్ పాడ్, హాల్ టికెట్, బ్లూ ఇంకు లేదా బ్లాక్ ఇంకు పెన్, తీసుకొని ఉదయం 9:00 గంటలకు ఎగ్జామ్ సెంటర్ దగ్గరకు చేరుకోగలరని తెలియజేశారు.

## రైతులకు అందుబాటులో ఎరువులు

మొదటిపేజీ తరువాయి..

9.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా వాడకం ఉన్నదని, దానిని ప్రామాణికంగా తీసుకొని, అంతకంటే ఎక్కువగా యూరియా అందుబాటులో ఉంచేటట్టు ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. అక్టోబర్ 1 నుండి ఇప్పటిదాకా కేంద్రం నుండి 8.54 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా ప్రణాళికలు ఇవ్వగా, కేవలము 6.73 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా కాబడినదని, ఇదే విషయాన్ని సీజన్ ఆరంభములో కూడా కేంద్రం దృష్టికి తీసుకువెళ్లగా, మన రాష్ట్ర అవసరాలను పరిగణలోకి తీసుకొని ఎప్పటికప్పుడు సరఫరా చేసే బాధ్యత తమదని కేంద్రం నుండి భరోసా వచ్చినప్పటికి కేవలం ఫిబ్రవరి మాసములోనే 45 వేల మెట్రిక్ టన్నుల యూరియా తక్కువగా రావడం జరిగిందని తెలిపారు. అయినప్పటికి రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్1 న ప్రారంభనిల్వలు 3.08 లక్షల మెట్రిక్ టన్నులను జాగ్రత్తగా సరఫరా చేస్తు, రాష్ట్రం మొత్తం మీద రైతుల అవసరాలకు తగ్గట్టు ఇప్పటిదాకా సరఫరా చేయడం జరిగిందని, ఇకముందు కూడా ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న 1.30 లక్షల మెట్రిక్ టన్నులను అవసరాల మేరకు ఆయా జిల్లాలకు సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. ఇదే సమయంలో మన రాష్ట్రానికి ఈ నెలలో రావాల్సిన యూరియాను వెంటనే ఇతర కంపెనీల ద్వారా సరఫరా చేయుటకు కేంద్ర రసాయనాలు ఎరువుల శాఖ మంత్రిని లేఖ ద్వారా తిరిగి కోరడం జరిగింది. మన రాష్ట్రానికి కేటాయించిన ఎరువులను సరఫరా చేయుటకు కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని, కావున రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని, వారి



అవసరం మేరకే కొనుగోలు చేయాల్సిందిగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి రైతులను కోరడం జరిగింది. సమావేశంలో వ్యవసాయశాఖ సంచాలకులు శ్రీ గోపి , కమిషనరేట్ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు భారీ షాక్

మొదటిపేజీ తరువాయి..

ఆ పార్టీలో ఇమడలేకపోయారు. కాంగ్రెస్ లో అంతర్గత రాజకీయాలు ఎక్కువగా ఉండటం.. తనను పట్టించుకోకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఓ సారి బీఎస్పీ తరపున కూడా గెలిచిన ఆయన తర్వాత బీఆర్ఎస్ లో చేరి మరోసారి గెలిచారు. అయితే గత ఎన్నికల్లో బీజేపీ సిర్పూర్ లో విజయం సాధించింది. బీఎస్పీ తరపున ప్రవీణ్ కుమార్ పోటీ చేయడంతో భారీగా ఓట్లు చీలి ఆయన ఓడిపోయారు. ప్రవీణ్ కుమార్ కూడా పరాజయం పాలయ్యారు. తర్వాత ప్రవీణ్ కుమార్ బీఆర్ఎస్ చేరడంతో అసంతృప్తికి గురైన కోనేరు కోనప్ప.. కాంగ్రెస్ లో చేరారు. అయితే కాంగ్రెస్ లో చేరినప్పటికీ.. తాను చెప్పిన పనులను మంజూరు చేయకపోవడంతో పాటు గతంలో నియోజకవర్గానికి తాను తీసుకువచ్చిన పనులు సైతం రద్దు చేస్తుండటంతో ఆయన అసంతృప్తికి గురయ్యారు. కాంగ్రెస్ నేత ఎమ్మెల్సీ దండే విఠల్ సైతం ఇక్కడ రాజకీయంగా పాగా వేసేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే కోనేరు కొనప్ప, దండే విఠల్ మధ్య ప్రచ్ఛనయుద్ధం సాగుతోంది. నిన్న మొన్నటి వరకు ఉప్పు, నిప్పులా ఉన్న కోనేరు కోనప్ప, ఆయన అల్లుడు శ్రీనివాస్ కలిసిపోయారు. కోనప్ప రాజకీయంగా ముందుకు సాగాలని చూసినా దండే విఠల్ కు పదవి ఉండటం, కోనప్పకి అలాంటిదేమీ లేకపోవడంతో ఇబ్బందికరంగా మారింది. అదే సమయంలో అధిష్టానం నుంచి సరైన మద్దతు లేకపోవడంతో ఏం చేయాలో ఆలోచనలో పడ్డారు. ఇటీవల ఓ సభలో తాను వచ్చే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఏ రాజకీయ నిర్ణయమైనా ప్రజల ముందే తీసుకుంటానని స్పష్టం చేశారు. కేసీఆర్ దేవుడిలా వంతెన, రోడ్లు, అభివృద్ధి పనులు మంజూరు చేస్తే వాటిని రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలోని మంత్రులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేరు కోనప్ప తిరిగి బీఆర్ఎస్ పార్టీకి దగ్గరయ్యే అవకాశం ఉందంటూ రాజకీయ పరిశీలకులు చెబుతున్నారు. అయితే ఆయనకు టిక్కెట్ గ్యారంటీ ఉంటేనే ఆ పార్టీలో చేరే అవకాశాలు ఉన్నాయి. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్వస్థలం సిర్పూర్ కాకపోయినా అక్కడి నుంచే రాజకీయం చేస్తున్నారు. ఆయనను వేరే ప్రాంతానికి పంపించి తనకు సిర్పూర్ ఇస్తే బీఆర్ఎస్ లో చేరుతానని ఆయన ప్రకటించే అవకాశం ఉంది. ఈ అంశంపై బీఆర్ఎస్ నేతలు నిర్ణయం తీసుకోనున్నారు.

## తాజ్ బంజారాకు జీహెచ్ఎంసీ షాక్

మొదటిపేజీ తరువాయి..

చెల్లించాలని పలు మార్లు నోటీసులు ఇచ్చినా హోటల్ యాజమాన్యం స్పందించలేదు. దీంతో అధికారులు హోటల్‌ను సీజ్ చేశారు. మొత్తం రూ. కోటి 47 లక్షల టాక్స్ పెండింగ్ ఉందని, పన్ను చెల్లించాలని.. జీహెచ్ఎంసీ అధికారులు 5 సార్లు నోటీసులు ఇచ్చిన హోటల్ యాజమాన్యం స్పందించక పోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. గడిచిన రెండు సంవత్సరాలుగా హోటల్ నిర్వాహకులు జీహెచ్ఎంసీకి పన్ను బకాయలు చెల్లించలేదు. దీనిపై పలుమార్లు నోటీసులు ఇచ్చారు. అయినా హోటల్ నిర్వాహకుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు. పరిస్థితి గమనించిన జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం ఉదయం హోటల్‌ను సీజ్ చేశారు. హైదరాబాద్ సిటీలో ఫేమస్ అయిన.. నిత్యం బిజీగా ఉండే తాజ్ బంజారా హోటల్‌కు సెలబ్రెటీలు ఎక్కువగా వస్తుంటారు. క్రికెటర్లు ఎప్పుడు వచ్చినా ఈ హోటల్‌లో బస చేస్తుంటారు. అలాగే దేశంలోని కీలక రాజకీయనేతలు హైదరాబాద్ వచ్చినప్పుడు ఇక్కడే స్టే చేస్తారు.

## ఎమ్మెల్సీగా ఆల్ఫోర్స్ డాక్టర్ ఉట్కూరి నరేందర్ రెడ్డినీ గెలిపిద్దాం...

### కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి..

### యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబాల శ్రీకాంత్...

ఎల్కతుర్తి ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి)

పట్టభద్రుల ఎన్నికలలో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ అభ్యర్థిని గెలిపే లక్ష్యంగా బీసీ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఆదేశాల మేరకు ఆల్ఫోర్స్ డాక్టర్ వుట్కూరి నరేందర్ రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించాలని





కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఇంద్రసేనారెడ్డి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంబాల శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ నాయకులకు యూత్ కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున ఎల్కతుర్తి మండలం కేంద్రంలో మరియు వివిధ గ్రామాలలో పట్టభద్రుల ఓటర్ల దగ్గరకి వెళ్లి ప్రచార కార్యక్రమం చేసినారు ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వుట్కూరి నరేందర్ రెడ్డి విజయం కోసం ఎల్కతుర్తి మండల పట్టభద్రులందరూ ఏకం కావాలని అన్నారు. పట్టభద్రుల ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు క్రమ సంఖ్య 2వ నెంబర్ పై నరేందర్ రెడ్డికి ఓటు వేసి గెలిపించాలని అన్నారు. పట్టభద్రులు దుష్ప్రచారాలతో కొంతమంది ఓట్ల కోసం వస్తారు అప్రమత్తంగా ఉండాలని సోషల్ మీడియా వారియర్స్ ఆక్టివ్ గా ఉండాలని పిలుపునిచ్చారు. అపార విద్యావేత్తగా, జ్ఞానిగా పేరుపొందిన విద్యా సంస్థలను నడిపిస్తున్న వుట్కూరి నరేందర్ రెడ్డి భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంత ఉందని అన్నారు వారితో పాటు ఎల్కతుర్తి మండల యూత్ అధ్యక్షులు అంబాల శ్రీకాంత్ (బక్కి)స్పష్టం చేశారు. వివిధ గ్రామా శాఖ అధ్యక్షులకు ఓటర్ లిస్ట్ పంపిణి చేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సుకినే సంతాజి,ఎల్కతుర్తి గ్రామ శాఖ అధ్యక్షులు శీలం అనిల్ కుమార్, వివిధ గ్రామ శాఖ అధ్యక్షులు, రవీందర్, రమేష్, తిరుపతి, నరేందర్, శ్రవణ్, రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ రమేష్ బాబు, తిరుపతి, సీనియర్ నాయకులు పాక రమేష్, గొడిశాల రాజయ్య గౌడ్, అంబాల జగన్, యూత్ కాంగ్రెస్ నాయకులు, అంబాల రాజు, వినయ్, ప్రదీప్, వెంకట్, నితిన్,అభిలాష్, తదితరులు పాల్గొన్నారు

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పోస్ట్ కార్డు ఉద్యమ ం

భీమదేవరపల్లి ఫిబ్రవరి 21 ప్రజాజ్యోతి

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పోస్ట్ కార్డు ఉద్యమం చేశారు. తెలంగాణ ఉద్యమ కళాకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలక్షన్ల ముందు మేనిఫెస్టో చెప్పిన విధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కళాకారులను ఉ



ద్యమకారులను గుర్తించి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కళాకారుల బంధువుగా కావాలని కోరుకుంటూ తెలంగాణ నిరుద్యోగ కళాకారులు ఉద్యమకారులు పోస్ట్ కార్డు ఉద్యమం చేస్తున్నారు తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కన్వీనర్ చీమ శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమ కళాకారుల ఫోరం కన్వీనర్ ఎల్ల పోశెట్టి ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కోఆర్డినేటర్ ప్రముఖ కళాకారుడు ప్రముఖ కళాకారుడునంది అవార్డు గ్రహీత వెన్నమల్ల వెంకటేష్, గడ్డం సుధాకర్ ,పాలేటి రాజు ,పిలుపుమేరకు ఎల్కతుర్తి మండలం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలం కన్వీనర్లు కో కన్వీనర్లు కలిసి పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టడం జరిగింది .

## నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అందజేసిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ బండి రమేష్

కూకట్ పల్లి, ఫిబ్రవరి 21 (ప్రజా జ్యోతి) :

కూకట్ పల్లి నియోజక వర్గం వివేక్ నగర్ లో నివాసం ఉంటున్న వనరస యాదగిరి తండ్రి వి.సీతారాములు (50) గత కొంత కాలంగా మొకాళ్ళ నొప్పితో బాధపడుతున్నారు. పంజాగుట్ట లోని నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స నిమిత్తం వైద్యులు



మోకాలికి బైపాస్ సర్జరీ చేయవలసిందిగా సూచించారు. ఈ మేరకు వారి మనవరాలు కూకట్ పల్లి లోని గొట్టిముక్కల వెంకటేశ్వరరావు కార్యాలయంలో సంప్రదించగా కూకట్ పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిదికి దరఖాస్తు చేయించగా వారికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 1,50000 (లక్ష యాభై వేల రూపాయలు) మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా శుక్రవారం ఎల్ఓసి పత్రాలను కూకట్ పల్లి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గొట్టిముక్కల వేంకటేశ్వర రావుల చేతుల మీదగా యాదగిరి మనవరాలు రీతుకు అందచేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులైన రీతు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967